10. 3. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

మంగళవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 273 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



శాసనసభలో

## ఏ చర్చకైనా సిద్ధం

- మంత్రి పొంగులేటి

2 లో..



## ప్రజాసేవలో ఎప్పుడూ పోలీసులే ముందు

- నేరాల తీరు మారి.. సైబర్ క్రైమ్ పెరిగింది
- నేరాల తీరుకు అనుగుణంగా పనితీరు మార్చుకోవాలి
- పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్‌లో సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,మార్చి9 వెలుతురు:**
ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి పోలీస్ అధికారులు చేస్తున్న కృషిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. మనం ఎక్కడున్నామోతెలిసుకోగలిగితే మనం ఎక్కడికి చేరుకోవాలో తెలుస్తుందన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమిలో తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్-2026 కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ రిట్రీట్ కార్యక్రమం ద్వారా సమస్యలు, పరిష్కారాలపై విశ్లేషించుకున్నట్లు సిఎం తెలిపారు. ఛాలెంజ్ లు రెండు రకాలు.. ఒకటి టెక్నికల్ ఛాలెంజ్, రెండోది అడాప్టివ్ఛాలెంజ్ అన్నారు. రిసోర్సెస్, సమయాన్ని కేటాయిస్తే టెక్నికల్ ఛాలెంజ్ ను అధిగమించవచ్చున్నారు. కానీ అడాప్టివ్ఛాలెంజ్ విషయంలో ఎదురైన సమస్య లోతును అర్థంచేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే శాంతిభద్రతలు అదుపులో ఉండాలన్నారు. రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ ఉండకూడదనే తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ డాక్యుమెంట్ ను ఆవిష్కరించుకున్నామని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడానికి



## మూసీ అభివృద్ధిని అడ్డుకోవడం తగదు



- నిర్వాసితులకు డబుల్ ఇళ్లు ఇస్తాం
- కూకట్‌పల్లి నల్ల చెరువును ప్రారంభం
- చెరువుకు హారతి ఇచ్చిన సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మార్చి 9( వెలుతురు):**
మూసీ అభివృద్ధిని అడ్డుకోవడమంటే..తెలంగాణ పురోగతిని అడ్డుకోవడమే అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నిర్వాసితుల్లో అర్హులైన

అమెరికా, ఇజ్రాయెల్‌తో

## మోదీ రాజీపడ్డారు

- కుట్ర బయటపడుతుందనే వెనుకడుగు
- దేశ ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది
- సంక్షోభంతో చమురు ధరల పెరుగే అవకాశం
- కేంద్రంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- పశ్చిమాసియా సంక్షోభంపై చర్చకు డిమాండ్

**న్యూఢిల్లీ,మార్చి 9( వెలుతురు):**
భారత ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంట్‌లో చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం ఇష్టపడటం లేదని ఆరోపించారు. పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంట్‌లో చర్చ జరిగితే ప్రధాని మోదీ అమెరికా, ఇజ్రాయెల్‌కు ఎలా రాజీ పడ్డారో బయటపడుతుందని అన్నారు.



## పేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు భరోసా
## రూ. 3.24 కోట్ల విలువైన చెక్కుల పంపిణీ

- నిజామాబాద్ రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల అందజేత
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్





**నిజామాబాదు వెలుతురు మార్చి 09:**
పేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు భరోసా రూ. 3.24 కోట్ల విలువైన చెక్కుల పంపిణీ, నిజామాబాద్ రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల అందజేత. నిజామాబాద్ నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చెందిన 324 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ



## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఘనంగా వీడ్కోలు

**హైదరాబాద్,మార్చి9 వెలుతురు:**
మహారాష్ట్ర గవర్నర్ గా బదిలీపై వెళ్తున్న సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ , కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఘనంగా వీడ్కోలు పలికింది. బేగంపేట ఎయిర్ పోర్ట్ లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాను అందజేసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారితో కరచాలనం చేసి ఆత్మీయంగా పలకరించారు.

## ఎనిమిదేళ్ల యుద్ధానికైనా సిద్ధం



- చమురు సంపద కోసమే ఈ యుద్ధం
- చమురు కబ్జాకు అమెరికా పన్నాగం
- ఇరాన్‌ను ముక్కలు చేసేందుకు కుట్ర
- దేశాన్ని కాపాడుకునేందుకే మా పోరాటం
- అమెరికా, ఇజ్రాయెల్‌కు లొంగే ప్రసక్తే లేదు
- ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వెల్లడి
- హోర్మూజ్ జలసంధి మూసివేతపై సంకేతాలు!

**లెబనాన్, మార్చి9( వెలుతురు):**
అమెరికాపై ఇరాన్ సంచలన ఆరోపణలు చేసింది. తమ దేశాన్ని ముక్కలు చేయాలని అమెరికా కుట్ర పన్నిందని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘయీ ఆరోపించారు. ఇరాన్‌కు చెందిన అపార చమురు సంపదపై నియంత్రణ

## కవితకు మళ్లీ నోటీసులు!

- లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం..
- కవిత సహా 23 మందికి నోటీసులు

2 లో..



## తెలంగాణ నుంచి ఇద్దరు రాజ్యసభకు ఏకగ్రీవం

- ధృవీకరణ పత్రాలు అందచేత

2 లో..



బీజేపీ నూతన ప్రజాప్రతినిధులతో

## 14న అంజన్న ఆశీర్వాద యాత్ర

- వేలాది మందితో కలిసి బండి సంజయ్ మహా పాదయాత్ర
- ఉదయం 7 గంటలకు కరీంనగర్ మహాశక్తి ఆలయం నుండి పాదయాత్రకు శ్రీకారం
- ఉదయం నుండి సాయంత్రంలోపు 40 కి.మీలు పాదయాత్ర చేయనున్న కేంద్ర మంత్రి
- సాయంత్రం 4 గంటలకు కొండగట్టుకు చేరుకోనున్న కేంద్ర మంత్రి
- నూతన ప్రజాప్రతినిధులతో కలిసి అంజన్నకు మొక్కులు తీర్చుకోనున్న బండి సంజయ్
- దాదాపు 10 వేల మంది కార్యకర్తలు మహాపాదయాత్రలో పాల్గొనేలా కార్యాచరణ
- మహాపాదయాత్ర ఏర్పాట్లపై నేడు ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- రాజకీయాలకు అతీతంగా భక్తిపాటలు, డప్పు చప్పుళ్లతో సాగనున్న ఆధ్యాత్మిక మహాపాదయాత్ర
- అంజన్న ఆశీర్వాద యాత్రకు మంగళహారతులు, పూల జల్లులతో స్వాగతం పలికేందుక సిద్ధమైన గ్రామాలు



## శ్రీవారికి అపచారం చేస్తే ఊరుకునేది లేదు

- లడ్డూ కల్తీపై ఇంకా సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు
- గతంలో జరిగిన పొరపాట్లు లేకుండా పట్టాదార్ పాస్ పుస్తకాలు
- నంద్యాల జిల్లా పర్యటనలో సిఎం చంద్రబాబు

**నంద్యాల,మార్చి9 వెలుతురు:**
శ్రీవారికి అపచారం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని, మతవిద్వేషాలను రెచ్చగొట్టాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోమారు హెచ్చరించారు. లడ్డూ కల్తీపై ఇంకా సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సోమవారం డోన్ నియోజకవర్గంలోని కొత్తబురుజు గ్రామంలో ముఖ్యమంత్రి పర్యటించారు. రైతులకు నూతన పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పాస్‌పుస్తకాలు, సర్వే రాళ్లపై జగన్ ఫొటోలు ఉండటం ఏంటి అని ప్రశ్నించారు. ఇదేంటని అడిగితే బాధితులపైనే కేసులు పెట్టారని విమర్శించారు. వైసీపీ హయాంలో జరిగిన తప్పులను సరిచేస్తున్నామని చెప్పారు. రికార్డులు తారుమారు చేయకుండా పకడ్బంధీగా పాస్‌పుస్తకాలు ఇస్తున్నామని, క్యూఆర్ కోడ్‌తో పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఎవరు తప్పు చేసినా వెంటనే తెలుస్తుందన్నారు. ఒక్కపైసా కూడా అవినీతి లేకుండా పట్టా ఇప్పించే బాధ్యత తమదని స్పష్టం చేశారు. సమస్యలన్నీ

## తెలంగాణ నుంచి ఇద్దరు రాజ్యసభకు ఏకగ్రీవం

**హైదరాబాద్,మార్చి9 వెలుతురు:**

తెలంగాణ నుంచి నామినేషన్ దాఖలు చేసిన ఇద్దరు అభ్యర్థులు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డి సోమవారం ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున వేం నరేంద్ర రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీలు రాజ్యసభకు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. అందుకు సంబంధించిన పత్రాలను వీరికి అందజేసినట్లు తెలిపారు. అభిషేక్ మను సింఘ్వీ తరఫున అడ్వకేట్ సుందర్ చౌహాన్ అందుకున్నారు. వేం నరేందర్ రెడ్డి అసెంబ్లీ కార్యాలయానికి వచ్చి ధృవీకరణ పత్రం స్వీకరించారు. రాజ్యసభలో పలువురి సభ్యుల పదవి కాలం ఏప్రిల్‌లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇటీవల కేంద్ర ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. గురువారంతో నామినేషన్ల ప్రకియ ముగిసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ తరఫున తెలంగాణ నుంచి అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. తెలంగాణ అసెంబ్లీలో ఏర్పాటు చేసిన రాజ్యసభ ఎన్నికల కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డికి వీరు తమ నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఇక.. సాయి అనే వ్యక్తి సైతం ఈ రాజ్యసభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అతడి అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకపోవడంతో.. శుక్రవారం ఆ నామినేషన్‌ను తిరస్కరించారు. అలాగే ఇతరులు ఎవ్వరూ నామినేషన్ల దాఖలు చేయలేదు. దీంతో కాంగ్రెస్ నుంచి నామినేషన్ల దాఖలు చేసిన అభిషేక్, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక ఏకగ్రీవమైంది.

## శ్రీవారికి అపచారం చేస్తే ఊరుకునేది లేదు

పరిష్కరించాకే కొత్త పాక్ బుక్స్ ఇస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఎక్కడా తప్పులు జరగకుండా చూస్తామని సీఎం అన్నారు. గత ఐదేళ్లు దుర్మార్గ పాలన సాగిందని సీఎం విమర్శించారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీవారి ప్రసాదాన్ని కూడా కల్తీ చేశారని సీఎం ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం తిరుమల పవిత్రతను దెబ్బతీసే ప్రయత్నం చేసిందని విమర్శించారు. సీబీఐ రిపోర్ట్ ఇచ్చినా లడ్డూ కల్తీపై తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తిరుమలపై దృష్టి పెట్టానని సీఎం తెలిపారు. కల్తీ మద్యంతో చాలా మంది చనిపోయేలా చేశారని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. హంద్రీనీవాతో తాగునీరు, కుప్పానికి కూడా నీళ్లు ఇచ్చామని చెప్పారు. రాయలసీమలో ప్రతి ఎకరానికి నీళ్లు ఇవ్వాలనేది తన సంకల్పమని పేర్కొన్నారు. మాజీ మంత్రి వివేకాను దారుణంగా చంపారని.. నాన్న లేరు చిన్నాన్న కూడా లేరంటూ డ్రామాలు ఆడారని సీఎం విమర్శించారు. నారాసుర రక్తచరిత్ర అంటూ తన చేతిలో కత్తి పెట్టారని ఆరోపించారు. జగన్ మాటలు నమ్మి 2019లో తనకు ఓటు వేయలేదని చెప్పారు. తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఎదురుదాడి చేస్తున్నారని ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేశారు. డబ్బు మీద ఆశతో ఒక్కరి కంటే ఎక్కువ మందిని కనడం లేదని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పుడు ఇద్దరి కంటే ఎక్కువ మందిని కనాల్సిన అవసరం వచ్చిందని తెలిపారు. పెద్ద కుటుంబానికి ఎక్కువ సహాయం చేసేలా పథకాలు తీసుకొస్తామన్నారు. రైతే రాజు కావాలని.. రైతు అప్పులపాలు కావడానికి వీల్లేదన్నారు. దీపం పథకం ద్వారా మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని అన్నారు. గత పాలనకు ఈ పాలనకు తేడా ఏంటో ప్రజలే గమనించాలన్నారు. ఇప్పుడు రాష్ట్రానికి పెట్టుబడులు పెద్ద ఎత్తున వస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. కాగా.. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హార్టికల్చర్ పంటల ఉత్పత్తుల స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఫ్రూట్ కవర్ల వాడకం వల్ల పండ్లకు మంచి ధర లభిస్తుందని హార్టికల్చర్ అధికారులు తెలిపారు. దీనిపై రైతులకు మరింత అవగాహన కల్పించాలని సీఎం అధికారులకు ఆదేశించారు. కవర్ తొడిగిన పండ్ల నాణ్యతను, కవర్ లేని పండ్ల నాణ్యతను సీఎం స్వయంగా పరిశీలించారు. జిల్లాలో మంచి రేట్లు రావడానికి వివిధ వెరైటీల పంటలను ప్రోత్సహించాలని సూచించారు. భూగర్భ జలాల స్థాయిలు పెరిగేలా నీటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

## వెలుగుమట్ల బాధితులతో కవిత ధర్నా

ఆమెను అదుపులోకి తీసుకున్నారు. కవితతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ విశారదన్, పలువురు ఆందోళనకారులను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మం నగరంలో వెలుగుమట్ల ప్రాంతానికి చెందిన భూదాన్ యజ్ఞ బోర్డు భూముల నిర్వాసితులతో కలిసి కవిత సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అంబేడ్కర్ సెంటర్ వరకు కొనసాగింది. అక్కడికి చేరుకున్న అనంతరం కవిత అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ ర్యాలీ అనంతరం నిర్వాసితులు ఖమ్మం జడ్పీ సెంటర్ వద్ద ఆందోళనకు దిగారు. తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వారు నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనలో భాగంగా కొంతమంది నిర్వాసితులు రాస్తారోకో నిర్వహించి వాహనాలను అడ్డుకున్నారు. దీంతో జడ్పీ సెంటర్ పరిసరాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించారు. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ చైర్మన్ విశారదన్‌తో పాటు పలువురు నిర్వాసితులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం కవితను నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆందోళనల నేపథ్యంలో ఖమ్మం జడ్పీ సెంటర్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టారు.

## కవితకు మళ్లీ నోటీసులు!



**న్యూఢిల్లీ,మార్చి 9( వెలుతురు):**

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కల్వకుంట్ల కవిత సహా 23 మంది నిందితులకు ఢిల్లీ హైకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. రౌస్ అవెన్యూ కోర్టు నిందితులకు ఊరట కలిగిస్తూ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన కోర్టు, ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ.. తదుపరి విచారణను మార్చి 16వ తేదీకి వాయిదా వేసింది. సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మోహతా వాదనలు వినిపించారు. ఇటీవల ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఈ కేసులో నిందితులుగా ఉన్న ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, కల్వకుంట్ల కవితతో పాటు మొత్తం 23 మందిపై సీబీఐ అభియోగాలను డిశ్చార్జ్ చేస్తూ వారికి ఊరట కలిగించడం తెలిసిందే. అయితే ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో నిందితులకు అనుకూలంగా రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కేసు విచారణలో భాగంగా నిందితులపై ఉన్న అభియోగాలను మరింత లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని, కింది కోర్టు నిర్ణయంపై స్టే ఇవ్వాలని సీబీఐ కోరింది. దీనిపై స్పందించిన ఢిల్లీ హైకోర్టు, నిందితులు విచారణకు హాజరు కావాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. ఇటీవల రౌస్ అవెన్యూ కోర్టు లిక్కర్ స్కాం కేసులో కీలక వ్యాఖ్యలు చేసింది. దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లలోని కొన్ని అంశాలపై స్పష్టత లేదని, సాక్ష్యాధారాల సేకరణలో జాప్యం జరుగుతోందని కోర్టు అభిప్రాయపడింది. కొందరు నిందితులు తమపై ఉన్న కేసులను కొట్టివేయాలని (డిశ్చార్జ్) కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లపై రౌస్ అవెన్యూ కోర్టు సానుకూలంగా స్పందించింది. కేవలం ఆరోపణలతో కేసు దర్యాప్తు జరిగిందని, తగినన్ని ప్రాథమిక ఆధారాలు లేకుండా నిందితులను ఎక్కువ కాలం జైల్లో ఉంచడం లేదా విచారణను సాగదీయడం సరికాదని కోర్టు పేర్కొంది. ఈ క్రమంలోనే 23 మంది నిందితులపై ఉన్న అభియోగాలను కోర్టు కొట్టివేస్తూ వారి లిక్కర్ పాలసీ కేసు నుంచి విముక్తి కల్పించింది. సీబీఐ ఇప్పుడు ఈ అంశాలన్నింటినీ ఢిల్లీ హైకోర్టులో సవాలు చేస్తోంది. ఆప్ ప్రభుత్వం హయాంలో జరిగిన లిక్కర్ పాలసీ స్కామ్‌లో భారీగా ముడుపులు చేతులు మారాయని, దీని వెనుక ఉన్న 'సౌత్ గ్రూప్', ఇతర రాజకీయ నేతల ప్రమేయాన్ని నిరూపించడానికి మరింత లోతుగా దర్యాప్తు జరగాలని సీబీఐ వాదిస్తోంది. ఈ కేసు తదుపరి విచారణ మార్చి 16కు ఢిల్లీ హైకోర్టు వాయిదా వేసింది.

# ప్రజాసేవలో ఎప్పుడూ పోలీసులే ముందు

ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న 2100కి.మీ ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ గా పరిగణించుకుంటున్నాం అని అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమిగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని అన్నారు. దేశంలో ఢిల్లీ అత్యంత కాలుష్య నగరంగా మారింది. ట్రాఫిక్ సమస్యలతో బెంగుళూరు నగరంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముంబై, చెన్నై నగరాలు వరదలతో సతమతమవుతున్నాయి. అలాంటి మెట్రోపాలిటన్ నగరాల నుంచి మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏ సమస్య వచ్చినా ప్రజలు మొట్టమొదట సహాయం కోసం ఎదురు చూసేది పోలీసుల కోసమేనని అన్నారు. ఒకప్పుడు తీవ్రవాదం ఒక సమస్యగా ఉండేది.. ఇందుకోసం ఆక్టోపస్, గ్రేహౌండ్స్ లాంటి వ్యవస్థలు తీసుకొచ్చారు. అవినీతిని నిరోధించేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఫిజికల్ క్రైమ్ నిరోధించేందుకు ఇప్పటి వరకు వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాం. కానీ ఇప్పుడు నేర స్వరూపమే మారిపోయింది. సైబర్ క్రైమ్ పెరిగిపోతున్న ఈ రోజుల్లో మన సిస్టం ను అప్ గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక నైపుణ్యం ఉన్న అధికారులను నియమించుకోవాల్సిన అవసరం ఉంది. ఉన్న సిబ్బంది, అధికారులను అప్ గ్రేడ్ చేసుకోకపోతే నేరాలను నిరోధించలేమని గుర్తు చేశారు.

రిట్రీట్ కార్యక్రమం ద్వారా మీ సమస్యలను గుర్తించి విశ్లేషించుకున్నారు. సమస్య ఏమిటో గుర్తిస్తే 50 శాతం సమస్య పరిష్కారం అయినట్లే. సైబర్ క్రైమ్, నార్కోటిక్స్, రిక్రూట్ మెంట్, ఇతర అంశాలకు సంబంధించి వివిధ సమస్యల పరిష్కారానికి మీరు కొన్ని ప్రతిపాదనలు అందించారు. సమస్యల పరిష్కారానికి మీరు అందించిన ప్రతిపాదనలపై విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక అధికారుల కమిటీ ఏర్పాటు చేస్తాం.. మీ ప్రతిపాదనలపై కమిటీలో విశ్లేషించి చట్టం రూపంలో మా ముందుకు తీసుకురండి. సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రభుత్వం దానిపై నిర్ణయం తీసుకుంటుంది. పోలీస్ శాఖలో సిబ్బంది రేషనలైజేషన్ చేసుకుని జనాభా ప్రాతిపదికన పోలిసింగ్ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి. పోలీస్ శాఖలోని వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలి. పోలీస్ శాఖలో ఉద్యోగులు ఆటో మోడ్ కు వెళితే సమాజానికి అత్యంత ప్రమాదకరం. ఇతర శాఖల్లా పోలీస్ శాఖలో ఆటో మోడ్.. ఆటో ప్రమోషన్ ఉండదు. పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు అప్ గ్రేడ్ అవ్వాల్సిందేనని అన్నారు.అవసరమైన నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంది. మీ పనితీరు ఆధారంగానే పోస్టింగులు ఉంటాయి. ప్రతీ ఏటా డిసెంబరులో రిట్రీట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. బడ్జెట్ ప్రవేశపెట్టకముందే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకుంటే అవసరమైన నిధులను బడ్జెట్ లో కేటాయించుకోవచ్చని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్యక్రమానికి వచ్చిన సిఎంకు పోలీస్ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.

# బీజేపీ నూతన ప్రజాప్రతినిధులతో 14న అంజన్న ఆశీర్వాద యాత్ర

**కరీంనగర్ వెలుతురు మార్చి 09:**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ "అంజన్న ఆశీర్వాద యాత్ర" పేరిట ఈనెల 14న మహా పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, ఉప సర్పంచులు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేషన్ కార్పొరేటర్లు, మేయర్, డిప్యూటీ మేయర్ తోపాటు దాదాపు 10 వేల మంది కార్యకర్తలతో కలిసి ఈ మహా పాదయాత్ర చేయబోతున్నారు. కరీంనగర్ మేయర్ పదవిని బీజేపీకి అప్పగిస్తే తన పార్లమెంట్ పరిధిలోని నూతనంగా ఎన్నికైన బీజేపీ ప్రజాప్రతినిధులందరితో కలిసి కొండగట్టు అంజన్న ఆలయానికి కాలినడక వచ్చి మొక్కులు తీర్చుకుంటానని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ప్రకటించిన విషయం తెలిసిందే... ప్రజలంతా బీజేపీని ఆశీర్వదించి మేయర్ పీఠాన్ని అప్పగించడంతోపాటు పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో గతంతో పోలిస్తే అత్యధికంగా పంచాయతీ వార్డు సభ్యులు, సర్పంచ్, కౌన్సిలర్, కార్పొరేటర్ స్థానాలను గెలుచుకోవడంతో ఇచ్చిన మాట ప్రకారం మొక్కులు తీర్చుకునేందుకు బండి సంజయ్ సిద్ధమయ్యారు.

అందులో భాగంగా ఈ మహా పాదయాత్రకు "అంజన్న ఆశీర్వాద యాత్ర"అని నామకరణం చేశారు. ఈనెల 14న ఉదయం 7 గంటలకు కరీంనగర్ లోని మహాశక్తి ఆలయం నుండి ఈ మహాపాదయాత్రను ప్రారంభిస్తారు. పాదయాత్ర విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్ల కోసం డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల ఇంఛార్జ్ లు భండారి శాంతికుమార్, మోహన్ రెడ్డి, ఆయా జిల్లాల అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపి, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్, కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ కుమార్ రేపు మధ్యాహ్నం సమావేశం కానున్నారు. పాదయాత్ర ఏర్పాట్ల కోసం కోసం ప్రత్యేకంగా కమిటీని నియమించనున్నారు. కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు సైతం మహాపాదయాత్ర ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు.

మరోవైపు ఈ మహాపాదయాత్రలో బండి సంజయ్ తో కలిసి అడుగులో అడుగులు వేసేందుకు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కార్యకర్తలంతా సిద్ధమయ్యారు. ఈ మేరకు కరీంనగర్ ఎంపీ కార్యాలయానికి ఫోన్లు చేసి తాము పాదయాత్రకు వస్తామని పేర్లు నమోదు చేసుకుంటున్నారు. పార్లమెంట్ పరిధిలోని పోలింగ్ బూత్ కమిటీ సభ్యుల మొదలు, మండల, జిల్లా, పార్లమెంట్ స్థాయి నాయకులంతా ఈ మహాపాదయాత్రలో పాల్గొంటారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహించే పూర్తి ఆధ్యాత్మిక భావనతో ప్రతి ఒక్కరూ ఈ పాదయాత్రలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 14న ఉదయం 7 గంటలకు కరీంనగర్ మహాశక్తి ఆలయం నుండి ఈ మహా పాదయాత్ర ప్రారంభమవుతుంది. రేకుర్తి, కొత్తపల్లి, గంగాధర, పూడూరు, కొడిమ్యాల, మల్యాల మీదుగా కొండగట్టు అంజన్న ఆలయం వద్దకు చేరుకుంటారు. దాదాపు 40 కి.మీల మేరకు కాలి నడకన వెళ్లి కొండగట్టు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు. మరోవైపు నూతన ప్రజాప్రతినిధులతో కలిసి బండి సంజయ్ పాదయాత్రకు వస్తుండటంతో... ఆయా గ్రామాల్లోని, కాషాయ కార్యకర్తలు, హిందుత్వ వాదుల్లో జోష్ నెలకొంది. సంజయ్ పాదయాత్రకు మంగళహారతులు, పూలతో ఘన స్వాగతం పలకాలని నిర్ణయించారు. వేసవి కాలం ప్రారంభం కావడంతో దారిపొడవునా పాదయాత్ర చేసే కార్యకర్తలు మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లతోపాటు అవసరమైన మేరకు పులిహోర ప్యాకెట్లను కూడా సిద్ధం చేయనున్నారు. ఈ పాదయాత్రలో పలు స్వచ్ఛంద సంస్థలు, భక్త మండళ్లు సైతం ఈ పాదయాత్రలో పాల్గొనే వారికి తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధమయ్యాయి.

# మూసీ అభివృద్ధిని అడ్డుకోవడం తగదు

పేదలు ఉంటే వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తాం. పేదవాడి ఇల్లు కూల్చడం ప్రభుత్వ ఉద్దేశం కాదన్నారు. వరదల వల్ల ఇళ్లు మునిగిపోతే కుటుంబం మొత్తం నష్టపోతుంది. వరద ముప్పును తప్పించాలంటే చెరువులను పునరుద్ధరించాలి. మూసీని పునరుద్ధరించకుంటే భవిష్యత్ తరాలు మనల్ని క్షమించవని అన్నారు.. భాజపా ప్రభుత్వాలు గంగా, సబర్మతి, సరయూ నదుల అభివృద్ధిని చేపట్టలేదా? మూసీ అభివృద్ధిని మాత్రం ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. మూసీ పునరుద్ధరణను వ్యతిరేకించడమంటే రాష్ట్రానికి అన్యాయం చేయడమేనని, దీనివల్ల ఎవరికైనా నష్టం జరిగితే మంచి పరిహారం ఇచ్చి ఆదుకుంటాం అని రేవంత్‌రెడ్డి తెలిపారు. కూకట్‌పల్లి నల్ల చెరువు అభివృద్ధి చూస్తే ఆనందంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైడ్రా పునరుద్ధరించిన కూకట్‌పల్లి నల్ల చెరువును ప్రారంభించి ఆయన మాట్లాడారు. సీఎంగా మీ ముందుకు రావడం ఆనందంగా ఉంది. ఆనాడు ఎంపీగా కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని ఉన్నా నిధులు లేక చేయలేకపోయా. ఇప్పుడు అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఇస్తాను. చెరువుల పునరుద్ధరణ వల్ల పేదలకు నష్టం కలిగి ఉండవచ్చు. గతంలో తాను మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న సమయంలో నిధులు లేక ఈ నల్లచెరువును అభివృద్ధి చేయలేక పోయినట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు. కూకట్‌పల్లిలో ప్రస్తుతం నల్లచెరువు అభివృద్ధిని చూసి స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్‌ను 100 శాతం అభివృద్ధి చేస్తానన్నారు. కూకట్‌పల్లిలో నల్లచెరువును హైడ్రా పునరుద్ధరించగా,సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం నల్లచెరువుకు గంగా హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేస్తామన్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత అభివృద్ధి తో పాటు సంక్షేమంపై దృష్టి పెడతామని తెలిపారు. ఏ పేదవాడి ఇళ్లు కూలగొట్టే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. చెరువుల పునరుద్ధరణలో నిర్వాసితులకు న్యాయం చేస్తామని ప్రకటించారు. హైడ్రా తెచ్చినప్పుడు చాలా విమర్శలు వచ్చాయన్నారు. చెరువులు, కాల్వలు ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తే అనేక ఇబ్బందులొస్తాయని తెలిపారు. ప్రభుత్వానికి సహకరించాలంటూ ఈ సందర్భంగా చెరువులు, నాలాల ఆక్రమణదారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. నిర్వాసితులకు ప్రభుత్వం పూర్తి న్యాయం చేస్తుందన్నారు. అలాగే నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయిస్తామని ప్రకటించారు. చెరువులను అభివృద్ధి చేసుకోవాలని ప్రజలకు సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. కొందరికి కష్టం వచ్చినా.. బాధపడినా చెరువులను అభివృద్ధి చేస్తున్నామని కుండబద్దలు కొట్టారు. అభివృద్ధిని అడ్డుకోవద్దని కోరుతున్నానంటూ ప్రతిపక్షాలకు ఆయన సూచించారు. ఢిల్లీలో కాలుష్యంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని గుర్తు చేశారు. ఢిల్లీ లాంటి పరిస్థితులు మనం తెచ్చుకోకూడదంటూ హైదరాబాద్ నగర ప్రజలకు తెలంగాణ సీఎం హితవు పలికారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకోవాలంటూ నగర ప్రజలకు సీఎం రేవంత్ సూచించారు. హైడ్రా మొదలైనప్పుడు చాలా విమర్శలు, ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. కానీ అవన్నీ తాను మౌనంగా భరించానన్నారు. కానీ ఇప్పుడు ఈ డెవలప్‌మెంట్ చూసి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తుంటే తనను తిట్టిన తిట్లు కూడా ఆశీర్వాదంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఇక్కడ అనధికారికంగా నివాసాలు నిర్మించుకున్న కొందరని ఇబ్బంది పెట్టి ఉంటామని.. వారందరికీ డబుల్ బెడ్ రూంలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. చెరువులు కబ్జాకు గురైతే వరదలు వస్తే ఇంట్లోకి వచ్చి మన వస్తువులు మొత్తం మునిగిపోతాయని వివరించారు. చెరువులను ఆక్రమించిన వాళ్ళు సహకరించాలని కోరుతున్నానని తెలిపారు. ఇలాంటి ప్రదేశాల్లో మహిళలకు స్వయం సహాయక స్టాల్స్ ఏర్పాటు చేయమని చెప్పానని గుర్తు చేశారు. చిన్న పిల్లలకు ఆట స్థలం కోసం కూడా ఈ పార్కులు పనికి వస్తాయన్నారు. ఇక్కడ ఇంతకు ముందు కోరినట్లు షటిల్ కోర్టు నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు.

నాలాలకు రక్షణగా గోడలు కట్టాలన్నారు. ఢిల్లీలో పార్లమెంట్‌కు సెలవులు ప్రకటించే పరిస్థితి పొల్యూషన్ వల్ల వచ్చిందని గుర్తు చేశారు. ముందు చూపు లేక ఢిల్లీకి ఆ పరిస్థితి వచ్చిందన్నారు. బొంబాయిలో వర్షం కురిస్తే ఇంట్లోంచి బయటకి రాలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాంటి పరిస్థితి హైదరాబాద్‌కి రావద్దంటే మూసి ప్రక్షాళన చేయాల్సిందేనని కుండబద్దలు కొట్టారు. మూసి ప్రక్షాళన వద్దంటే అది హైదరాబాద్ ఫ్యూచర్‌ను అడ్డుకున్నట్లేనని పేర్కొన్నారు. నిధులు ఇచ్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని.. మంచి అధికారులను మీకు ఇచ్చానని తెలిపారు. పని చేయించుకోవడం మీ వంతు అంటూ ప్రజలకు సూచించారు. సరైన డాకుమెంట్స్ ఉంటే టీడీఆర్ ఇవ్వమని చెప్పానని గుర్తు చేశారు. ఇక్కడ అభివృద్ధిని ఎవరూ అడ్డుకోకండంటూ ప్రజలకు హితవు పలికారు. తాను కష్ట కాలంలో ఉన్నప్పుడు ఇక్కడ తనను ఎంపీగా గెలిపించారని చెప్పారు. తన తల తాకట్టు పెట్టయినా అప్పు తెచ్చి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. పార్టీలకు అతీతంగా ఇక్కడ అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. అందరు అభివృ కి సంపూర్ణంగా సహకరిస్తారని తాను భావిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

## శాసనసభలో ఏ చర్చకైనా సిద్ధం

**హైదరాబాద్ వెలుతురు మార్చి 09:**

ఈనెల 16వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలకు ప్రతిపక్షనేత కేసీఆర్‌తో సహా బిఆర్ఎస్ శాసనసభ్యులందరూ హాజరుకావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రధాన ప్రతిపక్ష సభ్యులు అసెంబ్లీ హాజరై అడిగే ప్రతి ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సోమవారం సచివాలయంలో తనను కలిసిన విలేకరులతో మంత్రి గారు మాట్లాడుతూ బిఆర్ఎస్ శాసనసభ్యులు సభకు వచ్చి తమ వాదనలు వినిపిస్తే, ప్రతి విషయానికి సాక్ష్యాధారాలతో సమాధానం చెప్పడానికి మేము సిద్ధంగా ఉన్నాం. కానీ, ప్రతిపక్షం ప్రజా సమస్యలను పక్కన పెట్టి, వారి సొంత ఎజెండాతో సభకు వస్తున్నారని అన్నారు ఖమ్మం జిల్లా వెలుగుమట్లలోని ఇండ్ల నిర్వాసితులందరికీ ప్రభుత్వం తరపున పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. ఇప్పటికే ఈ విషయంపై గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని దాని ప్రకారం త్వరలో అక్కడి అర్హులందరికీ ఇంటి పట్టాతోపాటు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వం ఎప్పుడూ పేదవాడి పక్షానే ఉంటుందని మరోమారు స్పష్టం చేశారు.

బిఆర్ఎస్ విమర్శల పై

"ORR పక్కన సంబంధం లేని క్రషర్ నాదని పిచ్చి కుక్కలు చాలా మొరుగుతున్నాయి, నాపై మొరిగే కుక్కను ఏ గొలుసుతో కట్టేయాలో నాకు తెలుసు.. ఆ క్వారీ నాదని చిల్లర ఆరోపణలు చేస్తున్నారు, నాకు క్రషర్ నడిపే ఓపిక లేదు..అది నా క్రషర్ కాదు బిఆర్ఎస్ నేతలు చెబుతున్నది తిరుమల క్రషర్, వేస్ట్ క్రష్ చేసి సప్లై చేసే లైసెన్స్ వారికి ఉంది.. ఆ క్రషర్ కంపెనీ మా కంటైనర్ తీసుకువెళ్ళింది.. దాని పై ఉన్న పేరును తొలగించినట్లు ఉన్నారు.. దానిని పట్టుకుని పిచ్చి వాగుడు వాగుతున్నారు.. నా పై పిచ్చి మాటలు మాట్లాడుతున్న వారికి అసెంబ్లీలో గట్టిగా సమాధానం చెబుతాను" అంటూ బిఆర్ఎస్ నాయకుల విమర్శలపై తీవ్రంగా స్పందించారు.

## పేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు భరోసా

### రూ. 3.24 కోట్ల విలువైన చెక్కుల పంపిణీ

చేశారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మరియు పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై ఈ పంపిణీని చేపట్టారు. పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల్లోనూ సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యత రాష్ట్రం అప్పుల కష్టాల్లో ఉన్నప్పటికీ, పేద ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. షాదీ ముబారక్: 194 మంది లబ్ధిదారులకు రూ. 1,94,22,504 కళ్యాణ లక్ష్మి: 130 మంది లబ్ధిదారులకు రూ. 1,30,15,080 మొత్తంగా దాదాపు రూ. 3,24,37,584 విలువైన చెక్కులను అందజేయడం జరిగిందని వివరించారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రజా పాలనలో అప్రతిహతంగా అభివృద్ధి పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే కీలకమైన హామీలను నెరవేర్చిందని గుర్తు చేశారు. కేవలం మాటలు చెప్పడం కాదు, చేతల్లో చూపిస్తున్న ప్రభుత్వం మాది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు ఇప్పటికే విజయవంతంగా కొనసాగుతున్నాయి. వీటికి తోడు ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, యువతకు ఉద్యోగాల కల్పన మరియు సన్నబియ్యం పథకాలతో ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ, నగర మేయర్ ఉమారాణి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్, నూడా చైర్మన్ కేశ వేణు, స్థానిక కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు మరియు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



## తెలంగాణ మహిళా కాంగ్రెస్ ప్రెసిడెంటును కలిసిన డాక్టర్ రేఖ

**- ఘనంగా సత్కరింపు మహిళా కాంగ్రెసుకు దిశానిర్దేశం చేయాలని సూచన**



**హైదరాబాద్ వెలుతురు మార్చి 09:** తెలంగాణ మహిళా కాంగ్రెస్ ప్రెసిడెంటుగా ఇటీవల నియామకమైన ఎర్రబెల్లి స్వర్ణను మహిళా కాంగ్రెస్ వైఎస్ ప్రెసిడెంటు డాక్టర్ రేఖా బోయలపల్లి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం వారి ఇరువురు తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. రానున్న రోజుల్లో మహిళా కాంగ్రెసుకు దిశానిర్దేశం చేయాలని సూచన చేయాలని పేర్కొన్నారు. ఎర్రబెల్లి స్వర్ణ సుదీర్ఘ రాజకీయ అనుభవం, నాయకత్వం తెలంగాణలో మహిళల స్వరాన్ని మరింత బలపరిచేందుకు ఉపయోగపడుతుందని రేఖ విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళా కాంగ్రెస్ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంలో వారి చొరవ పని చేస్తుందని ఆకాంక్షించారు. వారితో కలిసి పని చేసే అవకాశం దొరికినందుకు సంతోషంగా భావిస్తున్నట్టు డాక్టర్ రేఖ ఒక ప్రకటనలో తెలిపారు.

## హుస్నాబాద్ లో నిర్మితమవుతున్న 250 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ తో కలిసి పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్ వెలుతురు మార్చి 09:**
హుస్నాబాద్ లో నిర్మితమవుతున్న 250 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ తో కలిసి పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్, జీ+5 లో ఒక్కో ఫ్లోర్ 30 వేల చదరపు అడుగులతో అధునాతన సాంకేతిక టెక్నాలజీతో నిర్మితమవుతున్న హుస్నాబాద్ ఆసుపత్రి ఇప్పటికే పిల్లర్ల దశకు చేరుకున్న ఆసుపత్రి.. వచ్చే ఏడాదిలోపు హాస్పిటల్ పూర్తి చేయలని మంత్రి ఆదేశం హాస్పిటల్ భవన నిర్మాణంలో పలు అంశాలపై అధికారులకు సూచించిన మంత్రి పొన్నం ప్రభాకర్.


# నిశ్శబ్దపు నీడలో అన్యాయం



**డా .సూర్యదేవర రామకృష్ణ ,**
**9490754169**

ఒక రద్దీగా ఉన్న రైలు డబ్బా. కిటికీ పక్కన కూర్చున్న ఒక వృద్ధుడు కిటికీలోంచి బయట ప్రపంచాన్ని చూస్తున్నాడు. అతని పక్కనే కూర్చున్న ఒక యువకుడు, కేవలం తన అహంకారాన్ని ప్రదర్శించడానికి ఆ వృద్ధుడిని అవమానిస్తున్నాడు. మాటలతో వేధిస్తున్నాడు, శారీరక అసౌకర్యాన్ని కలిగిస్తున్నాడు. ఆ డబ్బాలో కనీసం యాభై మంది ప్రయాణికులు ఉన్నారు. అందరి కళ్లు ఆ దృశ్యంపైనే ఉన్నాయి. కానీ, ఎవరూ నోరు విప్పలేదు. ఎవరూ ఆ యువకుడిని ఆపలేదు. కొందరు ఫోన్లలో మునిగిపోయినట్లు నటించారు, మరికొందరు కిటికీ బయటకు చూశారు. ఆ వృద్ధుడి కళ్లలో నిస్సహాయత కన్నా, చుట్టూ ఉన్నవారి మౌనం చూసి కలిగిన ఆశ్చర్యమే ఎక్కువగా కనిపించింది. ఈ సంఘటన కేవలం ఒక రైలు ప్రయాణానికి సంబంధించింది కాదు,ఇది నేటి మన ఆధునిక సమాజానికి ఒక నిలువుటద్దం. ఇక్కడ ప్రశ్న ఏమిటంటే ఆ ప్రయాణికుల మౌనం కేవలం నిష్క్రియత (Passivity) మాత్రమేనా? లేక ఆ అన్యాయం సజావుగా సాగిపోవడానికి వారు అందించిన పరోక్ష సహకారం (Implicit Complicity) నా? దక్షిణాఫ్రికా వర్ణవివక్ష వ్యతిరేక పోరాట యోధుడు డెస్మండ్ టుటు ఒక అద్భుతమైన మాట చెప్పారు అన్యాయం జరుగుతున్నప్పుడు మీరు నిష్పక్షపాతంగా ఉన్నారంటే, మీరు అణచివేతదారుడి పక్షాన్ని ఎంచుకున్నట్లే. ఈ మాటల్లోని సత్యం సామాజిక నీతికి పునాది వంటిది. తటస్థత (Neutrality) అనేది ఒక భ్రమ. అన్యాయం జరుగుతున్నప్పుడు మనం మౌనంగా ఉంటే, ఆ మౌనం బాధితుడికి ఏమాత్రం సాయపడదు, కానీ అన్యాయం చేసేవాడికి మాత్రం అది ఒక పెద్ద ప్రోత్సాహకంగా మారుతుంది. తను చేస్తున్నది తప్పని ఎవరూ అనడం లేదు కాబట్టి, అది సరైనదే అనే భావన అతడిలో బలపడుతుంది. మన భారతీయ సంస్కృతి మరియు పురాణాలలో మౌనం యొక్క దుష్పరిణామాల గురించి లోతైన చర్చ జరిగింది. మహాభారతంలోని కురుసభ ఇందుకు అతిపెద్ద ఉదాహరణ. ద్రౌపదికి నిండు సభలో అన్యాయం జరుగుతుంటే, అక్కడ భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యుడు వంటి ధర్మకోవిదులు తలదించుకుని మౌనంగా కూర్చున్నారు. వారు స్వయంగా అన్యాయం చేయలేదు, కానీ ఆ అన్యాయాన్ని ఆపడానికి ప్రయత్నించలేదు. వారి మౌనమే కౌరవుల దుర్మార్గానికి బలాన్ని ఇచ్చింది. అందుకే, కురుక్షేత్ర యుద్ధం చివరలో కృష్ణుడు చెప్పినట్లు ధర్మాన్ని రక్షించాల్సిన బాధ్యత ఉన్నవారు మౌనంగా ఉండటం అనేది యుద్ధంలో నేరుగా పాల్గొనడం కంటే పెద్ద పాపం.

చరిత్ర పుటలను తిరగేస్తే, ప్రపంచాన్ని కుదిపేసిన అతిపెద్ద విషాదాల వెనుక దుర్మార్గుల క్రూరత్వం కంటే, సామాన్యుల మౌనమే ఎక్కువగా కనిపిస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో హిట్లర్ నేతృత్వంలోని నాజీలు లక్షలాది మంది యూదులను గ్యాస్ ఛాంబర్లకు పంపారు. ఆ సమయంలో జర్మనీలోని మెజారిటీ పౌరులు మౌనంగా ఉన్నారు. వారు బాంబులు వేయలేదు, మనుషులను చంపలేదు. కానీ, తమ పొరుగువారు అన్యాయంగా తరలిపోతుంటే మాకు సంబంధం లేదు అన్నట్లు ఉండిపోయారు. జర్మన్ పాస్టర్ మార్టిన్ నీమోల్లర్ రాసిన ప్రసిద్ధ కవిత First they came... (మొదట వారు వచ్చారు) మనల్ని హెచ్చరిస్తుంది మొదట వారు కమ్యూనిస్టుల కోసం వచ్చారు, నేను మాట్లాడలేదు,ఎందుకంటే నేను కమ్యూనిస్టును కాదు చివరికి వారు నా కోసం వచ్చారు, అప్పుడు నా కోసం మాట్లాడటానికి ఎవరూ మిగలలేదు. ఈ



కవిత మనకు ఒక కఠినమైన సత్యాన్ని బోధిస్తుంది,అన్యాయం మన తలుపు తట్టే వరకు మనం వేచి చూస్తే, అప్పటికే సమాజంలోని నైతిక గొంతుకలన్నీ మూగబోయి ఉంటాయి.

నేడు అన్యాయం రంగు మార్చుకుంది, కానీ మౌనం మాత్రం అలాగే ఉంది. నేటి సమాజంలో మౌన సహకారం వివిధ రూపాల్లో మనల్ని చుట్టుముట్టి ఉంది: కార్యాలయాల్లో వేధింపులు, ఒక ఉద్యోగిపై బాస్ వివక్ష చూపుతున్నప్పుడు లేదా సహోద్యోగిని లైంగికంగా వేధిస్తున్నప్పుడు, మిగిలిన వారు తమ ఉద్యోగం పోతుందనే భయంతో మౌనంగా ఉండటం.రోడ్డుపై ప్రమాదం జరిగినప్పుడు లేదా ఒక వ్యక్తిపై దాడి జరుగుతున్నప్పుడు, సాయం చేయడానికి బదులు వీడియోలు తీస్తూ ఉండిపోవడం. సోషల్ మీడియా విద్వేషం, వాట్సాప్ గ్రూపుల్లో లేదా ఫేస్‌బుక్‌లో ఒక వర్గంపై ద్వేషపూరిత ప్రసంగాలు (Hate Speech) జరుగుతున్నప్పుడు, అది తప్పని చెప్పకుండా కేవలం ఒక మ్యూట్ బటన్ నొక్కి తప్పించుకోవడం.మన కళ్లముందే దళిత లేదా మైనారిటీ సోదరులపై అగౌరవంగా ప్రవర్తిస్తున్నప్పుడు, మనకు సంబంధం లేని విషయం అన్నట్లు వెళ్ళిపోవడం. ఈ ప్రతి సందర్భంలోనూ, మన మౌనం అన్యాయానికి ఇంధనంలా పనిచేస్తుంది. అన్యాయాన్ని చూసి స్పందించకుండా ఉండటానికి మనిషి మెదడు కొన్ని సాకులు వెతుక్కుంటుంది. అందులో ప్రధానమైనవి భయం (Fear),తిరగబడితే నాకేమవుతుందో? నా కుటుంబం ఇబ్బందుల్లో పడుతుందేమో? అనే భయం. బైస్టాండర్ ఎఫెక్ట్ (Bystander Effect),అక్కడ ఇంతమంది ఉన్నారు కదా, ఎవరో ఒకరు స్పందిస్తారులే అని అనుకోవడం. అందరూ ఇదే అనుకోవడం వల్ల చివరికి ఎవరూ స్పందించరు. అసౌకర్యం (Inconvenience), పోలీస్ కేసులు, కోర్టులు, సాక్ష్యాలు, ఇవన్నీ మన ప్రశాంతమైన జీవితాన్ని పాడుచేస్తాయని భావించడం. సామాజికీకరణ (Socialization) ,చిన్నప్పటి నుండి నీ పని నువ్వు చూసుకో, పక్కవారి విషయాల్లో జోక్యం చేసుకోవద్దు అని పెంచడం వల్ల కలిగే ఆలోచనా ధోరణి. లోకం ఎప్పుడూ చీకటిగా ఉండదు, ఎందుకంటే కొందరు మౌనాన్ని ఛేదించి దీపాలు వెలిగిస్తారు. మహాత్మా గాంధీ దక్షిణ ఆఫ్రికాలో రైలు నుండి బయటకు నెట్టివేయబడినప్పుడు, ఆయన మౌనంగా ఉండి ఉంటే చరిత్ర మరోలా ఉండేది. కానీ ఆయన ప్రశ్నించారు. రోజా పార్క్స్ బస్సులో తన సీటు ఇవ్వడానికి నిరాకరించి అమెరికాలో పౌర హక్కుల ఉద్యమానికి ప్రాణం పోశారు. మలాలా యూసఫ్ జాయ్ తూటాలకు భయపడకుండా ఆడపిల్లల చదువు కోసం గొంతు ఎత్తారు. వీరందరూ సామాన్యులే, కానీ అన్యాయం ముందు మౌనంగా ఉండటానికి నిరాకరించిన అసామాన్యులు. అన్యాయాన్ని ఎదిరించడం అంటే ప్రతిసారీ రోడ్డుపైకి వచ్చి యుద్ధం చేయడం కాదు. మన పరిధిలో మనం చేయగలిగేవి చాలా ఉన్నాయి.మన చుట్టూ జరుగుతున్నది అన్యాయమని మొదట మన మనసుకు స్పష్టంగా తెలియాలి. సున్నితత్వాన్ని కోల్పోకూడదు. కనీసం నువ్వు చేస్తున్నది తప్పు అని ఒక్క మాట అనడం వల్ల కూడా పరిస్థితులు మారవచ్చు. ఆ ఒక్క మాట బాధితుడికి కొండంత అండను ఇస్తుంది.బాధితుడి పక్షాన నిలబడటం,నేరుగా నిందితుడిని ఎదిరించలేకపోయినా, బాధితుడికి మద్దతుగా నిలబడటం, వారికి అవసరమైన చట్టపరమైన లేదా నైతిక సాయం అందించడం. సామాజిక చైతన్యం,అన్యాయం పట్ల చర్చలు జరపడం, పిల్లలకు చిన్నప్పటి నుండే నైతిక బాధ్యత గురించి బోధించడం. చివరగా, ఎడ్మండ్ బుర్క్ అన్నట్లు, చెడు విజయం సాధించడానికి మంచి మనుషులు ఏమీ చేయకుండా ఉంటే చాలు. మనం సమాజంలో శాంతిని కోరుకుంటున్నాం, కానీ ఆ శాంతి అన్యాయం మీద కప్పబడిన మౌనం కాకూడదు. అది న్యాయం మీద ఆధారపడిన సహజీవనం కావాలి. మన మౌనం అనేది మనల్ని నిర్దోషులుగా చేయదు సగటున అది మనల్ని అన్యాయంలో భాగస్వాములను చేస్తుంది. మన గొంతు చిన్నదే కావచ్చు, కానీ అది సరైన సమయంలో వినిపించినప్పుడు, అది ఒక గొప్ప మార్పుకు నాంది పలుకుతుంది. కాబట్టి, మరోసారి ఆ రైలు డబ్బాలో వృద్ధుడిని చూసినప్పుడో, వీధిలో అన్యాయం జరిగినప్పుడో,మౌనాన్ని ఆయుధంగా చేసుకోకండి. మౌనం ఒక పెద్ద అబద్ధం. నిజాన్ని మాట్లాడటమే మానవత్వం. మౌనాన్ని వీడదాం,సామాజిక బాధ్యతను భుజానికెత్తుకుందాం!


# అత్యున్నతంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ

- ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు
- ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ
- క్రీడాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి





**హైదరాబాద్,మార్చి9 వెలుతురు:**
అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. వర్సిటీ నిర్మాణాలకు సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించారు. దీనికి సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని సదుపాయాలతో స్పోర్ట్స్ వర్సిటీ నిర్మాణాలు ఉండాలి. ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటేలా చర్యలు తీసుకోవాలి. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియాన్ని ఆధునికీకరించాలి. అదేవిధంగా గచ్చిబౌలి ఔట్‌డోర్ స్టేడియాన్ని పునరుద్ధరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్రీడాశాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పనపై అధికారులతో చర్చించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పన, అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్చించారు. ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా రాష్ట్రంలో అన్ని సౌకర్యాలతోపాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణాలు ఉండాలని సీఎం అన్నారు. గచ్చిబౌలి ఔట్ డోర్ స్టేడియంను పునరుద్ధరించడం తో పాటు, స్టేడియం ఆవరణలో ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ కాంప్లెక్స్, హాస్టల్ భవనాలు, అన్ని రకాల క్రీడా మైదానాలు, శిక్షణకు అవసరమైన ఇతర సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా నిర్మాణాలకు సంబంధించి పలు డిజైన్లను పరిశీలించారు. డిజైన్లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేసారు. ఒలంపిక్స్, కామన్ వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా, ఒలంపిక్స్ లో తెలంగాణ క్రీడాకారుల సత్తా చాటడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నగరంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్బీ స్టేడియం, సరూర్ నగర్ స్టేడియంలను భవిష్యత్ అవసరాలు, శిక్షణ, పోటీలకు అనుగుణంగా ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేంనరేందర్ రెడ్డి, శాప్ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీనివాస రాజు, శేషాద్రి, ఎండీ సోనీ బాలదేవి, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి. కిషోర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# సంపాదకీయం.. ప్రపంచం నెత్తిన చమురు సంక్షోభం !




చమురు ధరలు దారుణంగా పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. ఇరాన్‌పై యుద్ధం కారణంగా భారత్ సహా అనేక దేశాలు ఇంధన సమస్యలు ఎదుర్కోబోతున్నాయి. ఇప్పటికే గ్యాస్ ధరలు పెంచేశారు. సిలిండర్‌పై 80 రూపాయాలు పెరిగింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో కేవలం గృహవినయోగ సిలిండర్లనే సరఫరా చేయాలని నిర్ణయించారు. కమర్షియల్ సిలిండర్లపై ఆంక్షలు విధించారు. కేవలం గృహావసరాలకే సరఫరా చేయాలని దేశాలు ఇచ్చారు. ఇకపోతే విదేశాల్లో సైతం కార్ల ఇంధన ధరలు పెరిగాయి. అమెరికాలోనూ గ్యాస్ ధరలతో అక్కడి వారు గగ్గోలు పెడుతున్నారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం కొనసాగుతున్నది. పది రోజులుగా వరుస దాడులు జరుగుతున్నాయి. ఇది ఇంకెంత కాలం సాగుతుందో చెప్పలేం. మర్మూజ్ జలసంధి మూసివేత కారణంగా చమురు నౌకలు కదిలే పరిస్థితి లేదు. అందుకే యుద్ధంతో భారత్ చమురు దిగుమతులకు ముప్పు ఏర్పడే ప్రమాదం కనిపిస్తున్నది. యూరప్‌లో చమురు ధరలు బ్యారెల్‌కు 20 డాలర్లు పెరిగి 80 డాలర్లకు చేరింది. హోర్మోజ్ జలసంధి కూడా మూతపడితే 100 డాలర్లకు కూడా చేరే ప్రమాదం పొంచి ఉన్నదని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సూయిజ్ కాలువ, ఎర్ర సముద్రం నౌకాయానా నికి తీవ్ర అంతరాయం కలుగుతున్నది. దీంతో ప్రపంచ వాణిజ్యంపై ప్రభావం పడుతున్నది. ఈ మార్గాల్లో భారత్ రోజుకు 26 లక్షల బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకుంటుంది. ఒకవేళ బ్యారెల్‌కు 10 డాలర్ల చొప్పున పెరిగితే, మొత్తం 15 బిలియన్ డాలర్ల అధిక వ్యయం అవుతుంది. పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ ఒపెక్ ఉత్పత్తిని పెంచవచ్చు. కానీ దీర్ఘకాలిక యుద్ధంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగించే ప్రమాదం ఉన్నది. అంతేకాకుండా గల్ఫ్ దేశాలకు ఆర్థిక నష్టాలు, అమెరికా ప్రతిష్ఠకు విఘాతం కలిగే పరిస్థితులు నెలకొన్నాయి. యుద్ధ వాతావరణంతో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌తోపాటు పశ్చిమాసియాలోని ఆర్థిక వ్యవస్థలు, ప్రజల రోజువారీ జీవితాలను సంక్షోభం లోకి నెట్టేలా కనిపిస్తున్నది. ట్రంప్ మూర్ఖపు నిర్ణయం కారణంగా ప్రపంచం మొత్తం ఆర్థిక చక్రబంధంలో ఇరుక్కోవాలసి వస్తోంది. చమురు సరఫరా మార్గాల్లో అంతరాయల వల్ల వాటి ధరలు విపరీతంగా పెరిగి, దీర్ఘకాలికంగా ప్రతికూల ప్రభావం పడుతుంది.చమురు ధరలు పెరగడంతో వాల్‌స్ట్రీట్ 800 పాయింట్లు పడిపోయింది. పెట్రోల్, ఆహారం సహా అన్నింటి ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులు చమురు కంపెనీలకు లాభాలు తెచ్చిపెట్టవచ్చు. కానీ ప్రజలకు ఇబ్బందులు తప్పవు. అమెరికాకు దేశీయంగా చమురు ఉత్పత్తి ఎక్కువగా ఉండటం కొంత ఉపశమనం కావొచ్చు. కానీ ఇరాన్ బలాన్ని పట్టించుకోకపోతే ఇది ఇరాక్ యుద్ధంలా పెద్ద తప్పుగా మారే ప్రమాదం ఉన్నదనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నది. ఈ యుద్ధంలో అణ్వాయుధాల వినియోగం జరిగినా, రష్యా, చైనా ప్రత్యక్షంగా యుద్ధంలోకి దిగినా అత్యంత ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. ఈ యుద్ధం వల్ల జపాన్ వంటి ఆసియా దేశాలు అమెరికాపై నమ్మకం కోల్పోయి డాలర్‌కు దూరమయ్యే ప్రమాదం కూడా ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి. అమెరికా- ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులను తిప్పి కొట్టేందుకు ఇరాన్ చేస్తున్న ప్రతిదాడుల కారణంగానే ఉద్రిక్తతలు ఇప్పట్లో తగ్గేలా లేవు. ఇరాన్ తలొగ్గేది లేదని, లొంగిపోయేది లేదని తేల్చి చెప్పింది. ఇరాన్‌ను ధ్వంసం చేసే వరకు ట్రంప్ నిద్రపోయేలా కనిపించడం లేదు. ఇప్పటికే టర్కీ నుంచి దుబాయి వరకు అమెరికాకు చెందిన సైనిక స్థావరాలు, పోర్టులు, చమురు శుద్ధి కేంద్రాలు, విమానాశ్రయాలు ఇలా 27 ప్రాంతాలపై ఇరాను విరుచుకుపడింది. ఇవన్నీ కూడా తక్కువ ఖర్చుతో కూడిన డ్రోన్‌ల ద్వారానే జరిపినట్టు తెలిసింది. రవాణా మార్గాలపై ఈ దాడులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దుబాయి, సౌదీ అరేబియా కూడా తీవ్రమైన కష్టాల్లో కూరుకుపోయాయి. ఇరాన్ వినియోగిస్తున్న ఆధునిక ఆయుధాలను దుబాయి, సౌదీ అరేబియా బలహీనమైన రక్షణ వ్యవస్థలు దీటుగా ఎదుర్కోలేకపోతున్నాయి. పెద్ద కంపెనీలు కార్యకలాపాలు నిలిపివేశాయి. దుబాయిలోని 50 లక్షల మంది భారతీయులపైనా ప్రభావం పడుతున్నది. ప్రస్తుత యుద్ధం కారణంగా బ్రిటన్, ఫ్రాన్స్ కాలంలో రూపొందిం చిన పాత సరిహద్దులు కూడా మారిపోయే అవకాశం ఉన్నది. సంక్షోభంగా కారణంగా గల్ఫ్ రాజ్యాల్లో నిరుద్యోగం పెరిగితే ప్రజల్లో అసంతృప్తి వెల్లువెత్తుతుంది. అమెరికా సైన్యం వెనక్కి వెళ్లిపోవాలని ఇరాక్‌లో డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. అమెరికా సైనిక స్థావరాలపై జరిగిన దాడుల పట్ల టర్కీ సంతోషం గానే ఉన్నదని కొందరు భావిస్తున్నారు. యుద్ధ వాతావరణంలో యూరప్ మాటలకే పరిమితమైందని విమర్శలు ఎదుర్కొంటున్నది. భారత్ చౌకైన రష్యా చమురుపై ఆధారపడుతున్నది. చైనా తన వాణిజ్య మార్గాలను, నౌకాశ్రయాలను రక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నది. దాడుల కారణంగా ఇరాన్ ప్రజలు తమ అత్యున్నత నాయకుడిని కోల్పోయారు. ఇరాన్ సైనిక కేంద్రాలపై అమెరికా 1,700 దాడులు చేసింది. ఇరాన్ వ్యూహాత్మకంగా ప్రతిస్పందిస్తున్నది. పర్షియన్ నాగరికతకు చెందిన దీర్ఘ చరిత్ర కారణంగా ప్రజలు ఐక్యంగా నిలుస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ఆ దేశంలో పెద్దగా కల్లోలం కనిపించడంలేదు. రష్యా, చైనా మద్దతుతో యుద్ధం నిలువగలిగితే ప్రపంచానికి అది విజయం అవుతుంది.

## చమురు ధరలతో మార్కెట్ల కుదేలు


**- రూపాయి విలువ పడడంతే దేశీయ మార్కెట్లపై ప్రభావం**




**న్యూఢిల్లీ,మార్చి9( వెలుతురు):**
పశ్చిమాసియాలోని ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు భగ్గుమంటున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర వంద డాలర్లు దాటింది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు అయిన భారత్‌పై తీవ్ర ప్రభావం పడుతుందనే అంచనాలు మదుపర్లను కలవరపెడుతున్నాయి. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లు తీవ్ర ఒత్తిడిలో ఉండడం, డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి భారీగా పతనమవడం దేశీయ సూచీలపై నెగిటివ్ ప్రభావం చూపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ భారీ నష్టాల్లో కదలాడుతున్నాయి. గత సెషన్ ముగింపు (78,918)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం దాదాపు 2000 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత పతనమైంది. మరో ఆరు వందల పాయింట్లు కిందకు వెళ్లింది. చాలా రోజుల తర్వాత సెన్సెక్స్ 70,000 పాయింట్ల దిగువకు పడిపోయింది. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 2037 పాయింట్ల నష్టంతో 76,881 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా భారీగా నష్టపోయింది. 2.5 శాతానికి పైగా పడిపోయింది. ప్రస్తుతం 624 పాయింట్ల నష్టంతో 23,826 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్, నిఫ్టీలో ఎమ్‌సీఎక్స్ ఇండియా, కోల్ ఇండియా మొదలైన షేర్లు మాత్రమే స్వల్ప లాభాల్లో ఉన్నాయి . ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, యూనో మిండా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్బీఐ, హిందుస్థాన్ పెట్రో మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 1587 పాయింట్ల నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 2280 పాయింట్ల నష్టంతో ఉంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 92.32గా ఉంది.

## ఆర్థిక సంక్షభంతో తగ్గుతున్న పసిడిధరలు

**- బంగారం, వెండిపై స్వల్పంగా తగ్గుదల**



**న్యూఢిల్లీ,మార్చి9( వెలుతురు):**
గత కొద్ది రోజులుగా తగ్గుతూ వస్తున్న బంగారం, వెండి ధరలు సోమవారం మరింత కిందకు వచ్చాయి. అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ బంగారం, వెండి ధరలు మాత్రం పడిపోతుండడం నిపుణులకు ఆశ్చర్యం కలిగిస్తోంది. సోమవారం వెండి కేజీకి రూ.5 వేల మేర తగ్గింది. మరోవైపు బంగారం ధర కూడా భారీగా తగ్గింది. సోమవారంఉదయం 10:30 గంటల సమయంలో హైదారాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,61,680కు చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే దాదాపు రూ.1960 మేర తగ్గుదల నమోదు చేసింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,200 దగ్గర ఉంది. ముందటి రోజు ధరతో పోల్చుకుంటే రూ.1800 మేర తగ్గింది. మరోవైపు వెండి కూడా భారీ తగ్గుదల నమోదు చేసింది. బుధవారం కిలోకు రూ.5 వేల మేర తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.80 లక్షలుగా ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.90 లక్షలుగా ఉంది. గమనిక: పైన పేర్కొన్న బంగారం, వెండి రేట్లు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే సమయంలో మళ్లీ ధరలు తెలుసుకోవాలని సూచన.

## ప్రచారం రాజకీయాలు ప్రజాస్వామ్యానికి కొత్త సవాళ్లు..!

*ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు పొందిన భారతదేశం ఎన్నో రాజకీయ మార్పులను, సామాజిక ఉద్యమాలను, ప్రజా ఆకాంక్షలను అనుభవిస్తూ ముందుకు సాగుతోంది. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు మాత్రమే కాదు, ప్రజల ఆశలు, అవసరాలు, సమస్యలు, సమానత్వం, న్యాయం వంటి విలువలపై నిలబడే ఒక వ్యవస్థ. అయితే ఇటీవల కాలంలో భారత రాజకీయాలపై ఒక ముఖ్యమైన విమర్శ ఎక్కువగా వినిపిస్తోంది. "పని తక్కువ ప్రచారం ఎక్కువ" అనే అభిప్రాయం సామాన్య ప్రజల్లోనూ, విశ్లేషకుల్లోనూ బలపడుతోంది.*



**మన్నారం నాగరాజు**
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

ఒకప్పుడు రాజకీయ నాయకత్వం ప్రజల మధ్యే తన బలం సంపాదించేది. గ్రామసభలు, ప్రజా ఉద్యమాలు, సామాజిక పోరాటాలు, నేరుగా ప్రజలతో మమేకం కావడం రాజకీయ నాయకుల ప్రధాన లక్షణాలుగా ఉండేవి. నాయకులు ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుని పరిష్కారం కోసం ప్రయత్నించేవారని ఒక అభిప్రాయం ఉంది. కానీ ఈరోజు రాజకీయాల స్వరూపం కొంతమేర మారిపోయింది. సాంకేతిక పరిజ్ఞానం విస్తరించిన తర్వాత సోషల్ మీడియా రాజకీయాలకు ఒక కొత్త వేదికగా మారింది. ఈ వేదిక ప్రజలకు సమాచారం అందించడానికి ఉపయోగపడుతున్నప్పటికీ, అదే సమయంలో ప్రచార రాజకీయాలకు కూడా ఒక పెద్ద సాధనంగా మారింది. ఈరోజుల్లో ఒక చిన్న పని జరిగినా దానిని పెద్ద విజయంగా చూపించే ప్రయత్నం కనిపిస్తోంది. ప్రభుత్వ కార్యక్రమాల కంటే వాటి ప్రచార కార్యక్రమాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక నాయకుడు చేసిన పని కంటే, ఆ పని గురించి సోషల్ మీడియాలో ఎంత ప్రచారం జరిగింది అన్నదే ప్రధాన అంశంగా మారినట్లు కనిపిస్తోంది. ఇది రాజకీయాల్లో ఒక కొత్త ధోరణి. ప్రచారం రాజకీయాల్లో అవసరమే. ప్రజలకు సమాచారం చేరాలంటే అది అవసరం. కానీ ప్రచారం వాస్తవాన్ని మించిపోయినప్పుడు అది ప్రజాస్వామ్యానికి సమస్యగా మారుతుంది. అభివృద్ధి కంటే ప్రచారం ముఖ్యం అవుతే ప్రజల నమ్మకం తగ్గే ప్రమాదం ఉంటుంది. అందుకే చాలా మంది విశ్లేషకులు ప్రస్తుతం ఉన్న రాజకీయ ధోరణిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల సమయంలో ఇచ్చే హామీల అంశం కూడా పెద్ద చర్చగా మారింది. ప్రతి ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు అనేక వాగ్దానాలు చేస్తాయి. రైతులకు సహాయం, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, మహిళలకు భద్రత, పేదలకు సంక్షేమ పథకాలు ఇలా అనేక హామీలు ప్రకటిస్తారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలన్నీ పూర్తిగా అమలు కావడం చాలా అరుదు. దీనికి ఆర్థిక పరిమితులు, పరిపాలనా సమస్యలు, విధానపరమైన అవరోధాలు వంటి కారణాలు ఉండవచ్చు. అయినప్పటికీ ప్రజల దృష్టిలో మాత్రం ఒక సందేహం పెరుగుతోంది ఎన్నికల సమయంలో చెప్పిన మాటలు నిజంగా అమలవుతాయా లేదా అనే ప్రశ్న.

ఈ పరిస్థితి రాజకీయ వ్యవస్థపై ప్రజల్లో అనిశ్చితిని పెంచుతుంది. ప్రజలు తమ ఓటుతో ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారు. ఆ ఓటు వెనుక ఒక ఆశ ఉంటుంది తమ జీవన పరిస్థితులు మెరుగుపడతాయని. ఆ ఆశ నెరవేరనప్పుడు అసంతృప్తి సహజంగానే పెరుగుతుంది.

గత నాయకత్వం మరియు ప్రస్తుత నాయకత్వం గురించి కూడా ప్రజల్లో తరచుగా చర్చ జరుగుతోంది. చాలా మంది ఇలా అంటారు "గతంలో కూడా అవినీతి ఉండేది కానీ ఇప్పుడు అది మరింత విస్తరించింది" అని. ఈ అభిప్రాయం ఎంతవరకు నిజమో వాదనకు లోబడి ఉండొచ్చు. కానీ ప్రజల్లో ఈ భావన పెరగడానికి కొన్ని కారణాలు కనిపిస్తున్నాయి. ఎన్నికల ఖర్చులు భారీగా పెరగడం, రాజకీయాల్లో ధనబలం పెరగడం, పెద్ద ప్రాజెక్టుల్లో భారీ నిధులు వినియోగించడం వంటి అంశాలు ఈ భావనకు కారణమవుతున్నాయి.

ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల పాత్ర కూడా చాలా ముఖ్యమైనది. అధికార పార్టీని ప్రశ్నించడం, ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించడం, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం ప్రతిపక్షాల ప్రధాన బాధ్యత. కానీ కొన్ని సందర్భాల్లో ప్రతిపక్షాలు కూడా నిర్మాణాత్మక రాజకీయాల కంటే రాజకీయ విమర్శలకే పరిమితం అవుతున్నాయని విమర్శలు ఉన్నాయి. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడం కంటే ఎన్నికల సమయంలో మాత్రమే చురుకుగా మారుతున్నాయనే అభిప్రాయం కూడా కొందరిలో ఉంది.

భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాలకు ఒక గొప్ప చరిత్ర ఉంది. కార్మికులు, రైతులు, పేద వర్గాల హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీలు ఎన్నో పోరాటాలు చేశాయి. అయితే ప్రస్తుతం కమ్యూనిస్టు పార్టీల ప్రభావం తగ్గిందనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల్లో ఉంది. అంతర్గత విభేదాలు, కొత్త రాజకీయ వాస్తవాలకు సరైన వ్యూహాలు లేకపోవడం, యువతలో ప్రభావం తగ్గడం వంటి అంశాలు దీనికి కారణాలుగా చెప్పబడుతున్నాయి. కొన్ని విమర్శలు కమ్యూనిస్టు పార్టీల్లో కూడా ఆధిపత్య వర్గాల ప్రభావం ఉందని అంటాయి. సమానత్వాన్ని ప్రోత్సహించే సిద్ధాంతాలు ఉన్నప్పటికీ ఆచరణలో కొన్ని పరిమితులు కనిపిస్తున్నాయని విమర్శకులు చెబుతున్నారు.

మత ఆధారిత రాజకీయాలు కూడా భారత రాజకీయాల్లో ఒక ముఖ్యమైన అంశంగా మారాయి. కొన్ని పార్టీలు ప్రత్యేక మత సముదాయాల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయని విమర్శలు ఉన్నాయి. అదే సమయంలో మరికొన్ని పార్టీలు మెజారిటీ మత రాజకీయాల పేరుతో రాజకీయ మద్దతు పొందుతున్నాయని విమర్శలు ఉన్నాయి. ఈ పరిస్థితి సమాజంలో విభజనలకు దారితీసే ప్రమాదం ఉందని కొందరు విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

దళిత రాజకీయాలు భారత రాజకీయాల్లో ఒక ముఖ్యమైన ఉద్యమంగా ఎదిగాయి. దళితుల హక్కుల కోసం అనేక పార్టీలు, ఉద్యమాలు పనిచేశాయి. కానీ కొన్ని సందర్భాల్లో ఈ రాజకీయాలు కూడా పరిమిత వర్గాలకే పరిమితం అవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. సామాజిక న్యాయం కోసం విస్తృతమైన ఐక్యత అవసరమని అనేక సామాజిక ఉద్యమకారులు భావిస్తున్నారు.

తెలంగాణ సహా దేశవ్యాప్తంగా కుల సంఘాలు కూడా ఒక ముఖ్యమైన సామాజిక శక్తిగా మారాయి. విద్య, ఉద్యోగాలు, ఆర్థిక అవకాశాల కోసం తమ సమాజానికి సహాయం చేయడం ఈ సంఘాల ప్రధాన లక్ష్యం. అయితే కొన్ని సందర్భాల్లో ఈ సంఘాలు కూడా రాజకీయ ప్రభావానికి లోనవుతున్నాయని విమర్శలు ఉన్నాయి. కొన్ని ప్రభుత్వ పథకాలు ప్రత్యేక వర్గాలకు మాత్రమే వర్తిస్తున్నాయనే అభిప్రాయం ఇతర వర్గాల్లో అసంతృప్తిని పెంచుతుంది.

భారత రాజ్యాంగం సమానత్వం మరియు సామాజిక న్యాయం లక్ష్యాలతో రూపొందించబడింది. అయినప్పటికీ వాస్తవ జీవితంలో ఇంకా అనేక అసమానతలు కనిపిస్తున్నాయి. చిన్న వర్గాలకు సరైన రాజకీయ ప్రాతినిధ్యం లేకపోవడం, ఆర్థిక అసమానతలు, విద్య మరియు ఉద్యోగాల్లో అవకాశాల లోపం వంటి సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి.

ఈ పరిస్థితుల్లో ప్రజల బాధలు పెరుగుతాయి. ధరల పెరుగుదల, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, పట్టణ సమస్యలు ఇవన్నీ సాధారణ ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి. ప్రజలు ఎన్నిసార్లు ప్రభుత్వాలను మార్చినా సమస్యలు పూర్తిగా పరిష్కారం కాకపోతే అసంతృప్తి సహజంగానే పెరుగుతుంది.

ఈ పరిస్థితి ప్రజాస్వామ్య వ్యవస్థకు కూడా ఒక సవాలు. ప్రజలు రాజకీయాలపై నమ్మకం కోల్పోతే అది సమాజానికి మంచిది కాదు. అందుకే రాజకీయ పార్టీలు తమ బాధ్యతను మరింత సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉంది.


ప్రచారం కంటే పనికి ప్రాధాన్యం ఇవ్వడం అవసరం. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలను సాధ్యమైనంతవరకు అమలు చేయడం అవసరం. పారదర్శక పరిపాలన ద్వారా ప్రజల్లో నమ్మకం పెంచాలి. ప్రతిపక్షాలు కూడా నిర్మాణాత్మక రాజకీయాలను ప్రోత్సహించాలి. కులం, మతం ఆధారంగా విభజనకు బదులుగా సామాజిక ఐక్యతను బలపరచాలి.

చివరికి ప్రజాస్వామ్యంలో ప్రజలే కేంద్రబిందువు. చైతన్యవంతమైన ఓటర్లు, బాధ్యతాయుతమైన నాయకత్వం, పారదర్శక పరిపాలన ఇవే మంచి ప్రజాస్వామ్యానికి పునాది. రాజకీయాలు ప్రచారం కోసం కాకుండా ప్రజల కోసం పనిచేసే వ్యవస్థగా మారినప్పుడే ప్రజాస్వామ్యం నిజమైన అర్థంలో బలపడుతుంది.

## తిరుపతి జిల్లాలో విషాద ఘటన

**- కరెంట్ తీగలకు రెండు ఏనుగులు బలి**

**తిరుపతి,మార్చి9( వెలుతురు):**
జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఎర్రావారి పాలెం మండలంలోని నెరబైలు అడవికి సమీపంలో వేటగాళ్లు వేసిన కరెంట్ ఉచ్చులో చిక్కి రెండు ఏనుగులు మృతిచెందాయి. ఈ ఘటన సోమవారం ఉదయం వెలుగులోకి రావడంతో స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం, ఎర్రావారి పాలెం మండలం నెరబైలు అడవికి సమీపంలోని సాయిబులపల్లె ప్రాంతంలో వేటగాళ్లు అక్రమంగా కరెంట్ ఉచ్చులు వేశారు.



అడవిలో నుంచి మేత కోసం పొలాల వైపు వచ్చిన రెండు గజరాజులు ఆ కరెంట్ ఉచ్చులో చిక్కి తీవ్ర షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలుస్తోంది. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వేటగాళ్లు ఉద్దేశపూర్వకంగా కరెంట్ ఉచ్చు పెట్టడం వల్లనే ఈ ఘటన జరిగి ఉండవచ్చని అటవీ శాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఈ ఘటనకు కారణమైన వేటగాళ్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ అధికారులు వెల్లడించారు.

## గో సంరక్షణ ప్రత్యేక చట్టం తీసుకురావాలి




**బషీర్ బాగ్ వెలుతురు 9 మార్చి :** గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించి,భారతదేశంలో గోవధ నిషేద ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలని గోమాత గౌరవ ప్రచారాన్నీ హైద్రాబాద్,గోశామహల్ బేగంబజార్ నుండి ప్రారంభించింది.ఏప్రిల్ 27న భారతీయులు,గో ప్రేమికులు అందరూ గో సంరక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావడానికి తహసీల్దార్, పోస్టాఫీస్ ల ద్వారా దరఖాస్తులు,లేటర్ లు రాష్ట్రపతి, ప్రధానమంత్రి,గవర్నర్, ముఖ్యమంత్రులకు సమర్పించాలని కోరుతూ గోమాత ప్రచారాం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.

## దూల్పేట్ లో మార్పును అందరూ ఆహ్వానించాల్సిందే..

**- అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఎస్టిఎఫ్ టీం లీడర్ అంజిరెడ్డి..**




**బషీర్ బాగ్ వెలుతురు 9 మార్చి :** నాటు సారా తయారీ, గంజాయి అమ్మకాలకు అడ్డాగా మారిన దూల్పేట్ నేడు అనేక మార్పులకు వేదికగా మారిందని, ఇలాంటి సమయంలో నారీశక్తి కార్యక్రమంతో మహిళా దినోత్సవాన్ని జరుపుకోవాలని ఎంతో అభినందనీయమని ఎస్టిఎఫ్ టీం లీడర్ నంద్యాల అంజిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దూల్పేట్ లో మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దూల్పేట్ లో సాంప్రదాయ సిద్ధమైనటువంటి గణేష్ విగ్రహాల తయారీతో పాటు అనేక రకాలైనటువంటి వృత్తి కలలను ప్రోత్సహించాలని ప్రోత్సహించాల్సినటువంటి అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా దూల్పేట్ లో మహిళలు అనేకమార్పులకు శ్రీ కార్ చుట్టడంపై అంజిరెడ్డి మహిళలందరినీ అభినందించారు. పలువురు మహిళలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దూల్పేట్ చెందిన ఆనంద్ సింగ్ లోద కృష్ణం సింగ్, కృష్ణం సింగ్ పప్పు మాత్రే, మని సింగ్ కావ్య సింగ్ పరమేశ్వరి సింగ్ దూల్పేట్ సిఐ మధుబాబు సైదులు భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ వసతి గృహాల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులను రెన్యువల్ చేసి పెండింగ్లో ఉన్న జీతాలు ఇవ్వాలి.

**- బీసీ కమిషనర్ బాల మాయాదేవి గారిని కలిసి విజ్ఞప్తి చేసిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగం గౌడ్**




**హైదరాబాద్ వెలుతురు మార్చి 09:** ప్రభుత్వ వసతి గృహాలలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులు 2025-2026 సంవత్సరానికి ఇంతవరకు రెన్యువల్ కాలేదు మరియు 11 నెలల నుండి జీతాలు రావడంలేదని వెంటనే వారి యొక్క ఉద్యోగాలు రెన్యువల్ చేస్తూ పెండింగ్లో ఉన్న జీతాలు వెంటనే ఇప్పించాలని కోరుతూ ఈరోజు బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి గారిని కలిసి విజ్ఞప్తి చేసినట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ వర్కర్లకి 11 నెలల నుండి జీతాలు అందకపోవడంతో వారి యొక్క కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో వీధిన పడ్డాయని,కనీసం వారి దినసరి ఖర్చులకు కూడా డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో దయ ఉంచి వెంటనే రెన్యువల్ చేసి పెండింగ్లో ఉన్నటువంటి జీతాలు ఇప్పించి వారికి న్యాయం చేయాలని లింగంగౌడ్ కోరారు.ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ బోలెపల్లి స్వామి గౌడ్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు గోదా రవీందర్ ఉన్నారు.

## మహిళా దినోత్సవం సందర్భంగా రాయపాల్ గ్రామ జిల్లా పరిషత్ పాఠశాల మహిళా ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**ఇబ్రహీంపట్నం వెలుతురు మార్చి 09:** ఇబ్రహీంపట్నం మండలం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారంరాత్రి రా యపోల్ గ్రామజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాయపోల్కు చెందిన మహిళా ఉపాధ్యాయుల ను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమాన్ని మీలా విజయకుమార్ జ్యోతి దంపతులు పెద్ద అంబర్ పేట్ లోని సదాశివ హెవెన్స్లోని తమ నివాసంలో ఆత్మీయ వాతావరణంలో ఏర్పాటు చేసి తమ పాత పాఠశాలపై ఉన్న అనుబంధాన్ని మరోసారి చాటుకున్నారుఈ సందర్భంగా పాఠ శాలలో సేవలందిస్తున్న మహిళా ఉపాధ్యాయులు పద్మజా శాంత సాయి గీత రత్నప్రభ గీతా శ్రీల త గారిని మరియు తమ్మిశెట్టి జ్యోతి గారిని శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మా నించారుఈ కార్యక్రమని ఉపాధ్యాయులు మీలా శ్రీజ కర్ణాకర్ భాషయ్య పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఈసందర్భంగా మీలా విజయకుమార్ మాట్లాడుతూ మహిళలే కుటుం బానికి వెలుగు సమాజానికి శక్తి ఒక మహిళ విద్యావంతురాలైతే ఒక కుటుంబం మాత్రమే కాదు సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుంది తల్లి గురువు మార్గదర్శకురాలిగా మహిళలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారు మహిళలను గౌరవించడం మన భారతీయ సంస్కృతి మహిళల సేవలను గుర్తించి సన్మానించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారుమహిళలు తమ ధైర్యం సహనం సేవాభావంతో సమాజాన్ని ముందుకు నడిపిస్తున్నారని ముఖ్యంగా వి ద్యారంగంలో మహిళా ఉపాధ్యాయుల సేవలు అమూల్యమని ఆయన తెలిపారు స్నేహభావ వాతావరణంలో జరిగిన ఈకార్యక్రమం అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహిళా ఉపాధ్యాయులు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## సమగ్రశిక్ష యూఆర్ఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మూడు దశల పోరాటానికి సిద్ధం కావాలి

**- రంగారెడ్డి జిల్లా టిఎస్ యూటిఎఫ్ కోశాధికారి డాక్టర్ జగన్నాథ్**




**మంచాల వెలుతురు మార్చి 09:** మంచాల మండలం కేంద్రంలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో ఆయన కస్తూరిబా గాంధీ ఉపాధ్యాయులు మరియు మండల విద్యావనరుల కేంద్రం సిఆర్ పిలుగిరీష్ జగదీశ్లతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కస్తూరిబా గాంధీ విద్యాలయాల స్పెషల్ ఆఫీసర్లను ప్రిన్సిపాళ్లుగా నియమించాలని సిఆర్ టి సిఆర్ పి పి ఈ టి లను ఎస్.ఏ.లుగా పరిగణించి కనీస మూల వేతనం చెల్లించడంతో పాటు వారిని శాశ్వత ఉద్యో గులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారుఈ నిరసన కార్యక్రమంలో మంచాల మండ ల అధ్యక్షులు డాక్టర్ ఆజ్మత్ ఖాన్ మండల ప్రధానకార్యదర్శి తుల్జారామ్ మండల ఉపాధ్యక్షు లు యాదయ్య సిఆర్ పిలు గిరీష్ జగదీశ్ స్పెషల్ ఆఫీసర్ శ్రీలత ఉపాధ్యాయులు విశారద పద్మ ఉపాధ్యాయులు పాఠశాల సహాయక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో మిలియన్ మార్చ్ ను విజయవంతం చేయాలని గోడపత్రికల ఆవిష్కరణ

**- తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వాలి బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్**



**హైదరాబాద్ వెలుతురు మార్చి 09:** తెలంగాణ ఉద్యమంలో కీలక ఘట్టంగా నిలిచిన గ్రేట్ మిలియన్ మార్చ్ డే ను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ టియుజేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు, టి యు జేఏసీ అధికార ప్రతినిధి కంచర్ల బద్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి టి యు జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ప్రఫుల్ రాశీరెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మార్చి 10న హైదరాబాద్లోని గన్ పార్క్ వద్ద అమరవీరుల స్తూపం దగ్గర తెలంగాణ అమరవీరులను స్మరించుకుంటూ, తెలంగాణ హక్కుల దినంగా పాటించాలని కోరారు. టియుజేఏసీ నిర్వహించనున్న కార్యక్రమానికి “చలో గన్ పార్క్” అంటూ ప్రజలను ఆహ్వానించారు. బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ను ఆర్ట్స్ కాలేజ్ ఉస్మానియా యూనివర్సిటీ మీడియా పాయింట్ వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏంఆర్పిఎస్ నాయకులు మాతంగి ఓదెలుతో పాటు ఉద్యమ కళాకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు పెద్ద యాదగిరి, తెలంగాణ మహిళా జేఏసీ నాయకులు లక్ష్మి, సుజై, రాణి, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఉదయ్, పుట్టా రంజిత్, కళాకారులు కిరణ్, గోదా రవీందర్ రాజేష్ , వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు తెలంగాణ ప్రభుత్వం ఆసరా

**- వికలాంగులకు ట్రై సైకిళ్లు, వీల్ సైకిళ్ల పంపిణీ కార్యక్రమం**

**- మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి చేతులమీదుగా అందజేత**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):** దివ్యాంగులకు ప్రభుత్వం అందించే ట్రైసైకిళ్లు, వీల్ సైకిళ్లను సరైన విధంగా వినియోగించుకొని జీవితంలో ఆర్థికంగా ఎదగాలని అందుకు మీకు అవసరమైన మార్గనిర్దేశాలను, సహాయ సహకారాలను అందించేందుకు ఎల్లవేళల ముందుంటుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. సోమవారం అల్వాల్ లోని సఖీ సెంటర్ లో జిల్లా మహిళా శిశు వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివ్యాంగులకు ట్రై సైకిళ్లు 56, వీల్ సైకిళ్లు 14 పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ మను చౌదరి ముఖ్య అతిథిగా విచ్చేసినారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్, ఆర్డిఓ ఓం ప్రకాష్, అల్వాల్ తహాసీల్దారు రాములు, డిడబ్లూఓ శారద, హాజరైనారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు శారీరకంగా ఇబ్బందులు ఉన్నప్పటికి మానసికంగా ధైర్యంగా ఉంటూ తమ లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు వెళ్లాలని, అందుకు అవసరమైన సహాయ సహకారాన్ని తప్పకుండా అందిస్తామని కలెక్టర్ తెలిపారు. మానసికంగా ధైర్యంగా ఉంటే అవకలనం అడ్డంకి కాదని, అన్నిరంగాలలో మీరు రాణించాలని కలెక్టర్ కోరుకున్నారు. ఈ రోజు ఒక పరిస్థితిలో ఉన్నాము, రేపటికి దీనికంటే మెరుగుగా ఉండాలనే ఆలోచనలు మీలో ఉంటే మీ ఆలోచనలకు కార్యరూపం అందించేందుకు ఎల్లవేళల మేము మీ వెంట ఉంటామని కలెక్టర్ అన్నారు. మీరు ఆర్థికంగా ఎదగడానికి అనేక ఆలోచనలు ఉంటాయి, సొంతంగా బిజినెస్, సొంతంగా స్టార్టప్, ఒక దుకాణం పెట్టుకోవడానికి ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారం అందిస్తామన్నారు. అంతేకాకుండా మీ పిల్లలు ఎక్కడైనా చదువుతూ కెరీర్ కౌన్సెలింగ్, కోర్సెస్ నేర్చుకోవడానికి స్కిల్ డెవలప్ మెంట్ వంటి వాటిని ఇంప్రూవ్ చేసి వివిధ రంగాలలో రాణించడానికి కావలసిన సామర్థ్యాన్ని పెంపొందించడానికి తప్పకుండా వారికి సహకారం అందిస్తూ తోడ్పడతామని కలెక్టర్ అన్నారు. మీ పిల్లలను చదివించడంలో వారికి కెరీర్ నిర్మాణంలో కూడా మీకు కావలసిన కౌన్సిలింగ్ కు మార్గనిర్దేశాన్ని అందించడమే కాకుండా ప్రభుత్వ మార్గనిర్దేశాల మేరకు ఆర్థిక సహాయం కూడా అందిస్తామన్నారు. ఈసారి వీల్ ఛైర్లు, ట్రై సైకిళ్లు అందని వారికి తప్పకుండా తదుపరి అందించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తో కలిసి కలెక్టర్ దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, వీల్ ఛైర్లు పంపిణీ చేసారు. కలెక్టర్ సఖి సెంటర్ పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## కలెక్టరేట్లో ప్రజావాణీ అర్జీల స్వీకరణ





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టరు విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను డిఆర్ఓ (ఇంఛార్జి) చంద్రావతి లతో కలిసి అదనపు కలెక్టరు (99) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఈరోజు హౌజింగ్ డిపార్టుమెంట్ కు అధిక సంఖ్యలో (33) దరఖాస్తులు వచ్చాయని అన్నారు. ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అరుట్ల శ్రీ శ్రీ శ్రీ కంఠమహేశ్వర దేవా లయంలో శివలింగానికి అభిషేకం ప్రత్యేక పూజలు అన్నదాన కార్యక్రమం ప్రారంభం

**- ప్రతి సోమవారం కంఠమహేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు దాతల సహకారంతో అన్న దాన కార్యక్రమం నిర్వహిస్తారు**

**- శివస్వాముల గురుస్వామి లొంగరీ యాదగిరి**





**మంచాల వెలుతురు మార్చి 09:** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ కంఠమహేశ్వర దేవాలయంలో శివ స్వాముల గురుస్వామి లొంగరీ యాదగిరి ఆధ్వర్యంలో శివలింగానికి అభిషేకం కంఠమహే శ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేసిన గౌడ సంఘంపెద్దలు గ్రామస్తులు అనంతరం ఎన్నుదుల మ హేష్ సుంకరి రఘునాథ్ గౌడ్ దాతల సహకారంతో ఈ రోజు అన్నదాన కార్యక్రమం కొబ్బరికాయ కొట్టి ప్రారం భించిన గౌడ సంఘం అధ్యక్షుడు తంగడపల్లి నరేందర్ గౌడ్ పెద్దలు మాడుగుల కృష్ణ గౌడ్ ఈసం దర్భంగా శివ భక్తుడు లొంగరీ యాదగిరి మాట్లాడుతూ గౌడ సంఘం పెద్దలుఅయ్యప్ప గురుస్వా ములు కావలి శ్రీనివాస్ ముదిరాజ్ లొంగరి దాసు గ్రామ పెద్దలు దాతల సహకారంతో ప్రతి సోమ వారం శివలింగానికి అభిషేక కార్యక్రమం ప్రత్యేక పూజలు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తాం అ ని అన్నారు ఈకార్యక్రమంలో గ్రామస్తులు వేదిరె రమణారెడ్డి పాండాల రాములు గౌడ్ అంతటి రాజు గౌడ్ పాండాల జంగయ్యగౌడ్ అయ్యప్ప గురుస్వామి లొంగరి దాసు మాధగోని జంగయ్య గౌడ్ పల్లె శ్రీనివాస్ గౌడ్ నూకం బాలరాజ్ ముదిరాజ్ సుంకరి ప్రవీణ్ గౌడ్ సిద్ధగోని రమే ష్ గౌడ్ తవిటి నరసింహ ముదిరాజ్ కొత్తపల్లి శేఖర్ గౌడ్ శివ భక్తుడు బోద్రమోనిఅంజయ్య ముదిరాజ్ గంట సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## మంచాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

**- మంచాల గ్రామాన్ని సందర్శించిన ఇబ్రహీంపట్నం ఆర్డిఓ అనంతరెడ్డి**



**మంచాల వెలుతురు మార్చి 09:** మంచాల మండలం మంచాల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణలో భాగంగా మంచాల గ్రామంలో గ్రామసర్పంచ్ ఏర్పులమానస వినయ్ ఆధ్వర్యంలో పల్లె ప్రకృతి పార్కుల నిర్వహణలో గడ్డి తొలగింపు పొదల తొలగింపు పా దులు చేయటం.మరియు నర్సరీ సందర్శించడం వంటి కార్యక్రమాలు చేశారు కార్యక్రమానికి విచ్చేసిన ఇబ్రహీంపట్నం ఆర్డిఓ అనంతరెడ్డి మంచాల మండలం ఎంపీడీవో అన్నారం బాల శం కర్ మంచాల తహసీల్దార్ వెంకటప్రసాద్ రావు పలు పనులను పరిశీలించారు ఈకార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పందుగుల లింగంగౌడ్ వార్డు సభ్యుడు గ్యార జంగయ్య, మాజీ ఎంపీటీసీ ఎడ్మ నరేందర్ రెడ్డి గ్రామ పంచాయతీ కార్యదర్శి బి శ్రీనివాస్ గౌడ్.గ్రామస్తులు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధికి భారీ అడుగు..

**- చర్లపల్లిలో రోడ్డు పనులకు ఎమ్మెల్యే శ్రీకారం**



**కాప్రా, మార్చి 9 వెలుతురు:** చర్లపల్లి డివిజన్ పరిధిలో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు పలు కాలనీలలో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.1.06 కోట్ల వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఇందిరా నగర్లో రూ.44 లక్షలు, కృష్ణా నగర్లో రూ.10 లక్షలు, సిల్వర్ ఓక్ కాలనీలో రూ.14 లక్షలు, విద్యా మారుతి నగర్లో రూ.38 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ పనులు పూర్తయిన తరువాత కాలనీలలో రాకపోకలు సౌకర్యవంతంగా మారి స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రభుత్వం ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, మౌలిక వసతుల అభివృద్ధి కోసం అవసరమైన నిధులను కేటాయిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఏఈ అభిషేక్, బీఆర్ఎస్ పార్టీ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం సందర్భంగా స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

## రెడ్డి కార్పొరేషన్ కు వెంటనే నిధులు కేటాయించాలి

**- ఏప్రిల్ లో కరీంనగర్ రెడ్డి బహిరంగ సభ**

**- రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతిరెడ్డి**



**కరీంనగర్ వెలుతురు మార్చి 09:** పేద రెడ్డి యువత కు ఉపాధి అవకాశాలు కల్పించాలని రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించ కుండా, పాలకవర్గాన్ని ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని వెంటనే రెడ్డి కార్పొరేషన్ కు నిధులు కేటాయించాలని రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు . ఈ మేరకు తిరుపతి రెడ్డి మీడియాకు పత్రిక ప్రకటన విడుదల చేశారు. నెల రోజులలో కార్పొరేషన్ ఏర్పాటు చేయక పోతే ఎప్రిల్ నెల చివరి వారంలో కరీంనగర్ లో రెడ్డి ఐక్య వేదిక ఆధ్వర్యంలో అన్ని రెడ్డి సంఘాలను కలుపుకొని రెడ్ల రణ భేరి పేర బహిరంగ సభ నిర్వహిస్తామని, ప్రభుత్వానికి తమ శక్తి చాటి చెప్తామన్నారు..కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారం లోకి వచ్చిన వెంటనే రెడ్డి కార్పొరేషన్ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించడం జరిగింది. కానీ రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు నిధులు కేటాయించకుండా, పాలకవర్గాన్ని ఏర్పాటు చేయలేదని, వెంటనే పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి రూ.2000 కోట్లతో ప్రత్యేక నిధిని కేటాయించాలని ఆయన కోరారు. కార్పొరేషన్ పై ప్రభుత్వం స్పందించకపోతే కార్పొరేషన్ నిధుల సాధన లక్ష్యంగా ఏప్రిల్ మాసంలో భారీ బహిరంగ సభకు సన్నద్ధం మవుతున్నట్లు తెలిపారు .

# లోక కళ్యాణం కోసం హిమాలయాల్లో తపస్సు

**- రాచకొండ లోని బ్రీత్ మౌంటెన్ రిట్రీట్ ఆధ్యాత్మిక కేంద్రంలో అరవింద్ రెడ్డి జన్మదిన వేడుకలు**



**సంస్థాన్ నారాయణపురం వెలుతురు మార్చి 09:** లోక కళ్యాణం కోసం బ్రీత్ మౌంటెన్ రిట్రీట్ ఆధ్యాత్మిక కేంద్రం వ్యవస్థాపకుడు పులసాని అరవింద రెడ్డి హిమాలయాల్లో తపస్సు ప్రారంభించారు. ఆయన జన్మదిన వేడుకలు రాచకొండలోని బ్రీత్ ఆశ్రమంలో సోమవారం నిర్వహించారు. మానవాళి సుఖశాంతుల కోసం, అరవిందుని సిద్ధాంతాల అమలు కోసం ఆయన చేపట్టిన తపస్సు విజయవంతం కావాలని ప్రార్ధనలు చేశారు. బ్రీత్ ఆధ్యాత్మిక కేంద్రం మేనేజర్ సలాం ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన తహసిల్దార్‌కు ఘన సన్మానం

**- ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలి**

**- సామాజిక కార్యకర్త వల్లపురెడ్డి శ్రీధర్ రెడ్డి**



వనపర్తి, వెలుతురు ప్రతినిధి మార్చి 09: పెబ్బేరు మండల తహసిల్దార్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణ రెడ్డి తహసిల్దార్‌ను సోమవారం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, సామాజిక కార్యకర్త వల్లపురెడ్డి శ్రీధర్ రెడ్డి, బీ.సీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వి. వెంకటన్న గౌడ్, హనుమంతు రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనాథ్ నాయుడు, విష్ణువర్ధన్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. తహసిల్దార్ కార్యాలయంలో ఆయనకు పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని, ధరణి/రెవెన్యూ అంశాలపై సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా రెవెన్యూ యంత్రాంగం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థుల వీలుకోలు సమావేశం





**గుండాల మార్చి 9,(వెలుతురు న్యూస్):**

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుండాల లో సోమవారం జరిగిన పదవ తరగతి విద్యార్థుల వీడుకోలు సమావేశం ఘనంగా జరిగింది. 9వ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు ఏర్పాటుచేసిన ఈ వీడ్కోలు సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంధం చంద్రకళ మాట్లాడుతూ పదేళ్ల పాఠశాల ప్రయాణం వెలకట్టలేని స్నేహం కన్న తల్లితండ్రి లాగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ఇవన్నీ ఒక ఎత్తు అయితే ఇప్పుడు పదవ తరగతి పూర్తి చేసుకుని పాఠశాల నుంచి గడప దాటి వెళుతున్నామన్న బాధ మరో ఎత్తు అని అన్నారు. విద్యార్థులను ఆశీర్వదిస్తూ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలకు ఎదగాలని పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గ్రామ ఉపసర్పంచ్ ఆవుల సాయి ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియా మోజులో పడి తమ భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని, ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను మననం చేసుకుంటూ ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలను మంచిగా రాసి ఈ పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలను తీసుకురావాలని సూచించారు. అనంతరము విద్యార్థులు చేసిన సాంస్కృత కార్యక్రమాలు అలరించాయి ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం సిఆర్పిలు తదితరులు పాల్గొన్నారు

# ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుద్య వారోత్సవాలు



**నార్కట్ పల్లి వెలుతురు మార్చి 09:** ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమంలో పారిశుద్య వారోత్సవాల సందర్భంగా నార్కట్‌పల్లి మేజర్ గ్రామపంచాయతీలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్, ఉపసర్పంచ్ ప్రవీణ్ రెడ్డి, పాలక మండలి సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ఎం.డి. సుభానుద్దీన్ పాల్గొన్నారు. అలాగే డాక్టర్స్ హాస్పిటల్ సిబ్బంది, అంగన్వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, ఛాచీవీలు కలిసి గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు పారిశుద్యంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా శుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బాకరం జనార్దన్ పర్రెపాటి సైదులు మంద ఉమా గిరిప్రసాద్ మెడబోయిన రాంబాబు మరియు వేముల నర్సింహ గ్రామపంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఎన్నికలలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి



**గుండాల మార్చి 9.(వెలుతురు న్యూస్):**

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు సోమవారము భోజన విరామ సమయంలో మండల వనరుల కేంద్రం గుండాలలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ప్రతినిధి దేవన బోయిన లింగయ్య మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్య వైఖరికి నిరసనగా టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మొదటిరోజు పాఠశాల స్థాయిలో నల్ల బ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారూ, ఈనెల 16న జిల్లా కేంద్రంలో, ఈనెల 20న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు పేస్కేలు వేతనాలు చెల్లించడంతోపాటు గత సంవత్సరము 29 రోజుల సమ్మె కాలపు వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎం ఐ ఎస్ దేవన బోయిన నరేష్, కంప్యూటర్ ఆపరేటర్ హనీఫ్, మెసెంజర్ ముత్తయ్య, పి టి ఐ రాస కచ్చుల నరసమ్మ తదితరులు పాల్గొన్నారుద.

# అమెరికా యుద్ధోన్మాదంపై నోరు విప్పకుండా భారత ప్రజలపై భారాలు మోపుతున్న మోడీ

**- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్ వీరయ్య**



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 09:**

ఇరాన్ పై ఇజ్రాయిల్ –అమెరికా పాషవిక దాడిని ఖడించకుండా భారత ప్రజలపై భారాలు మోపుతున్న దేశ ప్రధాని మోడీ వైఖరి సరైంది కాదని, ప్రపంచానికి సమాధానం చెప్పాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య డిమాండ్ చేశారు. రామన్నపేట సిపిఎం మండల కార్యాలయంలో మండల కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఆయుధ సంపత్తితో చమురు నిక్షేపాల దేశాలను టార్గెట్ గా చేసుకొని అమెరికా ఆడిస్తున్న నాటకంలో ఇజ్రాయిల్ ఇరాన్ పై యుద్ధోన్మాదంతో అమాయక జనాలను చంపుతూ ఉంటే విశ్వ గురు అని చెప్పుకునే భారత ప్రధాని చోద్యం చూస్తున్నారని. యుద్ధ ప్రభావం భారత ప్రజలపై గ్యాస్ ధర పెట్రోల్ డీజిల్ ధరలను పెంచి సామాన్యుడి పై పెను బారాలు మోపుతోందని. భారత ఆర్థిక వ్యవస్థ పై ప్రభావం చూపుతోందని అన్నారు. మోడీ ఇజ్రాయిల్ పర్యటన ముగిసిన రెండు రోజులకే ఇరాన్ పై యుద్ధం చేయడం ప్రపంచ దేశాలను ప్రశ్నార్థకంగా భారత్ వైపు చూపిస్తున్నాయని అన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టుపెట్టి చీకటి వాణిజ్య ఒప్పందాలతో భారత ఆర్థిక వ్యవస్థను చిన్నభిన్నం చేస్తున్న తీరును ప్రజలంతా గమనిస్తున్నారని. జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో మోడీ దేశానికి సమాధానం చెప్పాలని అన్నారు. పెంచిన గ్యాస్ ధరలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం ఆందోళనకు పిలుపునివ్వడం జరిగింది. గ్రామీణ ప్రాంత ప్రజలందరూ కూడా పాల్గొని మోడీ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా గొంతు విప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు మేక అశోక్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు బల్గూరి అంజయ్య వనం ఉపేందర్, సీనియర్ నాయకులు ఏభూషి నర్సింహా,మండల కార్యదర్శి వర్గ సభ్యులు బోయిని ఆనంద్,కందుల హనుమంతు, మండల కమిటీ సభ్యులు గన్నేబోయిన విజయభాస్కర్, గొరిగెసోములు, భావండ్లపల్లి బాలరాజు, నాగటి ఉపేందర్, ఎండి రషీద్, బోడిగే రజిత, గంటేపాక శివకుమార్,మునికుంట్ల లెనిన్, శానకొండ రామచంద్రం, గుణగంటి మల్లేశం, పల్లె సత్యనారాయణ, జల్లెల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని భువనగిరిలో మహాధర్నా

**- గాంధీ విగ్రహాలు కాదు విద్యార్థుల స్కాలర్షిప్లు ఇవ్వాలి.**

**- రానున్న బడ్జెట్లో విద్యారంగానికి 50వేల కోట్లు నిధులు కేటాయించాలి.**

**- పల్లగొర్ల మోదీరాందేవ్**



**భువనగిరి వెలుతురు న్యూస్ మార్చి 09:**

విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని వేల మంది విద్యార్థులతో భువనగిరిలో మహా ధర్నా.బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ ఎం పీ ఆర్.కృష్ణన్న, బీసీ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ ఆదేశం అనుసారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, గుండెబోయిన శంకర్, వేముల అనిల్, సాయి ఆధ్వర్యంలో భువనగిరి బాయ్స్ ప్రభుత్వ కాలేజ్ నుంచి బయటకు వచ్చి రోడ్డుపై మహా ధర్నా రాస్తారోకో చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు రావలసిన 9000 వేలకోట్ల స్కాలర్షిప్ ఫీజు బకాయిలు ఇవ్వకుండా పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తుంది. ఈ ప్రభుత్వం, విద్యార్థులకు రావలసిన ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి,వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేసి గాంధీ విగ్రహాలు పెట్టడానికి డబ్బులు ఉంటాయి. ప్రభుత్వం దగ్గర మూసి సుందరీకరణ ఫోర్త్ సిటీకి లక్షల కోట్లు ఉంటాయి. గాని విద్యార్థులకు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు ఉండయా, ప్రభుత్వం స్కాలర్షిప్లు ఇవ్వక పరీక్షల సమయంలో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. కాలేజ్ యజమాన్యాలు ఫీజులు కడితేనే హాల్ టికెట్లు ఇస్తాం సర్టిఫికెట్లు ఇస్తామని విద్యార్థులను వేధిస్తున్న ఈ ప్రభుత్వానికి ఏమాత్రం చెలమతనం లేదు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించింది అన్నారు. రానున్న బడ్జెట్లో విద్యారంగానికి 50 వేల కోట్లు కేటాయించాలి. ఇంజనీరింగ్ ఎంబీఏ ఎంసీఏ చదివే విద్యార్థులకు పూర్తి ఫీజు ప్రభుత్వమే భరించాలి. సంక్షేమ హాస్టల్సకు సొంతభవనాలు నిర్మించాలి. అప్లై చేసుకున్న ప్రతి ఒక్కరికి ఓవర్సీస్ స్కాలర్షిప్ ఇవ్వాలి మెస్ చార్జీలు పెంచాలి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో పెట్టిన విద్యార్థులకు 5 లక్షల లక్షల భరోసా కార్డు ఇవ్వాలి. 100రోజుల్లోనే విద్యార్థుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక విద్యార్థుల చావులపై పేలాలు ఏరుకుంటుంది. ప్రభుత్వం 100 రోజుల్లో రాజీవ్ గాంధీ ఇంద్రగాంధీ విగ్రహాలు తప్ప రాష్ట్ర ప్రజల బ్రతుకులు ఏమి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.50 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి. ప్రభుత్వాన్ని నిరుద్యోగులు జబ్బకు సంచేసుకొని ఊరూరు తిరిగి అధికారంలో తీసుకొస్తే ఈ ప్రభుత్వం నిలువున ముంచింది. హాస్టలకు సొంత భవనాలులేవు ఉన్న అద్దె కొంపలకు బెచ్చులూడి విద్యార్థులు చనిపోయే ప్రమాదం ఉన్న ఈ ప్రభుత్వం నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహరిస్తుంది. ఆర్ కృష్ణన్న కొట్లాడి విద్యార్థుల కోసం పూర్తి ఫీజులను ప్రభుత్వమే భరించే విధంగా పెట్టిస్తే ఆ జీవోను ఈ ప్రభుత్వం ట్రస్ట్ బ్యాంక్ పెడతామని తుంగలోకి దొరుకుతుంది. రాజకీయంగా ఆర్థికంగా విద్యా పరంగా ఎస్సీ ఎస్టీ బీసీలు ఎదవకుండా కుట్ర చేస్తున్నారు ప్రభుత్వం నాయకులు ఇక ఊరుకునే ప్రసక్తే లేదు. ఈ ప్రభుత్వం వెంటనే విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయాలి పెంచిన ఫీజులన్నీ ప్రభుత్వమే భరించాలి. ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలి. జనాభా తమాషా ప్రకారం గా ఎస్సీ ఎస్టీ బీసీలకు రాజకీయ అవకాశాలు రానున్న బడ్జెట్లో విద్యార్థులకు 50 వేల కోట్లు నిధులు కేటాయించాలని లేనియెడల పెద్ద ఎత్తున ఎంపీ ఆర్ కృష్ణన్ ఆధ్వర్యంలో ధర్నాలు రాస్తారోకోలు బస్సులు దానాలు చేసి ప్రభుత్వాని అట్టుడికిస్తామని హెచ్చరిస్తున్నాం ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, సామాజికవేత బట్టు రామచంద్రయ్య, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు గుండెబోయిన శంకర్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు వేముల అనిల్,ఉడతల సాయి, ఎడ్ల మహాలింగం, దీపక్,ఉదయ్, ఆర్యన్,మానస, ఉదయ్ శ్రీ, రమాదేవి, వినూత్న, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ఐటా జహీరాబాద్ యూనిట్ ఆధ్వర్యంలో

# ఉపాధ్యాయుల ఇఫ్తార్ విందు

**- ఐక్యత, సామరస్యానికి వేదిక....**



**జహీరాబాద్ వెలుతురు మార్చి 9:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో ఆదివారం ఆల్ ఇండియా ఇన్‌క్లూసివ్ టీచర్స్ అసోసియేషన్ (ఐటా) జహీరాబాద్ యూనిట్ ఆధ్వర్యంలో వివిధ మతాలకు చెందిన ఉపాధ్యాయుల కోసం ఇఫ్తార్ విందు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉపాధ్యాయుల మధ్య పరస్పర సౌహార్దం, ఐక్యతను పెంపొందించే లక్ష్యంతో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జహీరాబాద్ మండల విద్యాధికారి ఎం. మనయ్య, కోహీర్ మండల విద్యాధికారి మొహమ్మద్ జాకీర్ హుస్సేన్ హాజరై ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని, మతాలకు అతీతంగా సమాజంలో శాంతి, సామరస్య వాతావరణాన్ని నెలకొల్పడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని వారు పేర్కొన్నారు. గౌరవ అతిథులుగా మాజీ మండల విద్యాధికారి ఎస్. బసవరాజ్, జీహెచ్ఎం జీహెచ్ఎస్ రంజోల్ నాను సింగ్ రాథోడ్, తులసీరామ్ రాథోడ్ (టీబిఈఎస్ఎస్), శంకరయ్య (జిటిఏ), శ్రీశైలం (పిఆర్టీయు), సిరాజుద్దీన్ (టీఎస్ యుటీఎఫ్), అబ్దుల్ మాజీద్ (ఎస్టియూటీఎస్), పి. జగదీశ్వరయ్య (టీపిటీఎఫ్) , కిష్టయ్య (ఎస్జిటీయు), సైలూ (యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి), మొహమ్మద్ సలాహుద్దీన్ (జిటిఏ జిల్లా కార్యదర్శి), శ్యామ్ (యుటీఎఫ్ రాష్ట్ర సభ్యుడు) పాల్గొని కార్యక్రమాన్ని అభినందించారు. ఈ సందర్భంగా జెడ్‌పీహెచ్ఎస్ శాంతినగర్‌కు చెందిన సయ్యద్ అబ్దుల్ రౌఫ్ (ఎస్జిటి) ప్రభుత్వ సేవల నుండి పదవీ విరమణ పొందిన సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుడిగా ఆయన చేసిన సేవలను అతిథులు ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు.దకార్యక్రమానికి మొహమ్మద్ ఇమ్రాన్ అహ్మద్ ఖాన్ అధ్యక్షత వహించగా, ఖాజా నిజాముద్దీన్ కన్వీనర్‌గా వ్యవహరించారు. మెటల్‌కుంటకు చెందిన ఎస్ఏ ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు మొహమ్మద్ ఎర్షాద్ తెలుగు భాషలో ప్రసంగించి ఉపాధ్యాయ సంఘాల ఐక్యత, సామాజిక సామరస్యంపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఐటా యూనిట్ కార్యదర్శి సయ్యద్ హాఫీజ్ అలీ, మీడియా కార్యదర్శి అబ్దుల్ మాజీద్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక కృషి చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న అతిథులు ఐటా సంస్థ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ, వివిధ ఉపాధ్యాయ సంఘాలు మరియు మతాలకు చెందిన ఉపాధ్యాయులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సామాజిక ఐక్యత, సౌహార్ద వాతావరణాన్ని పెంపొందించేందుకు చేసిన ప్రయత్నం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యా రంగానికి చెందిన ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భువనగిరి జగదేవపూర్ ప్రధాన రహదారి వడపర్తి శివారులో ఘోర రోడ్డు ప్రమాదం



**భువనగిరి మర్చి, 9 (వెలుతురు న్యూస్):** ఆటోను డీసీఎం వాహనం ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి తిమ్మాపురానికి చెందిన డొంకెన నరేష్ అక్కడికక్కడే మృతి సురేష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి తీవ్రంగా గాయపడిన కేతమ్మను హైదరాబాదు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు ముగ్గురి మృతితో తిమ్మాపురం గ్రామంలో విషాద ఛాయలు.

# ఘోర రోడ్డు ప్రమాదం తృటిలో తప్పిన పెను ప్రమాదం

**నార్కట్ పల్లి వెలుతురు మార్చి 09:**



నార్కట్‌పల్లి అద్దంకి హైవేపై సోమవారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నల్గొండ నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఒక కారు ఎల్లారెడ్డిగూడెం గ్రామం వద్ద ఫ్లైఓవర్ దగ్గర అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కిరాణా షాపు డబ్బా కొట్టును మరియు కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టింది. అనంతరం కారు బోల్తా పడింది. అతివేగంతో పాటు డ్రైవర్ నిద్రమత్తులో ఉండటమే ప్రమాదానికి కారణమైందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలు మాత్రమే అయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో రోడ్డు పక్కన ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కిరాణా షాపులో కూడా ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగకుండా తప్పించుకుంది. ప్రమాదాన్ని గమనించిన స్థానిక గ్రామస్థులు వెంటనే స్పందించి క్షతగాత్రులను కారులో నుండి బయటకు తీసి సహాయం చేశారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

**- ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన**



**నార్కట్ పల్లి వెలుతురు మార్చి 09:**

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని షాపులు మరియు ప్రధాన కూడళ్ల వద్ద ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తూ, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ప్రజలకు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో చెర్వుగట్టు గ్రామ సర్పంచ్ నేతకాని కృష్ణయ్య, నార్కట్‌పల్లి ఎంపీడీవో ఉమేష్, ఎంపీవో సుధాకర్ పాల్గొన్నారు. అలాగే గ్రామపంచాయతీ కార్యదర్శి, పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నివారించాలని ప్రజలకు సూచించారు.

# నూతన విద్యా విధానాన్ని అమలు చేయాలి

**- తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి దుబాషి భాస్కర్**



**మెదక్ వెలుతురు మార్చి 09:**

మెదక్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి దుబాషి భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యా కమిషన్ నివేదిక అశాస్త్రీయమైనదని, ఆ నివేదిక లో ఉన్నటువంటి అంశాలన్నీ ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయని , క్షేత్రస్థాయిలో విద్యా విధానం ఎలా ఉందో అవగాహన లేనటువంటి వ్యక్తులతో విద్యా కమిషన్ ఏర్పాటు చేయడం ఏమిటని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి నూతన విద్యా విధానాన్ని రాష్ట్రంలో యధావిధిగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాల సిద్దు, తపస్ ఉపాధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, మాధవరెడ్డి, నవీన్,జిల్లా ఆర్థిక కార్యదర్శి మంగ నర్సింలు తదితరులు పాల్గొన్నారు

## ఆరుట్ల గ్రామంలో అంబేద్కర్ మహిళా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**- మహిళలు అన్నిరంగాలుగా రాణించడానికి ప్రభుత్వాలు మహిళలను అన్నివిధాలుగా ఆదు కోవాలి చేయాలి**

**- ఆరుట్ల గ్రామపంచాయతీ వార్డు సభ్యురాలు లాలగారి మన్నెమ్మ**



**మంచాల వెలుతురు మార్చి 09:** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగాసుందర య్యనగర్ కాలనీ అంబేద్కర్ మహిళాసంఘం గ్రామపంచాయతీ వార్డు సభ్యురాలు లాలాగారి మన్నెమ్మ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు కేక్ కట్ చేసి ఆటపాటల తో ఘనంగా నిర్వహించారు సందర్భంగా వార్డు సభ్యురాలు మనెమ్మ మాట్లాడుతూ మహిళలు అం టేనే ఇప్పటికీ చిన్నచూపుగానే చూస్తున్నారు మహిళలు అన్నిరంగాల్లో దూసుకెళ్తున్న మహిళల కు మాత్రంసరైన రక్షణ గౌరవం లేకుండాపోయింది అన్నారు మహిళ లేనిదే సృష్టికి జీవం లేదు అన్నారు అలాం టి మహిళల కు సరైన గౌరవం ఇవ్వకపోవడం సిగ్గుచేటు అని అన్నారు ప్రభు త్వాలు మహిళల రక్షణ కోసం ఎన్నోచట్టాలు తీసుకువచ్చిన చట్టాలు సరైన మార్గంలో నిర్వ హించకపోవడంతో ప్రతిరోజు ఏదో ఒకచోట మహిళలపై అత్యాచారాలు ఆత్మహత్యలు జరు గుతూనే ఉన్న ప్రభుత్వాలు మాత్రం నిమ్మకు నేరెత్తినట్టే ఎవరి వ్యవహరిస్తున్నారు మహిళలపై దాడులు అరి కట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయి అని అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి మహిళలకు సరైన రక్షణ కల్పించాలి మహిళలు అన్ని రంగాలుగా ఎద గడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకొని మహిళలకు సరైన గౌరవం ఇవ్వాలి అని అన్నారు ఈకార్యక్రమంలో అంబేద్కర్ మహిళా సంఘం మహిళలు సుందరయ్యనగర్ కాలనీవాసులు త దితరులు పాల్గొన్నారు

## మద్యం మత్తులో కారు నడిపి సెక్యూరిటీ గార్డు మృతి

**- డ్రైవర్ రిమాండ్‌కు తరలింపు**





ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ లక్ష్మా రెడ్డి

**శంకరపల్లి, వెలుతురు మార్చి 09 :** మండలం పరిధిలోని ఫతేపూర్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. మద్యం మత్తులో అతివేగంగా కారు నడిపిన డ్రైవర్ కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, బుర్జు కింది నర్సింలు (45) అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అతను నవపేట్ మండలం మాదిరెడ్డిపల్లి గ్రామానికి చెందినవాడు. ఆదివారం రాత్రి డ్యూటీ ముగించుకుని కందుకూరులో ఉన్న తన బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో ఫతేపూర్ గ్రామ శివారుకు చేరుకున్నప్పుడు ఎదురుగా వస్తున్న టాటా హారియర్ కారు అతివేగంగా వచ్చి అతని వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సింలుకు తలకు మరియు ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు కారు డ్రైవర్ మాచన్నగారి లక్ష్మారెడ్డి (43)ని అదుపులోకి తీసుకున్నారు. అతను తన స్నేహితులతో కలిసి క్రికెట్ మ్యాచ్ చూస్తూ మద్యం సేవించిన అనంతరం శంకరపల్లి నుంచి తన స్వగ్రామం మహాలింగాపూర్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. మద్యం మత్తులో అజాగ్రత్తగా, అతివేగంగా వాహనం నడిపి నర్సింలు మరణానికి కారణమైనందుకు లక్ష్మారెడ్డిని రిమాండ్‌కు తరలించినట్లు శంకరపల్లి సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మృతుడు నర్సింలుకు భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమయ్యే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇటువంటి కేసులను హత్య కేసుల మాదిరిగానే పరిగణిస్తామని సీఐ శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. స్టేషన్‌లో బెయిల్ ఇవ్వడం జరగదని, చట్టప్రకారం నిందితులను రిమాండ్‌కు తరలిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## సమాజ సేవలో ముందున్న మహిళలకు ఆక్స్ఫర్డ్ గ్రామర్ స్కూల్ ఘన సత్కారం





**చెర్లపల్లి, మార్చి 9 వెలుతురు:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని చెర్లపల్లిలోని ఆక్స్ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో సోమవారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. సమాజానికి విశేష సేవలు అందిస్తున్న మహిళా డాక్టర్లు, నర్సులు, మహిళా పోలీస్ అధికారులు, ప్రభుత్వ ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, జీహెచ్ఎంసీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆర్టీసీ మహిళా సిబ్బందిని ఈ సందర్భంగా సత్కరించి వారి సేవలను గుర్తించి గౌరవించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి, బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ప్రేమలత అగర్వాల్, డా. జి. ప్రియాంక, డా. జి. మౌనికలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. వివిధ రంగాలలో సేవలందిస్తున్న మహిళలను గుర్తించి సన్మానించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సన్మానిత మహిళల అంకితభావం, సమాజానికి అందిస్తున్న విలువైన సేవలను పాఠశాల యాజమాన్యం ప్రశంసించింది. కార్యక్రమంలో స్కూల్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శంకర్‌పల్లి పురపాలక సంఘంలో నూతన పాలకవర్గ తొలి కౌన్సిల్ సమావేశం


**- 5కే రన్‌తో ప్రజా పాలన ప్రగతి కార్యక్రమానికి శ్రీకారం**







**శంకర్‌పల్లి, వెలుతురు మార్చి 9:** శంకర్‌పల్లి పురపాలక సంఘ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన పాలకవర్గం తొలి కౌన్సిల్ సమావేశం సోమవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి పురపాలక సంఘ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి గౌరవ శాసన సభ్యులు శ్రీ కాలే యాదయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధి కోసం పార్టీ భేదాలను పక్కనబెట్టి అందరూ కలిసికట్టుగా పని చేయాలని అభిప్రాయపడ్డారు. అనంతరం నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులందరికీ ఎమ్మెల్యే శ్రీ కాలే యాదయ్య శాలువాలతో సత్కరించారు. తదుపరి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శంకర్‌పల్లి పురపాలక సంఘ పరిధిలో సోమవారం 5కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రీ కాలే యాదయ్య గారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్‌పర్సన్ శ్రీమతి జూలకంటి శ్వేత పాండురంగ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ యోగేష్, మున్సిపల్ మేనేజర్ అంజన్ కుమార్, మెప్మా ఆర్పీలు, ఆశా కార్యకర్తలు, పారిశుద్ధ్య సిబ్బంది మరియు ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధి మరియు ప్రజా సేవల మెరుగుదలకు ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు.



## "ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుస్నాబాద్ లో బేసిక్ కంప్యూటర్ స్కిల్స్ పైన సర్టిఫికెట్ కోర్సు రెండవ బ్యాచ్ ప్రారంభం"

**హుస్నాబాద్ వెలుతురు మార్చి 09:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బేసిక్ కంప్యూటర్ స్కిల్స్ పైన రెండవ బ్యాచ్ సోమవారం రోజున ప్రారంభించబడినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి గారు మాట్లాడుతూ ఆధునిక జీవన విధానంలో కంప్యూటర్ విద్య అనేది తప్పనిసరి అని తెలిపారు. ఏ కోర్సు రెండు నెలలు ఉంటుందని, శిక్షణ అనంతరం విద్యార్థుల ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. ఈ సదవకాశాన్ని హుస్నాబాద్ ప్రాంత యువత అందిపుచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ వి. చంద్రమౌళి కామర్స్ లెక్చరర్స్ రమేష్, శ్రీనివాస్ అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ బాలరాజు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఇందిరా నాయనా దేవి, జి. విజయ మరియు ఇతర అధ్యాపక బృందము విద్యార్థులు పాల్గొన్నారు

## చర్లపల్లిలో ఘనంగా ప్రారంభమైన సి.ఐ.ఎ. ఎమ్ఎస్ఎమ్ఈ ఎక్స్‌పో2026 పరిశ్రమల అభివృద్ధితో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి

**- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**










**చర్లపల్లి, మార్చి 9 (వెలుతురు):** చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సి.ఐ.ఎ. ఎమ్ఎస్ఎమ్ఈ ఎక్స్‌పో2026 (6వ ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్) కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఐడీఏ చెర్లపల్లి ఫేజ్××లోని చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ కార్యాలయ సముదాయంలో నిర్వహించిన ఈ ఎక్స్‌పోను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన వివిధ పారిశ్రామిక స్టాళ్లను సందర్శించి పరిశ్రమల ఉత్పత్తులు, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశీలించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటివని ఆయన పేర్కొన్నారు. ఎమ్ఎస్ఎమ్ఈ రంగానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందించడం ద్వారా స్థానిక పరిశ్రమలు మరింత అభివృద్ధి చెందుతాయని చెప్పారు. పరిశ్రమల అభివృద్ధి వల్ల యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతం హైదరాబాద్ నగరంలో ప్రముఖ పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చెందుతున్నదని ఎమ్మెల్యే తెలిపారు. ఇలాంటి ఎక్స్‌పోలు పారిశ్రామికవేత్తలకు పరస్పర పరిచయాలు పెంచుకోవడానికి, కొత్త వ్యాపార అవకాశాలను గుర్తించడానికి మంచి వేదికగా నిలుస్తాయని అన్నారు. ప్రభుత్వ విధానాలు మరియు పరిశ్రమల మధ్య సమన్వయం పెరగడం ద్వారా పరిశ్రమల రంగం మరింత బలోపేతం అవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గెస్ట్ ఆఫ్ హానర్‌గా టీఐఎఫ్ అధ్యక్షులు కె. సుధీర్ రెడ్డి, చెర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షులు డి. శ్రీనివాస రెడ్డి, కార్యదర్శి పీ.ఎస్. మోహన్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఎమ్ఎస్ఎమ్ఈ రంగాన్ని బలోపేతం చేయడం కోసం ఈ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నామని తెలిపారు. పారిశ్రామికవేత్తలకు తమ ఉత్పత్తులను ప్రదర్శించుకునే అవకాశం కల్పించడం, కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేయడం ఈ ఎక్స్‌పో ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, పలువురు పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, సంఘ సభ్యులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. ఎక్స్‌పోలో వివిధ పరిశ్రమలకు చెందిన స్టాళ్లు ఏర్పాటు చేయగా పెద్ద సంఖ్యలో సందర్శకులు హాజరై ఆసక్తిగా వీక్షించారు. ఈ ఎక్స్‌పో ద్వారా చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు మరింత ప్రోత్సాహం లభించి పారిశ్రామిక రంగం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## తిరునల్లార్ శని క్షేత్రంలో శని పేర్చి మహోత్సవాలు ఘనంగా లక్షలాది భక్తుల సందడి రెండు లక్షల మందికి ఉచిత అన్నప్రసాద వితరణ





**కాప్రా, మార్చి 9 వెలుతురు:** పాండిచ్చేరి రాష్ట్రంలోని కరైకల్ ప్రాంతంలో ఉన్న ప్రసిద్ధి చెందిన తిరునల్లార్ ధర్బరణ్యేశ్వర స్వామి ఆలయంలో శని పేర్చి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. కుంభ రాశి నుంచి మీన రాశికి శని గ్రహం ప్రవేశించిన సందర్భంగా ఆలయ అధికారులు ఈ నెల 6వ తేదీ నుంచి 45 రోజులపాటు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శని పేర్చి సందర్భంగా దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తిరునల్లార్ శని క్షేత్రానికి తరలివచ్చి శని భగవానుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తూ తమ భక్తిని చాటుకున్నారు. మార్చి 6, 7, 8 తేదీలలో మాత్రమే సుమారు ఆరు లక్షల మంది భక్తులు ఆలయాన్ని సందర్శించి శని భగవానుడికి ప్రత్యేక దర్శనం తీసుకున్నారు. ప్రతి రెండున్నర సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ శని పేర్చి ఉత్సవాలు భక్తులలో విశేషమైన ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ఆలయ 27వ పీఠాధిపతి కైలై మాసిలామణి దేశిక జ్ఞాన సంబంధ పరమాచార్య స్వామిగళ్ ఆశీర్వాదాలతో ఈ మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ ప్రధాన అర్చకులు టి. రాజస్వామి నాథ శివాచార్యుల ఆధ్వర్యంలో శని భగవానుడికి ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తులసమ్మ చారిటబుల్ ఫౌండేషన్ మరియు సోలిస్ ఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నందనపాటి రాము నేతృత్వంలో భక్తులకు భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు రెండు లక్షల మంది భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ చేసి సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు సేవ చేయాలనే లక్ష్యంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఇప్పటికే ఐదోసారి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే భీరం హరివర్ధన్ రెడ్డి, హుజురాబాద్ మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి, కరైకల్ జిల్లా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ లక్ష్మీ సౌజన్య, కరైకల్ కలెక్టర్ ఇషితా రాఠి, ఆలయ ఈఓ సుబ్రమణ్యం తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అలాగే కాప్రా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, శంకర్ బాబు, విజయేందర్ రెడ్డి, గజేందర్, మోహన్, అరికపూడి ప్రసాద్, డాక్టర్ కె. వెంకటేశ్వర ప్రసాద్, డాక్టర్ కోటేశ్వరరావు, యుఎస్ఏ బాలాజీ, వెంకట రాజు, మేధా సురేష్, మాజీ ఆంధ్రప్రదేశ్ లేబర్ కమిషనర్ శ్రీనివాసరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక క్యూలైన్లు, తాగునీరు, వైద్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు కల్పించారు. శని పేర్చి ఉత్సవాల సందర్భంగా తిరునల్లార్ శని క్షేత్రం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## జహీరాబాద్ మున్సిపాలిటీలో తాగునీటి కొరత నివారణకు రూ.1.20 కోట్ల పనులకు కలెక్టర్‌కు వినతి

**- మిషన్ భగీరథ సరఫరా లోపంతో ప్రత్యామ్నాయ చర్యలు...**

**- బోర్లు, పంప్ సెట్లు, పైప్‌లైన్ ఏర్పాటుకు మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ ప్రతిపాదన...**



**జహీరాబాద్ వెలుతురు మార్చి 09:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా తక్కువగా ఉండటంతో పలు వార్డుల్లో తీవ్ర తాగునీటి సమస్య నెలకొన్న నేపథ్యంలో సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతూ జహీరాబాద్ మున్సిపల్ కు చెందిన వివిధ వార్డుల కౌన్సిల్ సభ్యులతో కలిసి మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో లోకల్ బాడీ అడిషనల్ కలెక్టర్ పాండును కలిసి విన్నతి పత్రం అందజేశారు. జహీరాబాద్ పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకు కొత్తగా సింగిల్ ఫేజ్ మరియు త్రీ ఫేజ్ సబ్‌మర్సిబుల్ బోర్ పంప్ సెట్లు ఏర్పాటు చేయడం, అదనంగా కొత్త బోర్లు త్రవ్వించడం మరియు పైప్‌లైన్ నెట్‌వర్క్ విస్తరణ చేయడం అత్యవసరమని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రతిపాదనలో భాగంగా మొత్తం 37 సింగిల్ ఫేజ్ సబ్‌మర్సిబుల్ బోర్ పంప్ సెట్లు, 37 త్రీ ఫేజ్ సబ్‌మర్సిబుల్ బోర్ పంప్ సెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే 30 బోర్లు త్రవ్వడం మరియు సుమారు 3000 మీటర్ల పైప్‌లైన్ నెట్‌వర్క్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ పనులన్నింటికీ కలిపి సుమారు రూ.1 కోటి 20 లక్షల 80 వేల రూపాయలు వ్యయం అవుతుందని అంచనా వేయగా, తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని అత్యవసరంగా ఈ పనులకు అనుమతి మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. దీనితో పాటు పట్టణంలో అక్కడక్కడా పైపులైన్ లీకేజీల వల్ల విలువైన తాగునీరు వృథా అవుతోందని, వాటికి తక్షణమే మరమ్మత్తులు చేపట్టేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని అడిషనల్ కలెక్టర్‌కు విన్నవించారు. మున్సిపల్ నిధులతో పాటు అదనపు గ్రాంట్లు విడుదల చేస్తేనే వేసవిలో యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయగలమని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. కౌన్సిలర్ల విన్నపంపై సానుకూలంగా స్పందించిన అడిషనల్ కలెక్టర్ పాండు, సంబంధిత అధికారులతో మాట్లాడి నిధుల విడుదలపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మహమ్మద్ జహంగీర్, మహమ్మద్ జమీలోద్దీన్, కౌన్సిలర్ ప్రతినిధులు మహమ్మద్ జాఫర్, మెహమ్మద్ జావీద్, మహమ్మద్ అక్రమ్, మాజీ కౌన్సిలర్ మోతి రాం, కాంగ్రెస్ నాయకులు బర్కత్ పహిల్వాన్ తదితరులు పాల్గొన్నారు.

## నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ను మర్యాదపూర్వకంగా కలిసిన మార్కెట్ కమిటీ ప్రతినిధులు



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 09:** వేముల వీరేశం ను మర్యాదపూర్వకంగా నేడు ఉదయం ఆయన నివాసంలో కలిసిన వలిగొండ – రామన్నపేట మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా నాయక్ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి వారితో డైరెక్టర్లు దానయ్య గౌడ్, కర్నాటి లింగ స్వామి, చంద్రయ్య, దామోదర్ రెడ్డి,ముత్యాలు, పాల్గొన్నారు.

# విద్యార్థులకు పరీక్ష కిట్స్ అందించిన హెల్పింగ్ హ్యాండ్స్ 4 పూర్ సంస్థ









**జహీరాబాద్ వెలుతురు మార్చి 09:**
హెల్పింగ్ హ్యాండ్స్ 4 పూర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో న్యాల్కల్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మీర్జాపూర్ (బి) మరియు జహీరాబాద్ మండలంలోని అల్గోల్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 98 మంది విద్యార్థులకు రూ.15వేల విలువచేసే ఎగ్జామ్ పాడ్, జామెంట్రీ బాక్స్, పెన్స్ ను విద్యార్థులకు అందజేయడం జరిగింది. విద్యార్థులకు అందజేసినటువంటి వస్తువులు ఎంతో ఉపయోగకరంగా ప్రోత్సాహకరంగా ఉంటాయని ప్రాజెక్ట్ డైరెక్టర్ భరత్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.రాజ్ కుమార్ మరియు ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి సంస్థ సభ్యులు వెంకట్ రాంరెడ్డి, సందీప్ ముదిరాజ్, చేతన్ చించోలి, ధన్నారం కార్తీక్, రవి కుమార్ మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ముత్యాల పందిరిలో మురిసిన చిలువేరు వారి వివాహ వేడుక

**- పాలకుర్తి కాంగ్రెస్ ఇంచార్జ్ జాన్సీరెడ్డి సమక్షంలో వధూవరులకు ఆశీర్వాదాలు**

**- నూతన వస్త్రాలు బహుకరించి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు**





**పాలకుర్తి వెలుతురు మార్చి 09:**
పాలకుర్తి మండలం మొరిపిరాల గ్రామ వాస్తవ్యులు చిలువేరు స్వరూప – కృష్ణమూర్తి దంపతుల కుమార్తె ప్రణతి – ప్రశాంత్ గౌడ్ ల లో వివాహ వేడుక ఘనంగా జరిగింది. ముత్యాల పందిరిలో జరిగిన ఈ వేడుకలో పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు జాన్సీరెడ్డి గారితో జనగాం =రూా మెంబెర్ అభిగౌడ్ చిలువేరు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వధూవరులకు నూతన వస్త్రాలు బహుకరించి వారి దాంపత్య జీవితం సుఖశాంతులతో నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి జనగామ ఆర్టీఏ మెంబర్ అభి గౌడ్, గోపా డివిజన్ అధ్యక్షుడు సమ్మి గౌడ్ చిలువేరు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన జంటకు ఆశీస్సులు అందించారు. వివాహ వేడుక ఆనందోత్సాహాల మధ్య ఘనంగా కొనసాగింది.

## అశ్రునయనాల మధ్య పోలేపాక వారి పితృదేవుడికి వీడ్కోలు!

**- బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడి తండ్రి దశదిన కర్మలో ఘన నివాళులర్పించిన చిలువేరు సమ్మయ్య గౌడ్**

**- ఆదర్శప్రాయుడైన తండ్రిని కోల్పోవడం పూడ్చలేని లోటు**

**- పలువురు ప్రముఖుల ఆవేదన**



**కేసముద్రం వెలుతురు మార్చి 09:**
కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మి సాయి గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించిన పోలేపాక శంకర్ (పి.హెచ్.సి రాష్ట్ర కార్యదర్శి) పోలేపాక నాగరాజు (బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు) ల పితృదేవుడి 10వ రోజు కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆత్మీయుల సమక్షంలో జరిగింది. ఈ కార్యక్రమానికి సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, దివంగత ఆత్మకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ.. "తండ్రి కోల్పోవడం అనేది ఏ బిడ్డకైనా తీరని వేదన. సమాజం పట్ల బాధ్యత కలిగిన బిడ్డలను తీర్చిదిద్దిన ఆయన జీవితం ఎంతో ధన్యం. తన క్రమశిక్షణతో, విలువలతో కుటుంబాన్ని ఉన్నత స్థితికి చేర్చిన ఆయన స్మృతి చిరకాలం నిలిచిపోతుంది" అని కొనియాడారు. అనంతరం శోకతప్త హృదయంతో ఉన్న పోలేపాక కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యాన్ని ప్రసాదించారు. ఈ నివాళి కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సర్పంచ్ రాంచందర్, మాజీ ఎంపీటీసీ బాలు నాయక్, మాజీ సర్పంచ్ ఐతే సారయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటేష్, కొలిపాక వెంకన్న, ఎల్ఐసీ ఆనంద్, ముఖేష్, రవి నాయక్,ఇస్లావత్ చందు తదితరులు హాజరై మృతుని చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# కొరత లేదంటూనే ధరల పెంపు

**- గ్యాస్ ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలి - సిపిఎం**




**మోత్కూర్, మార్చి 9,(వెలుతురు న్యూస్ ):**
దేశంలో సరిపడ చమురు, గ్యాస్ నిల్వలు ఉన్నాయని, కొరతలేదని చెప్తూనే, గ్యాస్ ధరలు పెంచి పేదప్రజలపై ఆర్థిక బారం వేయడం సరికాదని, పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి డిమాండ్ చేశారు. సోమవారం రోజున గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ మోత్కూర్ మండలం పాలడుగు గ్రామంలో వలిగొండ తొర్రూర్ రోడ్డుపై గ్యాస్ సిలిండర్ లతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.....గృహ అవసరాల వాణిజ్య సిలిండర్లపై రెండింతల ధరల పెంపును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఉజ్వల పథకం లబ్ధిదారులను కూడ వదలి పెట్టకుండా గృహ అవసరాల గ్యాస్ వినియోగదారులపై రూ 60 ల పెంపు క్రూరమైనదని విమర్శించారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్ పై రూ 115/- ల పెంపుకూడ వినియోగదారులైన ప్రజలపై భారం పడుతుందని పేర్కొన్నారు. పచ్చిమ ఆసియా వివాదం ఈ గ్యాస్ పెంపునకు కారణమని మోడీ ప్రభుత్వం సమర్ధించుకోవడం దివాళాకోరుతనానికి నిదర్శనమని, ఇది ట్రంప్ ప్రభుత్వ యుద్దోన్మాద విధానాలకు మోడీ తలొగ్గి దేశ ప్రయోజనాలను విస్మరిస్తూ అమెరికా ప్రపంచ అధిపత్య విధానాలకు మోడీ ప్రభుత్వం సంసిద్దత తెలుపుతుందని విమర్శించారు. ఈ ధరల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, శాఖ కార్యదర్శి పిట్టల చంద్రయ్య, వెండి యాదగిరి, చింతకింది సోమరాజు, దడిపల్లి నవనీత, మాదవి, కొంపల్లి రాజేశ్వరి, దడిపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# మహీంద్రా ట్రాక్టర్స్‌లో సీఐటీయూ బలోపేతం.. భారీగా చేరిన కార్మికులు

**- మెరుగైన వేతన ఒప్పందాలు, కార్మిక సంక్షేమం కోసం సీఐటీయూనే గెలిపించాలని చుక్క రాములు పిలుపు....**








**జహీరాబాద్ వెలుతురు మార్చి 09:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ గల మహీంద్రా ట్రాక్టర్స్ పరిశ్రమలో కార్మికుల సంక్షేమం, మెరుగైన వేతన ఒప్పందాలు సాధించడంలో సీఐటీయూనే ముందుంటుందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ చుక్క రాములు పేర్కొన్నారు. మహీంద్రా ట్రాక్టర్స్ కార్మికుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం సీఐటీయూ ఎప్పటికప్పుడు పోరాటం చేస్తూ యాజమాన్యాల మెడలు వంచి కార్మికులకు న్యాయం జరిగేలా కృషి చేస్తోందని అన్నారు. గతంలో మహీంద్రా ట్రాక్టర్స్ సంస్థలోనూ, జిల్లాలోనూ, రాష్ట్ర స్థాయిలోనూ సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన వేతన ఒప్పందాలు కార్మికులకు ఎంతో మేలు చేశాయని ఆయన గుర్తుచేశారు. అదే విధంగా కార్మికులకు మెరుగైన వేతనాలు, భద్రతా సౌకర్యాలు, ఇతర సంక్షేమ ప్రయోజనాలు అందించడంలో సీఐటీయూ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను పూర్తిస్థాయిలో కాలరాస్తున్నాయని, కార్మిక చట్టాలను బలహీనపరుస్తున్నాయని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో కార్మికుల హక్కులను కాపాడేందుకు ఒకవైపు ఉద్యమాలు కొనసాగిస్తూ, మరోవైపు పరిశ్రమల స్థాయిలో మెరుగైన వేతన ఒప్పందాలు సాధించేందుకు సీఐటీయూ కృషి చేస్తోందని తెలిపారు. మహీంద్రా ట్రాక్టర్స్‌లో మరోసారి కార్మికులను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్న కొన్ని యూనియన్లను కార్మికులు తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈసారి జరగబోయే ఎన్నికల్లో సీఐటీయూను భారీ మెజారిటీతో గెలిపించడం ద్వారా కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలు, ఉద్యోగ భద్రత, అనేక సంక్షేమ సౌకర్యాలు సాధించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ యూనియన్లకు చెందిన కార్మికులు భారీ సంఖ్యలో సీఐటీయూలో చేరారు. వారికి సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు కండువాలు వేసి ఆహ్వానించారు. కార్మికులు పెద్ద ఎత్తున సీఐటీయూలో చేరడం సంఘానికి మరింత బలం చేకూర్చిందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం, క్లస్టర్ కన్వీనర్ ఎస్. మహిపాల్, యూనియన్ ప్రధాన కార్యదర్శి మహేశ్వర్, నాయకులు గణేష్, వంశీకృష్ణ, నరసయ్య, సిహెచ్ నరేష్, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు వేడుకలు




**బషీర్ బాగ్ వెలుతురు 9 మార్చి :**
తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు వేడుకలను నాంపల్లి లోని గెజిటెడ్ అధికారుల భవన్ లో సోమవారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరుల జీవితంలో సుఖశాంతులు, ఐశ్వర్యం మరియు ఆనందాన్ని నింపాలని కోరుకుంటూ అంతేకాకుండా మానవాళి మధ్యలో ప్రేమ, శాంతి మరియు దాతృత్వం గుర్తుచేసే పండుగే రంజాన్ అని తెలిపారు. త్యాగం మరియు క్రమశిక్షణకు ప్రతీక అయిన ఈ రంజాన్ మాసం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, ఈ రంజాన్ మాసం కేవలం ఆహార పానీయాలను వదిలివేయడం మాత్రమే కాదు, ఇది ఆత్మశుద్ధికి మరియు క్రమశిక్షణకు ఒక గొప్ప మార్గం అని తెలియజేశారు. అందరి ప్రార్థనలన్నీ ఫలించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు తెలియజేస్తూ అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర జనరల్ సెక్రటరి శ్రీ. బి. శ్యామ్, మాట్లాడుతూ క్రమశిక్షణకు, దాతృత్వానికి నిదర్శనం ఈ రంజాన్ మాసం అని గుర్తుచేస్తూ ఈ సందర్భంగా అల్లాహ్ దీవెనలు మీకు ఎల్లప్పుడూ ఉండాలని, అందరి ప్రార్థనలు ఫలించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి ఇఫ్తార్ విందుల్లో పాల్గొనడం వల్ల సమాజంలో శాంతి, సామరస్యం పెంపొందుతాయని, రంజాన్ మనకు నేర్పే త్యాగం, సేవా భావం కేవలం ఈ నెలకే పరిమితం కాకుండా, ఏడాది పొడవునా మన జీవితాల్లో కొనసాగాలని, అప్పుడే ఈ పవిత్ర మాసానికి నిజమైన సార్థకత లభిస్తుందని తెలియజేస్తూ అల్లాహ్ దీవెనలు అందరిపై ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. తెలంగాణ వర్క్స్ అండ్ అకౌంట్స్ డిపార్ట్మెంట్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ శౌకత్ హుస్సేన్ మాట్లాడుతూ మనం ఎంతో పవిత్రమైన రంజాన్ మాసంలో ఉన్నామని ఇస్లాం ఐదు స్తంభాలలో 'రోజా' (ఉపవాసం) ఒకటని తెలియజేస్తూ, మానవాళికి మార్గదర్శకమైన పవిత్ర 'ఖురాన్' గ్రంథం ఈ మాసంలోనే అవతరించిందని అందుకే ఈ నెలకు అంతటి ప్రాముఖ్యత ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఖాదర్, శ్రీ షౌకత్, శ్రీ అత్తర్ పర్వేజ్, శ్రీ లూత్ఫ్ అలీ, శ్రీమతి షబానా, శ్రీ అబ్దుల్లా , శ్రీ చావా రవి, శ్రీ ఉపేందర్ రెడ్డి, శ్రీ జగన్మోహన్ రావు, శ్రీ నరహరి రావు, శ్రీరామ్ రెడ్డి,డా.కె. రామారావు, శ్రీమతి దీపా రెడ్డి, శ్రీ రవీందర్, శ్రీ శ్రీనివాస మూర్తి, శ్రీమతి శాంతి శ్రీ, శ్రీమతి పూనమ్, శ్రీమతి రేవతి, శ్రీమతి సుజాత, శ్రీశ్రీరామ్, శ్రీ మల్లిఖార్జున రెడ్డి, శ్రీ శ్రీనివాస్ రెడ్డి, శ్రీ శ్రీనివాస్, శ్రీ అమీర్ పాషా, జిల్లాల & ఫోరం ప్రెసిడెంట్స్, సెక్రటరీలు మరియు జిల్లాల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మహిళా శక్తికి ప్రెస్ క్లబ్ (హెచ్-2843) ఘన వందనం

**- సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర వెలకట్టలేనిది**

**- వేల్పుల విజేత, ఐసీడీసిఎస్ అధికారిణి**

**- జర్నలిజం రంగంలో మహిళలు ధైర్యంగా ముందుకు రావాలి**

**- టి. సంతోష్ చక్రవర్తి, టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు**

**- గృహిణులే ఇంటిని నడిపించే శక్తులు**

**- అంతోటి శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ (హెచ్-2843) అధ్యక్షుడు**






**ఖమ్మం, వెలుతురు మార్చి 09:**
ఖమ్మం నగరంలోని ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజేఎఫ్ హెచ్ 2843) మరియు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సమాజం లోని వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళా మూర్తులను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీసిఎస్ అధికారిణి వేల్పుల విజేత మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని పేర్కొన్నారు. కుటుంబ బాధ్యతలతో పాటు వృత్తి జీవితంలో కూడా మహిళలు ముందంజలో నిలవడం సమాజానికి ఆదర్శమని అన్నారు. సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే పురుషుల కోసం సహకార ఎంతో అవసరమని అన్నారు. నా భర్త సహకారమే నా ఈ విజయ రహస్యం తన వ్యక్తిగత అనుభవాలను పంచుకుంటూ నేను ఈరోజు ఈ స్థాయిలో నిలబడి మీ ముందు మాట్లాడుతున్నాను, అంటే దానికి నా భర్త అందించిన పూర్తి సహకారమే నా విజయానికి కారణమని విజేత భావోద్వేగంగా పేర్కొన్నారు. ప్రతి మహిళ తన లక్ష్యాలను చేరుకోవాలంటే భర్తతో వెన్నుదన్నుగా నిలిస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఓబీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ హారిక నాయుడు మాట్లాడుతూ మహిళా సాధికారత మాటల్లోనే కాకుండా కార్యరూపంలో కనిపించాలన్నారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టుల సేవలను కొనియాడుతూ, క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లను గుర్తు చేశారు. జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ, కోశాధికారి అర్వపల్లి నగేష్ లు మాట్లాడుతూ జర్నలిజం రంగంలో మహిళా విలేకరులు ధైర్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు గౌరవరపు జగదీష్ ,తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారిణి రమాదేవి, న్యాయవాది శృతి, ఏఎస్ఐ పి లక్ష్మి,విలేకరి నవజీవన ప్రియ, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు ఎలుగోటి వెంకట్రావు, ప్రెస్ క్లబ్ కోశాధికారి భద్రయ్య, జిల్లెల మహేష్, యాంకర్ నాయిని స్వాతి, యాంకర్ హర్షిక, యాంకర్ రేష్మ, అంతోటి నాగమణి, గౌరవరపు సునీత తదితరులతో పాటు ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు, సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో విలేకరులు పాల్గొన్నారు.

## పుట్టు వెంట్రుకల కార్యక్రమంలో పాల్గొన్న మున్నూరు కాపు సంఘం నాయకులు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చ్ 8**
కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు గంట చంద్రశేఖర్ – రాంబాయి, మనుమల పుట్టు వెంట్రుకల కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ రావు పటేల్, మున్నూరు కాపు జిల్లా మాజీ జనరల్ సెక్రెటరీ, టీఎంకే జె ఎఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ముదాం శంకర్ పటేల్, సంగమేశ్వర్ సర్పంచ్ లోయపల్లి శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ డి ఈ గంట శ్రీరామ్, రిటైర్డ్ ఎంఆర్ఓ తదితరులు పాల్గొన్నారు.

## కొండాపూర్‌లో టెక్కీ బలవన్మరణం

**హైదరాబాద్,మార్చి 9( వెలుతురు):**
హైదరాబాద్ నగరంలోని కొండాపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య చేసుకుంది. సుమధుర అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న యువతి ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలిని కర్ణాటకకు చెందిన మనుశ్రీ(32)గా గుర్తించారు. పని ఒత్తిడి వల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. ఆదివారం రాత్రి నుంచి ఆమె ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో.. పక్క గదిలో ఉంటున్న యువతికి మృతురాలి తల్లిదండ్రులు ఫోన్ చేశారు. ఈక్రమంలో సోమవారం ఉదయం స్నేహితురాలు వచ్చి గది తలుపులు తీయడంతో మనుశ్రీ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని విగతజీవిగా కనిపించింది. వెంటనే అపార్టుమెంట్ సెక్యూరిటీ సిబ్బంది గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

## ప్రధాన మంత్రి - సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం సద్వినియోగం చేసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 9**
సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రధాన మంత్రి - సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూTGREDCO ఆధ్వర్యంలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమ లో భాగంగా పీఎం - సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా ప్రతీ విద్యుత్ వినియో గదారుడు తమ ఇళ్ల రూఫ్ టాప్ పై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని, కర్బన ఉద్గారాలు జీరో స్థాయికి తేవాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపల్ పరిధిలో అవగాహన కల్పించా లని సూచించారు. మూడు కిలోవాట్ల సోలార్ పలకలు ఏర్పాటు చేసుకొంటే కేంద్ర ప్రభుత్వం రూ.78 వేలు సబ్సిడీ అందిస్తుందని, దాంతో పాటు ప్రతీ నెలా రూ.2 వేల విద్యుత్ బిల్లు అదా చేయవచ్చని తెలిపారు. పెట్టుబడి 5 సంవత్సరాల్లో తిరిగి వస్తుందని అన్నారు. సోలార్ విద్యుత్ పర్యావరణ హితమని తెలిపారు. మిగులు విద్యుత్ ను గ్రిడ్ కు ఇస్తూ అదనపు ఆదాయాన్ని కూడా పొందవచ్చని , ఈ పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్–రెవెన్యూ .వి. విక్టర్, ~ూజూదీ మధుమో హన్ , జిల్లా ప్రజా సంబంధాల అధికారి తిరుమల, TGREDCO జిల్లా మేనేజర్ జు. రమణ, AFO జగదీప్ రామ్ పాల్గొన్నారు.

## తన భూమి ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ లో ఫిర్యాదు

**మోత్కూరు, మార్చి 09 (వెలుతురు న్యూస్ );**



తన భూమి లోకి అక్రమ అక్రమంగా ప్రవేశించడమే కాకుండా తనపై దాడి చేసిన వ్యక్తులపై, అందుకు సహకరిస్తున్న మున్సిపల్ అధికారులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని మోత్కూరు మున్సిపల్ పరిధిలోని బుజిలాపురం మాజీ సర్పంచ్ చేతరాశి వీరస్వామి సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రజావాణి లో కలెక్టర్ అనురాగ్ జయంతికి ఫిర్యాదు చేశారు.

## శ్రీకాంత్ గౌడ్ కు ఆత్మీయుల సన్మానం

**మోత్కూర్, మార్చి 9, (వెలుతురు న్యూస్ ):**



మోత్కూర్ మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన 9 వ వార్డు కౌన్సిలర్ ను తెలంగాణా రాష్ట్ర రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ చిలువేరు అభి గౌడ్ ఘనంగా సన్మానించారు అనంతరం ఆయనను అభినదిస్తూ ....శ్రీకాంత్ గౌడ్ గెలుపుకై సహకరించిన భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ గారికి తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ గారికి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి గార్లకు అభి గౌడ్ చరవాణి ద్వారా ధన్యవాదాలు తెలిపారు .....ఆయన వెంట జనగాం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

**కత్బుల్లాపూర్ మార్చి 09(వెలుతురు ప్రతినిధి):**



సోమవారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొంపల్లి సర్కిల్56లో అక్రమంగా నిర్మించిన షెడ్లపై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. కొంపల్లి మరియు దూలపల్లి ప్రాంతాలలో అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ షెడ్లను అధికారులు గుర్తించి వాటిని కూల్చివేశారు. డిప్యూటీ కమిషనర్ ఎన్. కృష్ణా రెడ్డి ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు మరియు మున్సిపల్ సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి, అనుమతి లేకుండా నిర్మించిన షెడ్లను గుర్తించారు. అనంతరం మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అక్రమ షెడ్లను జెసిబి సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ శ్రీ ఎన్. కృష్ణా రెడ్డి మాట్లాడుతూ, మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి లేకుండా ఎలాంటి షెడ్లు లేదా నిర్మాణాలు చేపట్టరాదని ప్రజలకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మహిళా దినోత్సవ సందర్భంగా ఖమ్మం నగరం 35వ డివిజన్లో ఘనంగా మహిళ దినోత్సవం



**ఖమ్మం వెలుతురు మార్చి 09 :**

ఖమ్మం నగరం లోని 35వ డివిజన్లో కార్పొరేట్ యల్లంపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. డివిజన్లోని స్థానిక మహిళలు ఒక ప్రాంగణంలో సమావేశం జరిపి,ముందుగా కేకులు కట్ చేసి అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎల్లంపల్లి పద్మ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగంలో ముందు ఉండాలని పురుషులతో సమానంగా పోటీ పడాలని.అలా పోటీ పడడం వల్ల మహిళలు అన్ని రంగంల లో ముందుకెళ్లి సమాజంలో మహిళల కు ప్రత్యేకంగా ఒక గుర్తింపు వస్తుందని తెలిపారు. మాజీ కార్పొరేటర్ బజ్జూరి ఇందిరా రెడ్డి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని పేర్కొన్నారు. కుటుంబ బాధ్యతలతో పాటు వృత్తి జీవితంలో కూడా మహిళలు ముందంజలో నిలవడం సమాజానికి ఆదర్శమని అన్నారు. సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే పురుషుల కోసం సహకార ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలోగా కార్పొరేటర్ మాట్లాడుతూ మహిళలు ఒక అబాల కాదని ఒక శక్తి అని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో యల్లంపల్లి పద్మ, బజ్జూరి ఇందిరా రెడ్డి, ఉప్పుగడ్ల ప్రమీల,బుగ్గ వీటి కృష్ణవేణి, లీలావాని, లక్ష్మి, శ్రీదేవి,లతా,దేవి, కౌసల్య, స్వప్న తదితర మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ గొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకున్న బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్.



**కుత్బుల్లాపూర్ మార్చి 09 (వెలుతురు ప్రతినిధి):**

సోమవారం జిహెచ్ఎంసి దుండిగల్ సర్కిల్ పరిధి దుండిగల్ లోని శ్రీశ్రీశ్రీ గొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మ సమేత మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంగు బంగారంగా నిలిచి గ్రామ ప్రజల కోరికలను తీరుస్తున్న మల్లికార్జున స్వామి దయ, కృపా కటాక్షాలు భక్తులపై సంపూర్ణంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు శంబిపూర్ కృష్ణ, జక్కుల కృష్ణ యాదవ్, జక్కుల విజయ శ్రీనివాస్ యాదవ్, గోపాల్ రెడ్డి, ఆనంద్, ఆలయ కమిటీ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, సాయి యాదవ్, మల్లేష్, బి. క్రిష్ణ, జే. క్రిష్ణ, ఎక్స్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, పాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్ గౌడ్, నాయకులు కొలుతూరి మల్లేష్, వెంకటేష్, కుమ్మరి వీరేష్, కృష్ణ, బండారి మహేష్, లబ్ది పేర్ల బిక్షపతి, ఉప్పరి కృష్ణ, వీర చంద్రుడు, జక్కుల సహదేవ్, సాయికుమార్, జగన్ నాయక్, అమరం బాల్ రెడ్డి. వారాల వినోద్, రాజ్ కుమార్, కోలా శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎసిబి వలలో చిక్కిన పోలీసులు

**- లక్ష లంచం తీసుకుంటుండగా పట్టివేత**



**హైదరాబాద్, మార్చి9(వెలుతురు):**

సైబర్ క్రైం కేసులో అరెస్టు చేయకుండా ఉండడానికి ఫిర్యాదుదారుడు నుంచి లంచం తీసుకుంటూ ఇద్దరు ఆర్ఎస్సైలు ఏసీబీకి చిక్కారు.మల్కాగిజిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీ నగర్ సైబర్క్రైం పోలీసు స్టేషన్కు చెందిన ఇద్దరు ఎస్సైలు ప్రమోద్ గౌడ్ , జటావత్ బాబు నాయక్ సోమవారం రూ. లక్ష లంచం తీసుకుంటుండంగా పట్టుబడ్డారు. ఎల్బీ నగర్ చౌరస్తాలో ఎస్సై జటావత్ బాబు ఈ డబ్బును తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ గంగసాని శ్రీధర్ ఆధ్వర్యంలో దాడుల నిర్వహించి పట్టుకున్నారు. లక్ష రూపాయల నగదును పట్టుకుని ఇద్దరిని అరెస్టు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు. బాధ్యత గల ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఎవరైనా విధుల ఉల్లంఘులకు పాల్పడి లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నంబర్కు ఫోన్ చేయాలని ఏసీబీ శాఖ సూచించింది. సోషల్ మీడియా నంబర్ 9440446106 అనే వాట్సప్ నంబర్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించింది.

## ప్రజావాణి కి 97 దరఖాస్తులు

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 9**

ప్రజావాణి లో అర్జీదారులనుండి అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్. జిల్లా ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి 97 దరఖాస్తులు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రజల నుండి నేరుగా దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, భూ సంబంధిత, సంక్షేమ పథకాలు , ఇతర సమస్యల పై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్లు విక్టర్ మధుమొహాన్ లకు దరఖాస్తులు సమర్పించారు. ప్రతి దరఖాస్తును కలెక్టర్ ఓపికగా స్వీకరించి సంబంధిత శాఖ అధికారులకు అందిస్తూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను ప్రాధాన్యత గా తీసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు జిల్లా అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు సకాలం లో పాల్గొనాలని, ప్రత్యేకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, అన్ని కార్యక్రమాలలో అందరూ పాల్గొనాలని పరిశుభ్రత లో జిల్లాను ముందుంచాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా అమలు జరుగుతున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న నేపథ్యం లో ఈ కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా స్థాయి పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (MPDO\T) మండల పంచాయతీ అధికారులు (MPO\T)ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పేరుకుపోయిన ఘన వ్యర్థాలను (రాశీశ్రీఅస ఔషురవ) తొలగించడం, ఈ-వేస్ట్ సేకరణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం , వాటిని శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అలాగే పల్లె ప్రకృతి వనాలలో ఉన్న సదుపాయాల నిర్వహణ, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అన్ని సంబంధిత అధికారులు తమ పరిధిలోని గ్రామ పంచాయతీలను సందర్శించి, నిర్వహిస్తున్న కార్యక్రమాలను పరిశీలిస్తూ వాటిలో పాల్గొనాలని సూచించారు. నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలను ఎప్పటికప్పుడు పంపించాలని, అన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు మండల పంచాయతీ అధికారులు రోజువారీ నివేదికను (Daily Report) నిర్దేశించిన ఫార్మాట్లో సంతకాలతో సమర్పించాలని ఆదేశించారు. జిల్లా స్థాయి పంచాయతీ అధికారులు నిర్దేశించిన ఫార్మాట్లో సమాచారాన్ని సేకరించి, సకాలం లో జిల్లా పంచాయతీ అధికారుల కార్యాలయానికి సాఫ్ట్ కాపీతో పాటు సంతకాలతో కూడిన హార్డ్ కాపీని సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని గ్రామాల్లో సమర్థవంతంగా అమలు చేసి, పరిశుభ్రత పరంగా జిల్లాను ముందుండేలా అధికారులు కృషి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి చెత్త తొలగింపు, ఘన వ్యర్థాల నిర్వహణ వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ ప్రెస్ క్లబ్ నూతన బాధ్యుల ప్రమాణ స్వీకారం

- **పాత్రికేయుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**
- **నిజామాబాద్ నగరంలోని బసవ గార్డెన్లో నిజామాబాద్ అర్బన్ ప్రెస్ క్లబ్ నూతనంగా ఎన్నికైన బాధ్యుల ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది.**
- **పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్**









**నిజామాబాదు వెలుతురు మార్చి 09:**

నిజామాబాద్ ప్రెస్ క్లబ్ నూతన బాధ్యుల ప్రమాణ స్వీకారం, పాత్రికేయుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది, నిజామాబాద్ నగరంలోని బసవ గార్డెన్లో నిజామాబాద్ అర్బన్ ప్రెస్ క్లబ్ నూతనంగా ఎన్నికైన బాధ్యుల ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ గారు, పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మరియు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యం సమాజంలో నాలుగో స్తంభమైన జర్నలిజం వ్యవస్థ పటిష్ఠంగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని పేర్కొన్నారు. నిజామాబాద్ జర్నలిస్టుల చిరకాల కోరిక అయిన ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తాము గుర్తిస్తున్నామని, వారి ఆరోగ్య భద్రత (హెల్త్ కార్డ్స్) విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. వార్తల సేకరణలో వాస్తవాలకు ప్రాధాన్యతనిస్తూ, పేదల గొంతుకగా నిలవాలని ఆయన నూతన కార్యవర్గానికి సూచించారు. టిఆర్పి రేటింగ్ గురించి , ఆలోచించకుండా వాస్తవాలు మాత్రమే వెలుగులోకి తీసుకురండి ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలవాలి పాత్రికేయుల పోరాట పటిమను అభినందించారు. ఒక నాయకుడు ఎదగాలన్న మీడియా సహకారంతో ఎంతో అవసరం ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ, క్షేత్రస్థాయి సమస్యలను ప్రభుత్వానికి వివరించడంలోనూ జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలని కోరారు. నిజామాబాద్ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, జర్నలిస్టుల సంక్షేమం కోసం ఎమ్మెల్సీగా తన మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని సీనియర్ జర్నలిస్టులు, వివిధ పత్రికల ప్రతినిధులు మరియు ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమం పోస్టర్ ను విడుదల చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

- **గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శిలు, మండల స్థాయి అధికారులు అందరూ సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తూ విజయవంతం చేయాలి**
- **ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**







**సిద్దిపేట వెలుతురు 09 మార్చి:**

కోహెడ రైతువేదికలో జిల్లా కలెక్టర్ కే. హైమవతి అధ్యక్షతన జరిగిన కోహెడ మండల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికా కార్యక్రమానికి రాష్ట్ర రవాణా మరియు బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా విచ్చేసి కోహెడ మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శిలకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహన పై మార్గ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు మార్చ్ 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మండల స్థాయిలో వికేంద్రీకరిస్తూ, గ్రామస్థాయిలో కేంద్రీకరిస్తూ రూపొందించడం జరిగిందని అన్నారు. గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శిలు, మండల స్థాయి అధికారులు అందరూ సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తూ విజయవంతం చేయాలనీ అన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ,, జిల్లా మరియు రాష్ట్రస్థాయిలలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. పరిసరాల పరిశుభ్రత పైళ్ళ క్లియరెన్స్, ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు, సురక్షితంగా చేరుకోండి, సంక్షేమ కార్యక్రమాలు, పిల్లల భద్రత, డ్రగ్స్ కు నో, వ్యవసాయ సంబంధ కార్యక్రమాలు, విద్యాసంబంధ కార్యక్రమాలు, యువత, క్రీడలు, మహిళల అభివృద్ధి, సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ ఈ ప్రత్యేక పది అంశాలతో పాటుగా 99 రోజుల కార్యాచరణ పకడ్బందీగా అమలు చేసి ప్రజలకు మేలు చేయాలని అన్నారు. అధికాలు నూతనంగా ఎంపికైన గ్రామ పంచాయతీ పాలకవర్గంతో సమన్వయము చేసుకుంటూ భాద్యతగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు సమర్థవంతంగా అందేలా విధులు నిర్వహించాలని అన్నారు. ముఖ్యంగా ప్రజలకు త్రాగునీరు అందించాల్సిన భాద్యత ప్రభుత్వానిది. వేసవికాలంలో గ్రామాల్లో త్రాగునీరు సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, సర్పంచులు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు అన్ని త్రాగునీటి వనరులను పరిశీలించి అవసరమైన ముందస్తు ఏర్పాట్లను చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమం ద్వారా మంజూరై వివిధ నిర్మాణ స్థాయిలలో ఉన్నా ఇండ్ల నిర్మాణంపైప్రత్యేక శ్రద్ధ తీసుకొని అన్ని త్వరగా నిర్మాణం పూర్తయి గృహప్రవేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని గృహాల నిర్మాణం పూర్తైతే మళ్ళీ కొత్తగా ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు నెంబర్ ఇచ్చి విధ్యుత్ సరఫరా అందించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు, ప్రభుత్వ నిర్మాణాలకు ఇసుక కొరత రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని 7మండలాల ప్రజలకు వైద్య సేవల కోసం ప్రభుత్వంచే ప్రత్యేక జీవో తీసుకువచ్చానని ప్రైవేటు సురభి, ఆర్విఎం మెడికల్ కళాశాలలు, సిద్దిపేట ప్రభుత్వం మెడికల్ కళాశాల తదితర 7 వైద్య కళాశాలాలచే ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు పీహెచ్సీల ద్వారా గ్రామాల వారిగా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించాలని, అవసరమైన వారిని ఆయా మెడికల్ కళాశాలకు తీసుకువెళ్లి వైద్య సేవలు అందించాలని అన్నారు. కోహెడ మండలంలో ఆర్విఎం ప్రైవేట్ వైద్య కళాశాల ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపుల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యసేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్న వారందరూ మంచిగా చదువుకోవడం వలననే ఆ స్థాయికి ఎదిగారని, గ్రామాలలో బడిఈడూ పిల్లలెవరు బడి బయట ఉండకుండా ప్రభుత్వ బడులలో చేర్పించాలని, సర్పంచులు, వార్డు సభ్యులు, విద్యాశాఖ అధికారులు, హెచ్ఎంలు ప్రభుత్వ పాఠశాలలో ఎన్రోల్మెంట్ పెంచాలని అన్నారు. అత్యధిక విద్యార్థుల ఎన్రోల్మెంట్ జరిగే ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులను పెంపోందిస్తామని తెలిపారు. విద్యార్థులను చేర్పించి ప్రైవేటు పాఠశాలల బస్సులు రాని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక సూపిస్తానన్నారు. విద్యతో పాటు క్రీడలలో విద్యార్థులను ప్రోత్సహించాలని, క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల బారిన యువత పడకుండా ప్రజా ప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా కృషి చేయాలన్నారు. సాయిల్ టెస్ట్ చేయించుకొని పంట మార్పిడి చేస్తే అధిక దిగుబడులను సాధించవచ్చు అని వరికి ప్రత్యామ్నాయంగా ఉద్యానవన పంటలు ముఖ్యంగా ఆయిల్ ఫామ్ పంటలలో రైతులను ప్రోత్సహించాలన్నారు. పాడి పరిశ్రమ ద్వారా రైతులు లబ్ధిపొందెలా చూడాలని అన్నారు. మహిళల అభివృద్ధికి ఆర్టీసీ ఉచిత ప్రయాణం, బ్యాంకు లింకేజీ రుణాలు, ఇందిరా మహిళా శక్తి తదితర కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అవి మహిళలకు సమర్థవంతంగా అందేలా చూడాలని అన్నారు. పాత ఇజిఎస్ పేమెంట్స్ వెంటనే అందించాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణ అతిముఖ్యమైనదని, ప్రజల ఆరోగ్యాన్నిహరించే ప్లాస్టిక్ బదులుగా 13 ఐటమ్స్ తో కూడిన స్టీల్ బ్యాంకులను అన్ని స్వయం సహాయ సంఘాలకు అందించడం జరిగిందని వాటిని కచ్చితంగా ఉపయోగించేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు పర్యవేక్షించాలని, ప్లాస్టిక్ నిషేదాం పై తీర్మానం చేసుకొని ప్లాస్టిక్ ను ఉపయోగిస్తే ఫైన్ వెయ్యాలని అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం చాలా దోహదం చేస్తుందని, నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు మెంబర్లకు ఇది చక్కని అవకాశమని, ఈ అంశం పై ఈ నెల 12 వ తేదీనా సిద్దిపేట జిల్లా కేంద్రంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆ కార్యక్రమానికి హాజరై అవగాహన పెంచుకోవాలని అన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎక్కువ ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేసుకుని గృహప్రవేశాలు చేసుకుంటే గృహప్రవేశాలకు వస్తానన్నారు. ఈ సందర్భంగా జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమం పోస్టర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ మూసివేత..

**- భారంగా మారుతున్న ఆయిల్**




**న్యూఢిల్లీ, మార్చి9( వెలుతురు):**

ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం రోజు రోజుకూ తీవ్రం అవుతోంది. అందరూ ఊహించినట్లుగానే యుద్ధం ప్రారంభం అయిన వెంటనే ఇరాన్ ఆర్మూజ్ జలసంధి మూసివేసింది. ఇక యుద్ధం ప్రారంభమైన తర్వాత ఎవరూ ఊహించని విధంగా ఇరాన్ గల్ఫ్ దేశాలపై దాడి చేపట్టింది. ఈ పరిణామాలు ఆయిల్ సంక్షోభానికి దారితీస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తున్నాయి. షేర్ మార్కెట్లను కుంగదీస్తున్నాయి.ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ బలగాలు మోహరించిన ఈ సంకీర్ణ జలమార్గం ప్రపంచ చమురు రవాణాలో 20% భాగస్వామి. రోజుకు 20 మిలియన్ బ్యారెళ్లు, సంవత్సరానికి 500 బిలియన్ డాలర్ల విలువైన వాణిజ్యం ఆగిపోయింది. వెడల్పు కేవలం 32 కిమీతో పరిమితమైన సంధి ఇప్పుడు ప్రమాదకర ప్రాంతంగా మారింది.యుద్ధం తర్వాత ఇరాన్ గల్ఫ్ దేశాలపై దాడి చేసింది. మొదట ఖతార్‌ను టార్గెట్ చేసింది. ఆ దేశంలోని రాస్ లఫాన్ పారిశ్రామిక కేంద్రంపై ఇరాన్ క్షిపణి దాడి చేయడంతో ఖతార్ గ్యాస్, చమురు కార్ఖానాలను నిలిపివేసింది. ప్రపంచ ఎల్ఎన్‌జీ సరఫరాలో 20% ఈ దేశం బాధ్యత వహిస్తుంది. ఆసియా మార్కెట్‌లకు 82% ప్రభావం. దీంతో ఇంధన ధరలు ఐరోపాలో 54%, ఆసియాలో 39% ్యపెరిగాయి.ఖతార్ నుంచి 42% ఇంధనం భారత్‌కు సరఫరా అవుతుంది. అయితే భారత్ 5 వారాల నిల్వలతో తాత్కాలిక ఊపిరి పీల్చుకుంటోంది. శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి పొరుగు దేశాలు తీవ్ర ఇబ్బందుల్లో పడుతున్నాయి. చైనాకు కూడా భారీ నష్టం. దీర్ఘకాలంలో ఇంధన ధరలు, దిగుమతి ఖర్చులు పెరిగి ఆర్థిక ఒత్తిడి తీవ్రమవుతుంది.సరుకు పడవలు, ఓడలు ఆగిపోవడంతో అంతర్జాతీయ వాణిజ్యం దెబ్బతింది. స్టాక్ మార్కెట్లలో క్షీణత, ఎనర్జీ రంగాల్లో అస్థిరత పెరిగాయి. ఇరాన్ వ్యూహం ప్రపంచ దేశాలను అమెరికా వ్యతిరేక ఒత్తిడికి దోహదపడుతోందిఈ సంక్షోభం ఆయిల్ ధరలను రెట్టింపు చేస్తూ ద్రవ్యోల్బణాన్ని రేకెత్తించవచ్చు. గల్ఫ్ మిత్రదేశాల ఉత్పత్తి పునరుద్ధరణకు వారాలు పట్టవచ్చు; ఇది పర్యటక, ఉత్పాదక రంగాలను ప్రభావితం చేస్తుంది. భారత్ వంటి దేశాలు వైవిధ్యీకరణ ప్రణాళికలను వేగవంతం చేయాలి.

## దానం పై వేటు... పక్కా ?



**హైదరబాద్, మార్చి9( వెలుతురు):**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటీషన్ పై విచారణ ముగిసింది. స్పీకర్ గడ్డం ప్రసాదరావు తీర్పును రిజర్వ్ చేశారు. ఈరోజుతో అనర్హత ఎమ్మెల్యేల పిటీషన్లపై విచారణ ముగిసింది. మొత్తం పది మంది ఎమ్మెల్యేలు తమ పార్టీ నుంచి కాంగ్రెస్ లోకి మారినట్లు బీఆర్ఎస్ వారిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.ఇప్పటి వరకూ ఎనిమిది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు ఆధారాలు లేవని స్పీకర్ గడ్డం ప్రసాదరావు తీర్పు చెప్పారు. ఇక కడియం శ్రీహరి, దానం నాగేందర్ విషయంలోనే తీర్పు చెప్పాల్సి ఉంది. అయితే కడియం శ్రీహరి విషయంలో ఏమో గాని దానం నాగేందర్ పై మాత్రం ఖచ్చితంగా అనర్హత వేటు పడే అవకాశాలున్నాయని చెబుతున్నారు.దానం నాగేందర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా అందుకు సిద్ధమయినట్లే సమాచారం. సుప్రీంకోర్టులో కేసు ఉన్నందున దానం నాగేందర్ విషయంలో అనర్హత వేటు పడటం ఖాయమన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తుంది. సాంకేతికంగా ఆధారాలుండటం వల్లనే దానం నాగేందర్ అనర్హత వేటు నుంచి తప్పించుకోలేరని న్యాయ నిపుణులు కూడా చెబుతున్నారు. 2023 లో జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో గెలిచిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తర్వాత కాంగ్రెస్ పార్టీకి మద్దతుదారుగా నిలిచారు. అయితే మిగిలిన ఎమ్మెల్యేలు కూడా కండువాలు కప్పుకున్నప్పటికీ వారికి కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం మాత్రం ఇవ్వలేదు. దానం నాగేందర్ విషయం మాత్రం డిఫరెంట్.ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాత్రం బీఆర్ఎస్ గుర్తుపై ఎమ్మెల్యే ఎన్నికల్లో గెలిచి 2024 లోజరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీంతో దానం నాగేందర్ సాంకేతికంగా కాంగ్రెస్ లో చేరినట్లేనని న్యాయనిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు. అందుకే తొలి నుంచి దానం నాగేందర్ ఒక్కరిపై వేటు పడే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతుంది. మరొకవైపు ఇప్పటికే హైదరాబాద్ నగరంలో కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన నేపథ్యంలో ఖైరతాబాద్ కు కూడా ఉప ఎన్నికలు జరిగే అవకాశం ఉందని మాత్రం రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతుంది. అయితే అనర్హత వేటుపడినా ఆరునెలల్లో ఉప ఎన్నిక జరగాల్సి ఉంటుంది. అయితే స్పీకర్ నిర్ణయం ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది


## నకిలీ మందుల విక్రయంపై కఠిన చర్యలు

**- మెడికల్ షాపులకు డిసిఎ ఎస్ఎంఎస్ అలర్ట్**

**హైదరాబాద్, మార్చి9( వెలుతురు):**

నాణ్యతలేని మందుల విక్రయాన్ని అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీసీఏ ఆధ్వర్యంలో బల్క్ ఎస్ఎంఎస్ అలర్ట్ సిస్టమ్‌ను ప్రారంభించారు. ఈ వ్యవస్థ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెడికల్ షాపులకు వెంటనే సమాచారం అందించేలా చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా నాణ్యతలేని, అనుమానాస్పద మందులు గుర్తించిన వెంటనే అన్ని మెడికల్ షాపులకు ఎస్ఎంఎస్ ద్వారా అలర్ట్ పంపిస్తున్నారు. దీంతో ఆ మందుల విక్రయాన్ని వెంటనే నిలిపివేయాలని మెడికల్ షాపులకు సూచనలు అందుతాయి. ప్రజలకు హానికరంగా మారే మందులు మార్కెట్‌లో అమ్మకుండా ముందుగానే అడ్డుకోవడమే ఈ వ్యవస్థ ప్రధాన లక్ష్యం. నాణ్యతలేని మందులు అమ్మడం వల్ల రోగుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ఈ చర్యలను చేపట్టింది. ఈ కొత్త వ్యవస్థకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెడికల్ షాపులను ప్రభుత్వం అనుసంధానం చేస్తోంది. ఒకసారి అలర్ట్ జారీ అయిన వెంటనే ప్రతి ఫార్మసీకి సమాచారం చేరేలా డిజిటల్ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. ఔషధాల నాణ్యత, పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు డిజిటల్ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆధునిక వ్యవస్థలను ప్రవేశపెట్టి మందుల నియంత్రణను మరింత కట్టుదిట్టం చేసేలా డీసీఏ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

# మనం మరచిపోతున్న ఉగాది



**వి.మధుసూదనరావు.**

మనం ప్రతి ఏటా ఉగాది పండగను చేసుకుంటాం కదా. 'ఎందుకు చేసుకోవాలి?' అని కొందరు అడగవచ్చు. వాళ్లకు సందేహం రావడం సహజమే. దానికి సమాధానం చెప్పాలి.కాబట్టి ఉగాది పండగ ప్రాముఖ్యత,దాని పుట్టుక గురించి తెలుసుకుందాం.

### ఉగాది అంటే కాల గమనం, కాల గణనం

ప్రతి ఏటా ఉగాది పండగతోనే తెలుగువారికి కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. కానీ రాను రాను ఉగాదికి ప్రాధాన్యం తగ్గుతుందేమో అనిపిస్తోంది. మారుతున్న కాలం, జీవన వేగం ఇందుకు కారణాలు.కాలంతో మనం పరుగులు తీస్తున్నాం. కానీ ఉగాదిని మరచిపోతున్నాం. నిజానికి ఉగాది కాలానికి సంబంధించిన పండగ. మన ఆచారాల ప్రకారం ఉగాదితోనే కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. మన సౌకర్యం కోసం కాలగమనాన్ని సంవత్సరాలుగా విభజించుకున్నాం. మన లెక్క ప్రకారం ఉగాదికి ముందు రోజు ఒక సంవత్సరం పూర్తవుతుంది.

### కాల'మహిమ'

'అంతా కాలమహిమ' అని అంటుంటాంకదా.ఎందుకంటే మన జీవితం అంతా కాలంతోనే ముడిపడి ఉంది కాబట్టే అలా అంటాం. పుట్టినప్పటి నుంచి కాల ప్రమేయం లేని సందర్భం లేదనే చెప్పాలి. మనం ఏపని చేసినా టైం ప్రకారం చేయాలి. లేకుంటే అవాంతరాలు వచ్చి ఆ పని కాకపోవచ్చు. ఎక్కడికి వెళ్లాలన్నా సమయానికి చేరుకోవాలి. లేకుంటే మనం కలుసుకోవాల్సిన వాళ్లు వెళ్లిపోవచ్చు. మనం ఆలస్యమైతే వాళ్లు దొరక్కపోవచ్చు. ఆఫీసులో విధి నిర్వహణకూ సమయపాలన ఉంటుంది. ఫలానా పని ఫలానా సమయంలోగా పూర్తి చేయాలనే సమయ నియమం ఉంటుంది. అలస్యంగా వెడితే ఇంటర్వ్యూ మిస్ అవుతాం. ప్రయాణాలప్పుడు రైలుకో, బస్సుకో, విమానానికో వెళ్లాల్సినప్పుడు టైంను ఖచ్చితంగా పాటించాలి. సమయపాలన చాలా ముఖ్యం. ఆలస్యమైతేడ ఆ రైలో, బస్సో వెళ్లిపోతాయి. పిల్లల్ని కాస్త ఆలస్యంగా స్కూల్ కు తీసుకెడితే లోపలికి రానివ్వరు. ఆలస్యమైతే పరీక్ష రాయనివ్వరు. అంతెందుకు? మనం జరుపుకొనే పండగలు, ఉత్సవాలు, పుట్టిన రోజులు, పెళ్లి ముహూర్తం కూడా కాలంతో ముడిపడి ఉన్నవే.

### కాలం ప్రాధాన్యం

ఇలా మన జీవితంలో ప్రతి దశలోనూ కాలానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. కాలంతోపాటు మనం నడవాలి. లేకుంటే వెనకబడతాం. మనల్ని ఎవరూ చూడరు.పట్టించుకోరు. ఒకవిధంగా పనికిరానివాళ్లమై పోతాం. కాలగమనంలో కాల గణన ఇంత ముఖ్యమైంది. అసలీ కాలం ఎప్పుడు మొదలైంది? ఎలా సాగుతోంది? అని ఆలోచిస్తే ఒ ఫ్లాష్ బ్యాక్ లోకి వెళ్లక తప్పదు. అప్పుడే దాని ప్రాధాన్యం అర్థమవుతుంది.ఎప్పుడో కొన్ని లక్షల సంవత్సరాల కిందటే కాలాన్ని లెక్కించడం మొదలైంది అంటారు. అప్పుడే కాల ప్రమాణాన్ని ఏర్పరుచుకోవడమూ జరిగింది. కాల గణన తర్వాతనే మన పండగలూ, ఆచారాలూ వచ్చాయి.

### ఉగాది ఎలా పుట్టింది?

ఇది కాలానికి సంబంధించిన పండగ కాబట్టి కాలానుగుణంగానే ఇది పుట్టింది. కాల గణన కూడా అలాగే జరిగింది. చాలా ఏళ్ల కిందట కాలాన్ని గుర్తించారు. చంద్రుని వృద్ధి క్షయాలతో కాలమనేది ఉందని మనకు తెలిసింది. మనం ఒక నెలను మాసం అంటాం. 'మాస' అంటే చంద్రుడు ఉన్నాడు అని అర్థం. చంద్రుని వృద్ధి క్షయాలనే మాసం అన్నాం. వేద విధులు ఆచరించేందుకు మనం చాంద్రమానాన్నే ప్రామాణికంగా తీసుకుంటున్నాం. చంద్రుడు ఒక్కో నెలలో ఒక్కో నక్షత్రం దగ్గర ఉంటాడు. ఉదాహరణకు చంద్రుడు ఆషాఢ నక్షత్రం దగ్గర ఉంటే ఆ నెల ఆషాఢం.

### బుూతువుల విభజన

కాలంలో రుతువులు కూడా ఉన్నాయి. బుూతు విభజన ఎప్పుడు జరిగిందన్న దానిపై రకరకాల అభిప్రాయాలున్నాయి. అయితే, ప్రకృతిలో జరిగే మార్పుల్ని బట్టే సంవత్సరాన్ని ఆరు బుూతువులుగా విభజించుకొన్నాం. సంవత్సరమంతా కష్టపడిన రైతుకు నిండుగా పంట చేతికి రాగానే ఎంతో ఆనందంగా ఉంటుంది. ఆ ఆనందాన్ని పండగ రూపంలో పంచుకొంటాడు.

### సంక్రాంతే ఉగాది

పంటకారుకు, పంటకారుకు మధ్య ఉన్న కాలాన్ని ఏడాదిగానూ, మొదటి పంటకారునుడ అంటే పంట చేతికి వచ్చిన రోజును సంవత్సరాదిగానూ మొదట లెక్కించడం జరిగింది.తర్వాత అదొక ఆచారంగా, అలవాటుగా మారింది. పంట చేతికొచ్చే పుష్య, మాఘ మాసాల్లోనే మకర సంక్రాంతి వస్తుంది. ఈ సంక్రాంతిని ఉత్తరాయణ పుణ్యకాలమని, విషువత్ పుణ్య కాలమని అంటారు. విషువత్ అంటే పగలు, రాత్రి సమానంగా ఉండే రోజు. సూర్యుడు భూమధ్య రేఖపైన ఉండే కాలం. ఇలాంటి విషువత్తులు సంవత్సరానికి రెండుసార్లు వస్తాయి. మకర సంక్రాంతి ఆ రెండింటిలో ఒకటి. ఆరోజు నుంచి ప్రకృతిలో మార్పులు ప్రారంభమవుతాయి. కాబట్టి మొదట్లోడ సంక్రాంతినే ఉగాది అనుకున్నారు.

### జనవరి 1 వారికి ఉగాది

పాశ్చాత్యులు కూడా కొద్ది తేడాతో మన సంక్రాంతినే నూతన వత్సరంగా పరిగణిస్తున్నారు. వాళ్లకు జనవరి ఒకటో తేదీతో కొత్త సంవత్సరం ఆరంభమవుతుంది. అయితే ఒ 'జనవరితోనే నూతన సంవత్సరం ఎందుకు ప్రారంభం కావాలి?' అని రోమన్ కవి దేవిడ్ జ్యోతిష శాస్త్రకారుడు జాన్స్ ను అడిగాడు. జనవరి నాటికి సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. అంతవరకూ పడుతున్న మంచు క్రమంగా తొలగిపోతుంది. ప్రజలకు ప్రకృతిపరంగా కొత్త జీవితం మొదలవుతుంది. కాబట్టి జనవరి నుంచే ప్రారంభమవుతుందని చెప్పాడు.

### రామాయణ కాలంలో

రామాయణ కాలంలో వైశాఖం ఉగాది. ఇక మార్వాడీలు దీపావళినే ఉగాదిగా, కొత్త సంవత్సరంగా గుర్తించి ధనలక్ష్మి పూజ చేస్తున్నారు. బౌద్ధులు మాఘ మాసంలో అష్టక వ్రతంతో సంవత్సరాన్ని ఆరంభిస్తారు. కొందరు కార్తులను బట్టి బుూతు నిర్ణయం చేస్తారు. వాళ్ల ఆచారం ప్రకారం ధనిష్టా కార్తె ఉగాది. రామాయణ కాలంలో వైశాఖ, జ్యేష్ఠ మాసాల మధ్య ఉన్న వసంత విషువత్తు మహాభారత కాలానికి చైత్ర వైశాఖ మాసాలకు కదిలింది. దాంతో పాటే ఉగాది కూడా. ఈ విషయంలో చరిత్రకారులు, పండితుల మధ్య వాదోపవాదాలు కూడా ఉన్నాయి. వాళ్లు ప్రాచీన తత్వవేత్తలు చెప్పిన దాన్ని ప్రమాణంగా తీసుకున్నారు. మరికొంతమందికి వసంత పంచమి ఉగాది.

### సంవత్సరాది ఎందుకు మారింది?

ఉగాది ఇలా నెలలు మారడానికి కారణమేమిటి? శతపథ బ్రాహ్మణాల ప్రకారం ఏడాది కాలాన్ని నాలుగు నెలలున్న మూడు బుూతువులుగా మొదట విభజించడం జరిగింది. ఒక్కొక్క బుూతువు ఆరంభంలోనూ కొన్ని వైదిక కర్మలూ, ఉత్సవాలూ చేసేవారు. వాళ్ల వాళ్ల ఆచారం ప్రకారం ఒక్కొక్కరూ ఒక్కో బుూతు ప్రారంభాన్ని ఉగాదిగా లెక్కించారు. దీనివల్ల హెచ్చుతగ్గులు వచ్చాయి. ఇంక ఇలా లాభం లేదని సూర్యాచారాన్ని, తక్కిన గ్రహచారాలనూ.. అంటే గ్రహాల ప్రయాణాన్ని ఆధారంగా తీసుకొన్నారు. సూర్యుడు విషువత్తులో ప్రవేశించిన రోజు నుంచి లెక్కకట్టి రాశుల్ని విభజించడం జరిగింది. ఇలా సౌరమానం ప్రారంభమైంది. సూర్యుడు ఒక రాశి నుంచి వేరొక రాశికి చేరడానికి సుమారు 30--31 రోజులు పడుతుంది. దాంతో చాంద్రమానానికి, సౌరమానానికీ క్రమంగా నెల తేడా రావడం మొదలైంది. చాంద్రమానంలో ప్రతి పందొమ్మిది సంవత్సరాలకూ ఏడు నెలలు అదనంగా చేర్చి లెక్క సరిచేశారు. కాబట్టి ప్రతి మూడు సంవత్సరాలకూ



చాంద్రమానంలో ఒక అధికమాసం వస్తూంటుంది. ఖగోళశాస్త్రవేత్త భాస్కరాచార్యుడు తన సిద్ధాంత శిరోమణి గ్రంథంలో సూర్యుడు చైత్రమాస శుక్లపక్ష పాడ్యమినాడు లంకా నగరాన ఉదయించడం వల్ల, లంక భూమధ్య రేఖమీద ఉన్నందునడ ఆ రోజే ఉగాది అని లెక్కలు కట్టి చెప్పాడు. ఆరోజు దిన, మాస, వర్షారంభాలు ఒకేసారి ఆరంభం అవుతాయని రాశాడు.

### యుగం అంటే

ఉగాది అనే మాట 'యుగాది'కి వికృతి. యుగం అంటే ఒక కాల విభాగం. దాని ఆది 'యుగాది'. అదే క్రమేణా 'ఉగాది' అయింది. యుగాదులలోనూ, మన్వాదులలోనూ పితృకర్మలు, వ్రతాలు చేయడం పూర్వపు ఆచారం. కొన్నిచోట్ల నవరాత్రాలు చేస్తారు. ఉదయాన్నే లేచి, తలస్నానం చేసి, మరేమీ తినకుండా ఉగాది పచ్చడి తినడం మన ఆచారం.

### ప్రకృతిలో మార్పులు

ఉగాది నుంచే ప్రకృతిలో మార్పులు మొదలవుతాయి. ఉదాహరణకు వేపచెట్టు ఏడాది అంతా మామూలుగా ఉంటుంది. ఉగాదికి కొన్ని రోజుల ముందు నుంచీ పూత పూయడం ఆరంభమవుతుంది. పిందెలు వేస్తుంది. కాయలు, పళ్లు తయారవుతాయి. మిగతా ప్రకృతి అంతా శోభాయమానమవుతుంది. ఉగాది రోజు చంద్రోత్సవం జరిపించాలని మహాభారతంలో ఉంది. చాంద్రమానానికి సంబంధించిన పండగ కాబట్టి చంద్రోత్సవం జరిపిస్తారు.

### చాంద్రమానం ప్రమాణం

చాంద్రమానం అతి ప్రాచీన ధర్మశాస్త్రం. ఇతర ధర్మశాస్త్రాలకు ప్రామాణికం. వర్షాదిలో (సంవత్సరం ప్రారంభం) దానికే ప్రాధాన్యం ఉంది. కాబట్టి కర్మలకు కూడా దానినే ప్రామాణికంగా తీసుకోవాలి. ముస్లింలు, పార్శీలు, ఆర్యులు కూడా చాంద్రమానాన్నే పాటిస్తున్నారు. వారి సంవత్సరాదులు కూడా మన ఉగాది దరిదాపుల్లోనే వస్తున్నాయి.ఎంతో ప్రామాణికం, ప్రాధాన్యం ఉన్న ఉగాదిని ఒకప్పుడు వైభవంగా చేసేవారు. ఆచారాలు, సంప్రదాయాలు పాటించేవారు. ఇప్పుడా ప్రాముఖ్యత, ఆసక్తి క్రమంగా తగ్గుతున్నాయి.ఇప్పుడు ఉగాదిని ఏదో మొక్కుబడిగా చేస్తున్నాం. అలా కాకుండా ఉగాది పండగను మనస్ఫూర్తిగా చేసుకుందాం.

## అమెరికా, ఇజ్రాయెల్‌తో మోదీ రాజీపడ్డారు

పశ్చిమాసియాలో పరిస్థితులు దేశ ప్రజలపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని తెలిపారు. అలాగే అక్కడి సంక్షోభం చమురు ధరల పెరుగుదలకు దారితీయవచ్చని అభిప్రాయపడ్డారు. "పశ్చిమాసియా సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద నష్టాన్ని కలిగిస్తుంది. స్టాక్ మార్కెట్లలో ఏం జరుగుతుందో మీరు చూశారు. ప్రధాని మోదీ అమెరికా ట్రేడ్ డీల్‌పై సంతకం చేశారు. దీంతో దేశం దెబ్బ తినబోతోంది. అలాగే పశ్చిమాసియా సంక్షోభం గురించి చర్చించడంలో వారికి ఏ సమస్య ఉంది? ఆ తర్వాత మనం ఇతర అంశాలపై చర్చ జరపవచ్చు. పశ్చిమాసియా మన దేశానికి ముఖ్యం కాదా? ఇంధన ధరలు, ఆర్థిక విధ్వంసం మనకు ముఖ్యమైన చర్చనీయాంశాలు కావా? అవే మనకు ప్రజా సమస్యలు" అని రాహుల్ గాంధీ అన్నారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని తాము ముఖ్యమైనదిగా భావిస్తున్నామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అందుకే ఆ అంశంపై చర్చను కోరుతున్నామని అన్నారు. "కానీ కేంద్ర సర్కార్ పశ్చిమాసియా సంక్షోభం గురించి చర్చ జరిపేందుకు ఇష్టపడడం లేదు. ఎందుకంటే ఆ అంశంపై చర్చ జరిపితే ఇతర విషయాలు బయటకు వస్తాయి. ప్రధాని మోదీ వైఖరి బయటపడుతుంది. మోదీ ఎలా రాజీ పడ్డారు? ఆయనను ఎలా బ్లాక్ మెయిల్ చేస్తున్నారు? వంటి విషయాలు తెలుస్తాయి. అందుకే పార్లమెంట్‌లో పశ్చిమాసియా సంక్షోభంపై చర్చకు కేంద్రం ఇష్టపడడం లేదు. చర్చకు డిమాండ్ చేస్తున్న సమయంలో ప్రధాని మోదీ పార్లమెంట్ నుంచి ఎలా పారిపోయారో మీరు చూశారు. ఒకవేళ పశ్చిమాసియా సంక్షోభంపై చర్చ జరిగితే ప్రధాని మోదీ పార్లమెంట్‌కు రాలేరు" అని రాహుల్ వ్యాఖ్యానించారు. అలాగే వీబీ జీ రామ్ జీ అమలు నేపథ్యంలో కేంద్ర సర్కార్‌పై కాంగ్రెస్ మండిపడింది. ఈ పథకం వివరాలు ఇంకా రూపొందుతున్నాయని, ఇది మోదీ ప్రభుత్వ వేగవంతమైన విధానానికి సరైన ఉదాహరణ అని పేర్కొంది. 'మొదట ప్రకటించండి, తరువాత ఆలోచించండి' అనే విధానాన్ని కేంద్రం అనుసరిస్తోందని మండిపడింది. ఈ మేరకు కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. "2025 డిసెంబరులో కేవలం రెండు రోజుల్లోనే మోదీ ప్రభుత్వం లోక్‌సభ, రాజ్యసభలో ఎంజీనరేగా రద్దును బుల్డోజ్ చేసింది. రాష్ట్రాలతో ఎటువంటి సంప్రదింపులు జరపలేదు. సంబంధిత స్టాండింగ్ కమిటీ ద్వారా ఎటువంటి పరిశీలన జరగలేదు. 2026 ఏప్రిల్ 1నుంచి కొత్త చట్టం అమలు కానుంది. దీని అమలుకు ముందుగా జరగాల్సిన సంప్రదింపులు ఇప్పుడు జరుగుతున్నాయి. వివరాలు ఇంకా రూపొందుతున్నాయి" అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. కాగా, పశ్చిమాసియా ఘర్షణల వేళ



రాజ్యసభలో సోమవారం కీలక ప్రకటన చేశారు కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్. పశ్చిమాసియాలోని పరిణామాలు అందరికీ ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. వాటిపై ఎప్పటికప్పుడు ప్రధాని మోదీ సమీక్ష జరుపుతున్నారని తెలిపారు. అలాంటి పరిస్థితులకు చర్చలు, దౌత్యపరమైన చర్యలే పరిష్కారమని అభిప్రాయపడ్డారు. పశ్చిమాసియా ప్రాంతాల్లో నివసిస్తున్న భారతీయుల సంక్షేమం, భద్రతపై తమ ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. భారత వినియోగదారులపై భారం పడకుండా, చమురు లభ్యత, ధరలను నియంత్రించేందుకు దౌత్య పరంగా కృషి చేస్తున్నట్టు చెప్పారు. అలాగే పశ్చిమాసియాలో చిక్కుకున్న భారతీయులను వెనక్కి రప్పించేందుకు భారత్ అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని అన్నారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న సుమారు కోటి మంది భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టినట్టు వివరించారు. కాగా, పశ్చిమాసియా సంక్షోభం పార్లమెంట్ ఉభయ సభలను సోమవారం కుదిపేసింది. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై చర్చకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు రాజ్యసభ, లోక్‌సభలో నిరసనలు చేపట్టాయి. దీంతో పార్లమెంట్ ఉభయ సభలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తున్నాయని బీజేపీ ఎంపీలు ఆరోపించారు.

# ఉస్తాద్‌కు యుఎస్‌లో భారీ బుకింగ్స్

## గంటల్లోనే 50 వేల డాలర్లకు పైగా కలెక్షన్లు

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న మాస్ చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రం ఇప్పటికే భారీ అంచనాలు సృష్టించింది. ఈ సినిమాలో హీరోయిన్లుగా శ్రీలీల, రాశీ ఖన్నా నటిస్తున్నారు. విడుదలకు ముందే ఈ సినిమా పలు రికార్డులను సృష్టించేలా దూసుకెళ్తోంది. ఇటీవల ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా ఈ సినిమాకు మంచి డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా అమెరికాలోని నార్త్ అమెరికా ప్రాంతంలో 'ఉస్తాద్ భగత్ సింగ్'కు మంచి స్పందన లభిస్తోంది. ఇప్పటికే అక్కడ ప్రీమియర్ షోల బుకింగ్స్ ప్రారంభం కాగా, కొన్ని గంటల్లోనే ఈ సినిమా 50 వేల డాలర్లకు పైగా గ్రాస్ వసూలు చేయడం విశేషం. ఇది కేవలం ప్రారంభం మాత్రమే అని సినీ వర్గాలు భావిస్తున్నాయి. పవన్ కళ్యాణ్‌కు విదేశాల్లో ఉన్న భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ దృష్ట్యా, రాబోయే రోజుల్లో బుకింగ్స్ మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా సినిమా కంటెంట్ బలంగా ఉంటే, నార్త్ అమెరికా మార్కెట్‌లో భారీ వసూళ్లు సాధించే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకులు దేవి శ్రీ ప్రసాద్, థమన్ సంగీతం అందిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ? హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమా పై అభిమానుల్లో ఇప్పటికే భారీ క్రేజ్ నెలకొంది. మాస్ యాక్షన్ ఎంట్టంల్ల÷నర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. విడుదలకు ముందే ఓవర్సీస్‌లో మంచి బిజినెస్ సాధించడంతో, బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఓజీ చిత్రం తర్వాత పవన్ కళ్యాణ్ నుండి వస్తున్న ఈ సినిమా ప్రభంజనాలు సృష్టించడం ఖాయం అని అంటున్నారు.






# త్రిషకు పార్తీబన్ క్షమాపణలు

ఇటీవల చెన్నైలో జరిగిన ఓ ఈవెంట్‌లో త్రిషను ఉద్దేశించి నటుడు, దర్శకుడు పార్తిబన్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. దీనిపై త్రిష కూడా పరోక్షంగా స్పందించడంతో ఆయన మరో పోస్ట్ పెట్టారు. ఈ విషయంలో జరిగినదంతా తప్పుగా భావించారు. ఇప్పుడు నాకు పశ్చాత్తాపపడటం తప్ప మరో మార్గం లేదఅని తన పోస్ట్‌లో రాశారు. దీంతో ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పడినట్లు అయింది. అసలేం జరిగిందంటే.. గత కొన్ని రోజులుగా త్రిష ప్రేమకు సంబంధించిన రూమర్స్ వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె కోలీవుడ్ అగ్ర కథానాయకుడు విజయ్‌తో కలిసి ఓ వివాహ వేడుకకు హాజరుకావడం ఆ వార్తలకు మరింత బలం చేకూరింది. ఓ ఈవెంట్‌లో త్రిష గురించి పార్తిబన్ మాట్లాడుతూ.. ఆమె కొన్ని రోజులు ఇంట్లోనే ఉండటం మంచిది. ఎందుకంటే ఆమె బయటకు వస్తే ఎక్కడ లేని సమస్యలు వస్తున్నాయని అన్నారు. ఈ వ్యాఖ్యలపై త్రిష పరోక్షంగా స్పందించారు. 'చేతిలో మైక్ ఉంది కదా అని మాట్లాడితే కామెడీ అవ్వదు. అది కేవలం మూర్ఖత్వమే' అని పోస్ట్ పెట్టారు.



# సూపర్ మ్యాన్ తరహా స్టోరీతో అల్లు అర్జున్

అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ – మలయాళ దర్శకుడు బసిల్ జోసెఫ్ కలయికలో సినిమా ఎప్పట్నుంచో ప్రచారంలో ఉంది. సూపర్‌మ్యాన్ తరహా కథతో సినిమా తెరకెక్కే అవకాశం ఉన్నట్టు కూడా పరిశ్రమలో చర్చ సాగింది. అయితే అల్లు అర్జున్ వరుసగా తమిళ దర్శకుడు అట్లీ, లోకేశ్ కనగరాజ్‌లతో సినిమాలకు పచ్చజెండా ఊపడంతో, బసిల్ జోసెఫ్‌తో సినిమా గురించి చర్చకు బ్రేక్ పడింది. ఇటీవల జరిగిన అల్లు శిరీష్ పెళ్లి వేడుకకు బసిల్ జోసెఫ్ హాజరు కావడంతో మరోసారి ఆయన, అల్లు అర్జున్ కలయికలో సినిమా తెరపైకొచ్చింది. ఇద్దరూ కలిసి సినిమా చేయడం ఖాయమనే సంకేతాలు వచ్చినట్లైంది. బసిల్ జోసెఫ్ మలయాళంలో కథానాయకుడిగా నటిస్తూనే, దర్శకుడిగా పలు విజయాల్ని అందుకున్నారు.




# సూర్య కరుప్పు సినిమాపై కొత్త వివాదం.. దర్శకుడు హీరోపై కేసు వేయబోతున్నాడా?

తమిళ స్టార్ హీరో సూర్య నటిస్తున్న తాజా చిత్రం కరుప్పు చుట్టూ కొత్త వివాదం చెలరేగింది. ఈ సినిమాను దర్శకుడు ఆర్జే బాలాజీ తెరకెక్కిస్తుండగా, ప్రస్తుతం సినిమా విడుదలకు ముందే కొన్ని వివాదాస్పద వార్తలు బయటకు రావడంతో తమిళ సినీ పరిశ్రమలో ఇది హాట్ టాపిక్‌గా మారింది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాలో సూర్య ప్రధాన పాత్రలో నటిస్తున్నారు.

# చిత్ర పరిశ్రమలో ట్రోల్స్ పెద్ద పదం

## ఇప్పుడిప్పుడే అలవాటు పడుతున్నా

విమర్శల నుంచి నేను చాలా నేర్చుకున్నానంటోంది హీరోయిన్ ప్రియాంక అరుళ్ మోహన్. 'మేడ్ ఇన్ కొరియా' సినిమాతో త్వరలోనే వీక్షకులందరికీ కొరియా సంస్కృతిని పరిచయం చేసే తమిళ అమ్మాయిగా ఓటీటీలో సందడి చేయనుంది. ఈ సందర్భంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె సామాజిక మాధ్యమాల్లో తనపై వస్తున్న ట్రోల్స్ గురించి స్పందించింది. 'సోషల్ మీడియాలో 'ట్రోల్స్' అనేది చాలా పెద్ద పదం. గతం గురించి ఆలోచించడం నాకు ఇష్టం లేదు. కానీ, ఇది చిత్రపరిశ్రమ. అనిశ్చితమైన పరిస్థితులు ఎదురవుతాయి. ఇక్కడ ఎవరికైనా ఏదైనా జరగొచ్చు. నేను దాని నుంచే చాలా నేర్చుకున్నాను. సహజంగానే ట్రోల్స్ బాధించినా ఎదగడానికి తోడ్పడతాయి. కొన్నిసార్లు మీరు పడిపోతేనే పైకి రావడానికి అలాంటివి సహాయపడతాయి. నేను ఇలాంటి ప్రతికూల పరిస్థితులను సానుకూలంగా మార్చుకుంటూ కెరీర్‌ని ముందుకు తీసుకెళ్లాలనుకుంను' అని చెప్పింది. గతంలో ప్రియాంక తనపై కొందరు ఉద్దేశపూర్వకంగానే ట్రోల్స్ చేస్తున్నట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే.



భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఇప్పటికే షూటింగ్ దశను పూర్తిచేసుకున్నట్లు సమాచారం. అయితే సినిమా విడుదలకు సంబంధించిన అంశాల్లో ఆలస్యం జరుగుతుండటంతో దర్శకుడు మరియు నిర్మాతల మధ్య విభేదాలు తలెత్తినట్లు వార్తలు వస్తున్నాయి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సమాచారం ప్రకారం, దర్శకుడు ఆర్జే బాలాజీ సినిమా నిర్మాత , హీరోపై కేసు వేయడానికి సిద్ధమవుతున్నాడని ప్రచారం జరుగుతోంది. సినిమా పూర్తయినా కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల కావాలనే విడుదలను ఆలస్యం చేస్తున్నారని దర్శకుడు అసంతృప్తిగా ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అంతేకాకుండా పారితోషకం విషయంలో కూడా మేకర్స్ మధ్య విభేదాలు తలెత్తినట్లు వార్తలు ప్రచారం అవుతున్నాయి. ఈ కారణాల వల్లే దర్శకుడు చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతున్నాడని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అయితే ఈ వార్తలపై సినిమా నిర్మాతల నుంచి మరో వర్షన్ కూడా వినిపిస్తోంది. సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఈ వార్తలు పూర్తిగా అవాస్తవమని వారు చెబుతున్నట్లు సమాచారం. దర్శకుడు ఆర్జే బాలాజీతో తమకు ఎలాంటి విభేదాలు లేవని, కావాలనే కొందరు ఇలాంటి రూమర్లను సృష్టిస్తున్నారని నిర్మాతలు పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఇక సినిమా విడుదల విషయంలో త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని కూడా సమాచారం. ప్రస్తుతం సినిమా విడుదల తేదీపై చర్చలు జరుగుతున్నాయని, సరైన సమయం చూసుకుని విడుదల చేయాలనే ఆలోచనలో చిత్ర బృందం ఉందని అంటున్నారు. మొత్తం మీద "కరుప్పు" సినిమాపై వచ్చిన ఈ వివాద వార్తలు ఇప్పుడు తమిళ సినీ పరిశ్రమలో చర్చనీయాంశంగా మారాయి. అయితే నిజంగా దర్శకుడు కేసు వేయనున్నాడా? లేక ఇవన్నీ కేవలం రూమర్లేనా? అన్న విషయం అధికారిక ప్రకటన వచ్చిన తర్వాతే స్పష్టత రానుంది.

# చిన్న పిల్లలపై అత్యాచారాలు అరికట్టాల్సిందే

## సరస్వతి సినిమా ప్రమోషన్స్‌లో వరలక్ష్మి శరత్ కుమార్

తెలుగు, తమిళ సినీ పరిశ్రమల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా మంచి గుర్తింపు పొందిన వరలక్ష్మి శరత్ కుమార్ తాజాగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల ఆమె ప్రధాన పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహించిన సరస్వతి సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో చిన్నారులపై జరిగే అత్యాచారాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులు సమాజానికి పెద్ద ప్రమాదంగా మారుతున్నాయని ఆమె అన్నారు. అలాంటి నేరాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 'చిన్న పిల్లలను హరాస్ చేసే వాళ్లను, అత్యాచారం చేసే వాళ్లను అసలు వదిలిపెట్టకూడదు. వాళ్లకు సాధారణంగా మరణశిక్ష ఇవ్వడం సరిపోదు. అలాంటి వాళ్లకు మరింత కఠినమైన శిక్షలు ఉండాలి, కట్ చేసి పడేయాలి' అని వరలక్ష్మి పేర్కొన్నారు. నేను ఎప్పుడైనా ముఖ్యమంత్రి అయితే రేప్ లాంటి నేరాలకు పాల్పడే అబ్బాయిలకు కఠినమైన శిక్ష విధించేలా ప్రత్యేక చట్టం తీసుకువస్తాను. అప్పుడు అలాంటి నేరాలు చేయడానికి కూడా వాళ్లు భయపడతారు. సమాజంలో ఆ భయం రావాలి అని ఆమె అన్నారు. అదే సమయంలో పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు కూడా జాగ్రత్తగా ఉండాలని వరలక్ష్మి సూచించారు. చిన్నారులకు చిన్నప్పటి నుంచే 'గుడ్ టచ్', 'బ్యాడ్ టచ్' గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. పిల్లలకు ధైర్యం ఇవ్వడం, ఏదైనా తప్పు జరిగితే చెప్పేలా వారికి నమ్మకం కల్పించడం ఎంతో ముఖ్యమని ఆమె అభిప్రాయపడ్డారు. ఇక వరలక్ష్మి శరత్‌కుమార్ నటించిన సరస్వతి సినిమా చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడుల నేపథ్యంలో రూపొందిన సామాజిక అంశాలతో కూడిన చిత్రంగా తెరకెక్కింది. ఈ సినిమాతో ఆమె దర్శకురాలిగా కూడా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.




# సల్మాన్‌కు జోడీగా నయనతార

దక్షిణాదిన అగ్రస్థానంలో ఉన్న కథానాయిక ఎవరంటే.. 'నయనతార' అని టక్కున చెప్పేస్తారు. పారితోషికం పరంగా కూడా నయనే నంబర్ వన్. ప్రస్తుతం ఆ భాష, ఈ భాష అని లేకుండా, అన్ని భాషల్లోనూ సినిమాలు చేస్తూ సత్తా చాటుతున్నది నయనతార. మెగాస్టార్‌తో ఆమె రీసెంట్ హిట్ 'మన శంకర వరప్రసాద్‌గారు' టాలీవుడ్ రీజనల్ సినిమాల్లో నంబర్‌వన్ హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం బాలకృష్ణ 'ఎన్‌బికె 111'లో కథానాయికగా నటిస్తున్నది నయనతార. ఇక తమిళంలో అయితే.. ఆమె చేతిలో చాలా సినిమాలున్నాయి. ఇదిలావుంటే.. రీసెంట్‌గా ఓ బాలీవుడ్ సినిమాకు నయన్ సైన్ చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్‌ఖాన్ హీరోగా రూపొందనున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి టాలీవుడ్ డైరెక్టర్ పైడిపల్లి వంశీ దర్శకుడు. దిల్‌రాజు నిర్మిస్తారట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానున్నది. ఇక నయన్ నటించిన తమిళ చిత్రం 'ముక్తీ అమ్మన్' సమ్మర్‌లో విడుదల ÷ానుంది.



# వెలుగులోకి సింథటిక్ డ్రగ్స్

**- ఈగిల్ ఫోర్స్ దాడుల్లో వెలుగులోకి సంచలన విషయాలు**



**హైదరాబాద్, మార్చి9( వెలుతురు):**
తెలంగాణలో భారీ సింథటిక్ డ్రగ్స్ రాకెట్‌ను పోలీసులు వెలుగులోకి తెచ్చారు. షాద్‌నగర్‌లో రహస్యంగా మెఫెడ్రోన్ డ్రగ్ తయారీ చేస్తున్న గ్యాంగ్ కార్యకలాపాలను ఈగిల్ ఫోర్స్ దర్యాప్తులో గుర్తించారు. ఈ కేసులో సంచలన విషయాలు బయటపడటంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. దర్యాప్తులో భాగంగా ఎస్సార్ ఇన్నోవేషన్స్ అనే సంస్థ ద్వారా డ్రగ్స్ తయారీలో ఉపయోగించే నిషేధిత రసాయనాలను సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. ముఖ్యంగా మెఫెడ్రోన్ తయారీలో ఉపయోగించే 2 బ్రోమో–4 మెథైల్ ప్రోపియోఫీనోన్ అనే రసాయనంతో పాటు, క్లోఫెడ్రోన్ తయారీలో ఉపయోగించే 3 క్లోరో–1 ఫెనైల్–1 ప్రోపనోన్ అనే కెమికల్స్‌ను సరఫరా చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ఎస్సార్ ఇన్నోవేషన్స్ డైరెక్టర్ షేక్ రఫీ కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. ఇండియా మార్ట్ ద్వారా రాజస్థాన్‌కు చెందిన నిందితులకు ఈ రసాయనాలను సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. రాజస్థాన్‌కు చెందిన గ్యాంగ్ మూడు విడతల్లో దాదాపు 300 కిలోల రసాయనాలను కొనుగోలు చేసినట్లు సమాచారం. నిందితులు తప్పుడు కంపెనీ పేర్లతో కెమికల్స్ కొనుగోలు చేసి షాద్‌నగర్‌లో అ÷–దదె గదిని తీసుకుని అక్కడే డ్రగ్స్ తయారీ చేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. తయారు చేసిన డ్రగ్స్‌ను తిరిగి రాజస్థాన్‌కు తరలించి విక్రయిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ గ్యాంగ్‌కు రాజస్థాన్‌కు చెందిన గిరీష్ థాపర్ అలియాస్ వీరేంద్ర స్వామి నాయకత్వం వహిస్తున్నాడు. నకిలీ పేర్లతో వ్యవహరిస్తూ డ్రగ్స్ తయారీకి అవసరమైన ముడి సరుకును సేకరించినట్లు పోలీసులు గుర్తించారు. గ్యాంగ్‌లో మనీష్ బిష్ణోయి, మనోజ్ మాథూర్, శిశుపాల్, సుమిత్, రాజు కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. ఈ కెమికల్స్ సరఫరాకు సంబంధించి లక్షల రూపాయల లావాదేవీలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈగిల్ పోలీసుల సమాచారంతో రాజస్థాన్ పోలీసులు వీరేంద్ర స్వామి, మనీష్ బిష్ణోయిని అదుపులోకి తీసుకున్నారు. వారి విచారణలో షాద్‌నగర్‌లో నడుస్తున్న డ్రగ్ ల్యాబ్ విషయం బయటపడింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నార్కోటిక్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల కేసు నమోదు చేశారు. పోలీసులు మరికొంతమంది నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

# ఏఐ మీద కాదు ప్రజారోగ్యం మీద దృష్టి పెట్టండి

**- పాలకల్తీ బాధితులను ఆస్పత్రిలో పరామర్శించిన షర్మిల**



**అమరావతి, మార్చి9( వెలుతురు):**
కల్తీ పాలు తాగిన ఘటనలో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం రాజమండ్రి ఆసుపత్రిలో ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యం గురించి తెలుసుకొని, బాధిత కుటుంబాలను ఓదర్చారు. ఈ ఘటనలో 11 మంది మరణించగా, ఇంకా 9 మంది ప్రాణాలతో కొట్టుమిట్టాడటం చూస్తే, రాష్ట్రంలో కనీసం స్వచ్ఛమైన పాలు కూడా అందించడంలో నిఘా పెట్టలేని ప్రభుత్వం ఉంటే ఎంత ఊడితే ఎంత అంటూ మండిపడ్డారు. ఏఐ మీద పెట్టే శ్రద్ధలో పావు వంతైనా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజారోగ్యం మీద పెట్టాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. జనాభా కనమని చెప్పడం కాదు. ఉన్న వాళ్లకు ప్రజారోగ్యంపై భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాజమండ్రి కల్తీ పాల ఘటనలో సంభవించిన 11 మరణాలు ప్రభుత్వం చేసిన హత్యలేనని ఆరోపించారు. చనిపోయిన కుటుంబాలకు 25 లక్షల పరిహారం ఇవ్వాలని, చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆమె డిమాండ్ చేవారు. రాష్ట్రంలో పాలు కల్తీ, నెయ్యి కల్తీ, మద్యం కల్తీ, వాగ్దానాలు కల్తీ. మొత్తం పాలనే కల్తీ అని విమర్శించారు. 11 ఏళ్లుగా లైసెన్స్ లేకుండా వరలక్ష్మి డైరీ నడుస్తుంటే చర్యలేవి ? తనిఖీలు ఎక్కడ ? అంటూ ప్రశ్నించారు. ఈ ఘటన యాదృచ్ఛికం కాదు .. పూర్తి నిర్లక్ష్యమని అన్నారు. సైతాన్ సైన్యానికి ఆపద వస్తే తప్పా జగన్ మోహన్ రెడ్డి సైతం బయటకు రారని ఆరోపించారు.

# పోలవరం జిల్లాలో పులి సంచారం

**- 20 రోజులుగా స్థానికుల ఆందోళన**



**పోలవరం, మార్చి9( వెలుతురు):**
పోలవరం జిల్లాలో గత 20 రోజులుగా పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. ఈ పులి మొదట్లో పోలవరం జిల్లాలోని అడవి ప్రాంతాల్లో, రంపచోడవరం, అడ్డతీగల మండలాల పరిసరాల్లో కనిపించింది. ఆ తర్వాత కొన్ని రోజుల పాటు తూర్పు గోదావరి జిల్లాలోకి వెళ్లి, ఏలేశ్వరం మండలం పరింతడక, మర్రివీడు ప్రాంతాల్లో పశువులపై దాడులు చేసింది. అక్కడ గేదెలు, దూడలను దాడి చేసి చంపేసింది. దీంతో అటవీ అధికారులు అప్రమత్తమై, పులిని బంధించేందుకు విస్తృతంగా చర్యలు చేపట్టారు. అయితే, పులి మళ్లీ తప్పించుకుని పోలవరం జిల్లాలోనికి తిరిగి ప్రవేశించింది. ప్రస్తుతం రాజవొమ్మంగి రేంజ్ పరిధిలోని సర్రంపేట అడవి ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు సమీప గ్రామాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అటవీ ప్రాంతాలకు వెళ్లవద్దని, ఒంటరిగా తిరగవద్దని సూచించారు. పశువులను అడవి ప్రదేశాలకు తీసుకెళ్లి మేపవద్దని, రాత్రి వేళల్లో బయటకు రావద్దని, పశువులను సురక్షితంగా ఉంచాలని కోరారు. పులిని సురక్షితంగా బంధించేందుకు పెద్ద ఎత్తున గాలింపు, ఆపరేషన్ చర్యలు కొనసాగుతున్నాయి. ఇటీవల వీరభద్రపురం, కొనలోవ, గొండోలు, గవరయ్యపేట, కొట్టంపాలెం వంటి గ్రామాల పరిసరాల్లో పులి జాడలు, పాదముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించిన విషయం తెలిసిందే. యేలేరు రిజర్వాయర్ పరివాహక ప్రాంతం నుంచి రాజవొమ్మంగి అటవీ ప్రాంతంలోకి పులి ప్రవేశించినట్లు ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం

**- హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో 5 కే రన్ ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్**









**హుస్నాబాద్ వెలుతురు మార్చి 09:**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో 5 కే రన్ ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మీ, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్ లు ,ఇతర ముఖ్య నేతలు, అధికారులు భారీగా హాజరైన 5 కే రన్ లో భారీగా పాల్గొన్న విద్యార్థులు , పట్టణ ప్రజలు మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా మార్చి 6 నుండి జూన్ 12 వరకు కార్యక్రమాలు చేస్తుంది.. సోమవారం రోజున 5 కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించింది.. మనం అనారోగ్యానికి గురి కాకుండా మనం నివసించే ప్రాంతాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.. గ్రామ పంచాయతీ,నగర పాలక ప్రజా ప్రతినిధులు ఇందులో భాగస్వాయమై ప్రజలను చైతన్యపరచాలి.. అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టడానికి హుస్నాబాద్ మున్సిపాలిటీ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.. హుస్నాబాద్ స్వచ్ఛత కార్యక్రమంలో పాలకవర్గం తీసుకున్న ఏ కార్యక్రమంలో అయినా ప్రజలంతా పాల్గొనాలి.. మీరు నివసిస్తున్న ప్రాంతాలు , వార్డుల్లో పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు , ఉదయం లేవగానే శారీరక వ్యాయామం చేయాలి.. మన ఇళ్లలో పాడైపోయిన టీవీ , ఫ్రిడ్జి ,వాషింగ్ మిషన్స్ ఇలా ఈ వ్యర్థాల సేకరించి రీసైక్లింగ్ పంపించాలి.. మీ ఇంట్లో వృథాగా ఉన్న వస్తువులు వెంటనే తొలగించాలి... శానిటేషన్ చేయాలి.. హుస్నాబాద్ లో ఉన్న ఖాళీ స్థలాల్లో నీళ్ళు నిల్వ ఉండి దోమల బెడద కు కారణమవుతున్నాయి.. వాటిని నివారించాలి ప్రతి రోజోక కార్యక్రమాన్ని నిర్వహిస్తూ 99 రోజుల పాటు ప్రజా సమస్యలు పరిష్కారం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలి.. డ్రింకింగ్ వాటర్ సమస్య, డ్రైనేజీ ఇతర ఏ సమస్యలు ఉన్న మున్సిపల్ నుండి పరిష్కారం అవుతాయి.. రాబోయే వేసవికాలం లో తాగునీటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.. నీటిని పొదుపుగా వాడుకోవాలి.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి.. ఆరోగ్యంగా ఉండేలా వైద్య పరీక్షలు నిర్వహించాలి.. క్రీడల నిర్వహణ,యువజన కార్యక్రమాలు చేయాలి.. జూన్12 వరకు జరిగే ఈ కార్యక్రమాల్లో హుస్నాబాద్ నియోజకవర్గం అగ్రగామిగా ఉండాలి..

# "సంగారెడ్డి, జనగాం, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో బాల్య వివాహాల నిర్మూలనకు వేగం పెంచిన 'బాల్య వివాహ విముక్తి రథం"

- **డాక్టర్ బండి సాయన్న అధ్యక్షులు స్కోప్ సంస్థ**
- **గ్రామాలు, పట్టణాల్లో పర్యటిస్తూ బాల్యవివాహాలపై అవగాహన కల్పించిన అవగాహన రథం.**
- **విద్యార్థులు, మతపెద్దలు, పంచాయతీలు, వివాహ సేవలందించే వర్గాలతో మూడు దశల్లో ప్రచారం.**
- **బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రజలతో ప్రతిజ్ఞ చేయించి చట్టపరమైన అవగాహన.**
- **బాల్యవివాహం అనేది పిల్లలపై అత్యాచారంతో సమానం ఇది చట్టపరంగా శిక్షార్హమైన నేరం.**




సంతకం పెడుతున్న డాక్టర్. బండి సాయన్న ప్రెసిడెంట్ స్కోప్



డాక్టర్ కడియం కావ్య ఎంపీ



చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎంపీ



మాధవనేని రఘునందన్ రావు ఎంపీ



సంతకం పెడుతున్న మాధవనేని రఘునందన్ రావు ఎంపీ

**సంగారెడ్డి జిల్లా వెలుతురు మార్చి 09:**
భారత ప్రభుత్వం మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రారంభించిన 100 రోజుల తీవ్ర అవగాహన కార్యక్రమంలో భాగంగా 'బాల్య వివాహ విముక్త రథం' సంగారెడ్డి, జనగాం,యాదాద్రి భువనగిరి జిల్లాలలో గ్రామాలు, పట్టణాల్లో పర్యటిస్తూ బాల్యవివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించింది. ఈ ప్రాముఖ్యమైన ప్రయాణం ముగిసిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్ ) సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, తమ స్వచ్ఛంద ప్రయత్నాలకు సమాజం నుండి వచ్చిన విపరీతమైన స్పందన వల్ల సంగారెడ్డి, జనగాం, యాదాద్రి భువనగిరి జిల్లాలను బాల్యవివాహ రహిత జిల్లాలుగా మార్చే లక్ష్యం త్వరలోనే సాధ్యమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. స్కోప్ సంస్థ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రెన్ (జే ఆర్ సి ) అనే దేశవ్యాప్తంగా 250కు పైగా స్వచ్ఛంద సంస్థలతో పనిచేస్తున్న అతిపెద్ద బాలల హక్కుల నెట్వర్కు భాగస్వామ్య సంస్థగా పనిచేస్తోంది. జిల్లాల్లో నిర్వహించిన బాల్య వివాహ విముక్తి రథాన్ని జనగాం జిల్లాలో డాక్టర్ కడియం కావ్య, ఎంపీ, సంగారెడ్డి జిల్లాలో మాధవనేని రఘునందన్ రావు, ఎంపీ, యాదాద్రి భువనగిరి జిల్లాలో చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎంపీ ప్రారంభించారు. 30 రోజుల పాటు కొనసాగిన ఈ కార్యక్రమంలో రథం మూడు జిల్లాల్లో కలిపి మొత్తం 9,300 కిలోమీటర్లు ప్రయాణించింది. ఇందులో సంగారెడ్డి జిల్లాలో 3,450 కి.మీ, జనగాం జిల్లాలో 2,700 కి.మీ, యాదాద్రి భువనగిరి జిల్లాలో 3,150 కి.మీ ప్రయాణించింది. ఈ ప్రచారం ద్వారా మొత్తం 1,100 గ్రామాలు చేరుకోబడ్డాయి (సంగారెడ్డి 485, జనగాం 250, యాదాద్రి భువనగిరి 365). అలాగే 5,32,750 మంది ప్రజలతో నేరుగా సంప్రదింపులు జరిగాయి (సంగారెడ్డి 2,18,250; జనగాం 1,32,000; యాదాద్రి భువనగిరి 1,82,500). అదేవిధంగా రథం 2,926 విద్యాసంస్థలను (సంగారెడ్డి 1,619; జనగాం 524; యాదాద్రి భువనగిరి 783) మరియు 2,419 మతపరమైన ప్రదేశాలను (సంగారెడ్డి 886; జనగాం 532; యాదాద్రి భువనగిరి 1,001) సందర్శించింది. ఈ సందర్భంగా 2,522 మంది మతపెద్దలు (సంగారెడ్డి 1,092; జనగాం 670; యాదాద్రి భువనగిరి 760) బాల్యవివాహాల వ్యతిరేక ప్రచారంలో భాగస్వాములయ్యారు. "చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా" కార్యక్రమం ప్రారంభమై ఒక సంవత్సరం పూర్తైన సందర్భంగా మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ 2025 డిసెంబర్ 4న దేశవ్యాప్తంగా 100 రోజుల అవగాహన కార్యక్రమాన్ని ప్రకటించింది. ఈ కార్యక్రమంలో భాగంగా జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రెన్ భాగస్వామ్య సంస్థలు దేశంలోని 439 జిల్లాల్లో 'బాల్య వివాహ విముక్తి రథం' కార్యక్రమాలను ప్రారంభించి బాల్యవివాహాల వల్ల కలిగే హానికర ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించాయి. ఈ రథం గ్రామాలు, పట్టణాల్లో పర్యటిస్తూ బాల్యవివాహాలు ఆరోగ్యం, విద్య, జీవనోపాధిపై కలిగించే దుష్ప్రభావాలను వివరించింది. అలాగే బాల్యవివాహం చట్టపరంగా శిక్షార్హమైన నేరమని ప్రజలకు స్పష్టంగా తెలియజేసింది. రథం ప్రధాన రహదారులు, అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో పర్యటించగా, మోటార్సైకిల్ మరియు సైకిల్ ర్యాలీలు దూర ప్రాంతాలు, చేరుకోవడానికి కష్టమైన గ్రామాలకు చేరుకుని ఈ సందేశాన్ని చివరి గ్రామం వరకు తీసుకెళ్లాయి. స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్ ) అధ్యక్షుడు డాక్టర్ బండి సాయన్న మాట్లాడుతూ ఈ 100 రోజుల అవగాహన కార్యక్రమం బాల్య వివాహ విముక్తి రథాన్ని మార్పుకు నాంది పలికిన ఉద్యమంగా అభివర్ణించారు. "ఇది కేవలం ప్రతీకాత్మక ప్రయాణం కాదు. ఇది మార్పు కోసం సాగిన చైతన్య రథయాత్ర. ప్రజలు దీన్ని స్వాగతించి అభినందించారు. ఈరోజు ప్రపంచవ్యాప్తంగా బాల్యవివాహం ఒక సామాజిక చెడు మాత్రమే కాకుండా వివాహం పేరిట జరిగే బాలలపై అత్యాచారం అని అంగీకరిస్తున్నారు. ఇది చట్టపరంగా శిక్షార్హమైన నేరం. బాల్యవివాహం ఒక బాలిక భవిష్యత్తును నాశనం చేసి ఆమెను పోషకాహార లోపం, నిరక్షరాస్యత, పేదరికం అనే దుష్చక్రంలోకి నెడుతుంది" అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం, పరిపాలన మరియు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఈ ప్రచారం ప్రజల భాగస్వామ్యంతో కూడిన ఒక ప్రజా ఉద్యమంగా మారిందని ఆయన తెలిపారు. అందరి సహకారంతో బాల్యవివాహాల నిర్మూలనకు చట్టం, రక్షణ మరియు బాధ్యత అనే సంకల్పాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్లామని చెప్పారు. ఈ ప్రచారం మూడు దశల్లో నిర్వహించబడింది. మొదటి దశలో విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు బాల్యవివాహాల హానికర ప్రభావాల గురించి తెలియజేశారు. రెండో దశలో మతపెద్దలను సంప్రదించి వివాహం జరిపే ముందు వధూవరుల వయస్సును ధృవీకరించాలని, బాల్యవివాహాలు జరపకుండా నిరాకరించాలని కోరారు. అలాగే క్యాటరర్లు, డెకరేటర్లు, బ్యాంక్వెట్ హాల్ యజమానులు, బ్యాండ్ వాద్యకారులు, గుర్రాల సరఫరాదారులు వంటి వివాహ సేవలందించే వారిని బాల్యవివాహాలకు సేవలు అందించవద్దని కోరారు. ఎందుకంటే బాల్యవివాహంలో ఏ రూపంలోనైనా సహకరించడం కూడా చట్టపరంగా శిక్షార్హమే. మూడో దశలో పంచాయతీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి గ్రామ ప్రజలతో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు మరియు వాటిని నిషేధించే చట్టాల గురించి వివరించారు.

## ఎనిమిదేళ్ల యుద్ధానికైనా సిద్ధం

కోసమే అమెరికా ఈ యుద్ధం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇరాన్‌ను బలహీనపర్చి, దేశ సార్వభౌమత్వానికి భంగం కలిగించడమే లక్ష్యంగా అమెరికా, ఇజ్రాయెల్ పనిచేస్తున్నాయని మండిపడ్డారు. ఆ రెండు దేశాలు కలిసి దాడులు చేయడానికి ముందు కూడా, చాలా విడతల దౌత్య చర్చల్లో ఇరాన్ పాల్గొందని ఇస్మాయిల్ బఘయీ గుర్తుచేశారు. ఇప్పుడు అమెరికా, ఇజ్రాయెల్‌లు తమ సైనిక చర్యను సమర్థించుకునేలా ప్రకటనలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇస్మాయిల్ బఘయీ ఈ కామెంట్స్ చేశారు."ఇరాన్ సార్వభౌమత్వానికి భంగం కలిగించాలని అమెరికా, ఇజ్రాయెల్ భావిస్తున్నాయి. మా దేశ ప్రజలను ఓడించాలని ఆ రెండు దేశాలు అనుకుంటున్నాయి. మానవత్వానికి విఘాతం కలిగించేలా అవి ప్రవర్తిస్తున్నాయి. ఇప్పుడు ఇవన్నీ అందరికీ తెలుసు. మేం మరింత వివరించాల్సిన అవసరమే లేదు. వెనెజువెలాలాగే ఇరాన్‌లోని అపారమైన చమురు సంపదపైనా అక్రమంగా నియంత్రణ పొందాలని అమెరికా భావిస్తోంది. వెనెజువెలా (17.17 శాతం), ఇరాన్(11.82 శాతం)లలోని 31 శాతం చమురు వనరులపై పట్టు సాధించాలని ఆ దేశం అనుకుంటోంది. ఇదే అమెరికా అతిపెద్ద వ్యూహం. దీనిపై ఎలాంటి సందేహమూ అక్కర్లేదు" అని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘయీ పేర్కొన్నారు. "మా దేశ భూభాగాన్ని, సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు మేం పోరాడుతూనే ఉంటాం. శత్రుదేశాలు చేస్తున్న క్రూరమైన దాడులను ఎదుర్కొని తీరుతాం. ఇజ్రాయెల్‌కు సాయం చేసేందుకే ఈ యుద్ధంలోకి దిగామని అమెరికా బహిరంగంగానే ఒప్పుకుంది. ఈవిషయాలన్నీ ప్రజలకు స్పష్టంగా అర్థమయ్యాయి. ఇరాన్ ప్రజలూ ఇవన్నీ గ్రహించారు" అని ఇస్మాయిల్ బఘయీ తెలిపారు. హెజ్బుల్లా, హమాస్, హౌతీల వంటి సంస్థలను ఆయన సమర్థించారు. ఇజ్రాయెల్ అణచివేతకు వ్యతిరేకంగానే వారు పోరాడుతున్నారని, మానవత్వం లేని పరిస్థితుల్లో బతుకుతున్న వారు తిరగబడటంలో తప్పులేదని అన్నారు. అలాగే పొరుగు దేశాలైన యూఏఈ, కువైట్, బహ్రెయిన్ వంటి వాటిపై దాడుల గురించి స్పందిస్తూ.. మా భూభాగంపై దాడి చేయడానికి అమెరికాకు మీ నేలని ఇవ్వకండి. ఒకవేళ అమెరికా దాడులకు మీరు సహకరిస్తే, మమ్మల్ని మేము కాపాడుకునే హక్కు మాకు ఉంటుంది అని కీలక హెచ్చరిక చేశారు. భారత్‌కు కూడా ఈ యుద్ధ సెగ తగులుతుందని, చమురు ధరల పెరుగుదల వల్ల నష్టపోయే భారత్ కూడా ట్రంప్‌పై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హోర్ముజ్ జలసంధిని మూసివేయడంపై కూడా ఆయన స్పందించారు. ఇప్పటి వరకు ఇరాన్ దానిని మూసివేయలేదని, కానీ ఒకవేళ ఆ పరిస్థితి వస్తే మాత్రం అది అందరికీ మూసుకుపోతుందని హెచ్చరించారు. మరోవైపు యుద్ధంలో రష్యా, చైనా మద్దతుపై వస్తున్న వార్తలను ఆయన కేవలం మీడియా ఊహాగానాలుగా కొట్టిపారేశారు. శాంతి స్థాపన జరగాలంటే ప్రపంచ దేశాలు ట్రంప్, నెతన్యాహు దగ్గరకు వెళ్లి యుద్ధం ఆపమని చెప్పాలని, బాధితులైన ఇరాన్‌ను నియంత్రించమనడం సబబు కాదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com